ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-8-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 181 పేజీలు: 12 వెల: 6.50


**ఉత్తరాదిన భారీ వర్షాలు: హిమాచల్‌లో 170 మంది మృతి**

**మాలేగాం పేలుళ్ల కేసులో ఏడుగురు నిందితులు నిర్దోషులే**

5లో

# హరిత రాజధాని అమరావతి

## ఎటు చూసినా ప్రకృతి అందాల పరిమళం

## ఔషధ మొక్కలకు ప్రాధాన్యంతో హరిత ప్రణాళిక

## సింగపూర్ బిడదారి ప్రాజెక్టు తరహా నిర్మాణాలు

## గ్రీన్, బ్లూ మాస్టర్‌ప్లాన్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష



**విజయవాడ, జూలై 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నగరాన్ని అతిపెద్ద లంగ్ స్పేస్ నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి ఇన్ నేచర్ అనే కాన్సెప్టుతో హరిత ప్రణాళికల్ని అమలు చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్‌బ్లూ మాస్టర్ ప్లాన్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాజధానిలో నిర్మితం అవుతున్న ప్రధాన ట్రంక్‌రోడ్లు, అనుబంధ రహదారులు, ఎల్పీఎస్ లేఅవుట్లవద్ద నిర్మించే రహదారులు, బఫర్ జోన్లు, గ్రీన్ జోన్లు, ముఖ్యమైన కూడళ్లను అత్యంత ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు వీలుగా పచ్చదనాన్ని పెంపొందించాలని సిఎం స్పష్టంచేశారు. రహదారుల వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో పార్కులు, హరిత ప్రాంతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఔషధమొక్కలు నాటటంతోపాటురాజధాని ప్రాంతం అంతా జీవ వైవిధ్య ప్రాంతంగా మారాలని పేర్కొన్నారు. గ్రీన్ బెల్ట్, బఫర్ జోన్లలో దేశీయ వృక్ష జాతులు ఉండేలా చూడాలని సూచించారు. అలాగే రివర్ ఫ్రంట్‌ను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు.

**బ్లూ, గ్రీన్, పుష్ప వికసిత రాజధాని.**

గ్రీన్, బ్లూ నగరంగా అమరావతిని తీర్చిదిద్దటంతో పాటు ఏడాది పొడవునా వివిధ కాలాల్లో వేర్వేరు జాతుల పుష్పాలు వికసించి ఆహ్లాద పరిచేలా మొక్కలు నాటాలని సిఎం పేర్కొన్నారు. ప్రజలు, పర్యాటకులు వాటి గురించి మాట్లాడుకునేలా ఈ పుష్పాలు సీజన్ల వారీగా వచ్చేలా ప్రణాళిక చేపట్టాలని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో వివిధ ఫల, పుష్ప జాతులకు చెందిన మొక్కలు, చెట్లు ఉండేలా కార్యాచరణ చేపట్టాలని ఎడిసి అధికారులకు సూచించారు.

అమరావతిని సుందరంగా తీర్చిదిద్దేందుకు బెంగళూరు నగరంతో పాటు సింగపూర్ సహా వివిధ ప్రాంతాలను కూడా పరిశీలించాలని పేర్కొన్నారు. అలాగే ఔషధ మొక్కలు, అరుదైన, అంతరించిపోతున్న జాతుల మొక్కలు, వృక్షాలను కూడా సంరక్షిస్తున్న ప్రాంతంగా అమరావతి ఉండాలని సూచించారు. ఔషధ మొక్కలను పెంచేందుకు ప్రముఖ యోగాగురు బాబారామ్ దేవ్ నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎపిలో నర్సరీలు కలిగిన ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన కడియంను కూడా ప్రోత్సహించేలా చూడాలన్నారు. హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకూ వివిధ ప్రాంతాల్లో ఉన్న దేశీయ వృక్ష జాతులను కూడా అమరావతిలో పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ గ్రీన్ ప్రాంతం అంతా కాలుష్యాన్ని నియంత్రించటంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ఉండాలని స్పష్టం చేశారు. అమరావతి బ్యూటిఫికేషన్ ప్రణాళికలో స్థానికంగాఉన్న యూనివర్సిటీలు, విద్యార్థుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. చారిత్రక నగరంగా అమరావతి సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడటంతో పాటు ఆధునికంగా పార్కులను తీర్చిదిద్దాలని అన్నారు.

**సేదదీరేలా కృష్ణా రివర్ ఫ్రంట్**

రాజధాని అమరావతి నగరంలోనూ అత్యంత నాణ్యమైన, అందరికీ అందుబాటులో గృహ నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సింగపూర్‌లోని బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు తరహాలోనే రాజధాని నగరంలో గృహ నిర్మాణ ప్రాజెక్టుల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చెట్లు, పార్కులు నిర్మించాలని స్పష్టం >>2



## సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కి షాక్

## ముందస్తు బెయిలును రద్దు చేసిన 'సుప్రీం'

## 3 వారాల్లో లొంగిపోవాలని ఆదేశం

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి సిఐడి మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ ఈ మేరకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు లొంగిపోవడానికి సంజయ్‌కు 3 వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, అదే విధంగా బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

అగ్నిమాపక విభాగం డిజిగా చేసిన సమయంలో నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ నిర్ధారించినట్లు వివరాలను రాష్ట్రప్రభుత్వం కోర్టుకు అందజేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో సంజయ్‌పై ఎపి ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఆయనకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి ధర్మాసనం తాజాగా గురువారం తీర్పు వెలువరించింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు ఇవ్వడంపైనా గత విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తిచేసినట్లు ఉందంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. >>2

## రేపటి నుంచి 'అన్నదాతా సుఖీభవ'

### మొదటి విడతలో ఒక్కో రైతుకు రూ. 5 వేలు

**విజయవాడ, జూలై 31,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఆగస్ట్ 2న అమలు చేయాలని నిర్ణయించినట్లు సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. రైతులకు విడుతల వారిగా అందించే పెట్టుబడి సాయంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది.ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో ఈపథకాన్ని సిఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. దీంతో రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు లబ్ది పొందుతారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5,000 చొప్పున మొత్తం రూ.2,342.92 కోట్ల నిధుల్ని వారి ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేయనుంది. 'అన్నదాత సుఖీభవ' అమలు సన్నద్ధతపై గురువారం సచివాలయంలో ఆర్థిక, రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలోపాల్గొన్న జిల్లా కలెక్టర్లకు సిఎం పలు ఆదేశాలు జారీ చేశారు.

అర్హులైన ప్రతీ రైతుకూ అన్నదాత సుఖీభవ అందాలని, రైతులకు చేయూతనివ్వడం భారం కాదు.. బాధ్యతగా గుర్తు పెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. >>2

# సింగపూర్ పెట్టుబడులు రూ. 45 వేల కోట్లు!

## వచ్చే ఐదేళ్లలో రానున్న వివిధ ప్రాజెక్టులు

## రికార్డులను సరిచేయడానికే సింగపూర్ పర్యటన

## 4 రోజుల్లో సిఎం 26 ముఖాముఖి సమావేశాలు

## పర్యటన వివరాలు వెల్లడించిన మంత్రి లోకేష్



గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే అయిదేళ్లలో గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్టిమెంట్ కార్పొరేషన్ (జిఐసి) సింగపూర్ సావరిన్ ఫండ్ ద్వారా ఎపిలో 45వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని రాష్ట్ర విద్య, ఐటి, శాఖల మంత్రి నారా లోకేష్. తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 4రోజులపాటు విజయవంతంగా సింగపూర్‌లో పర్యటన పూర్తిచేశాం, ఇది రాష్ట్రంలో యువతకు గుడ్ న్యూస్, జగన్‌కు బ్యాడ్ న్యూస్ అని రాష్ట్ర విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖలమంత్రి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రానికి పెట్టుబడుల సాధన, బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 4రోజుల పాటు నిర్వహించిన సింగపూర్ టూర్ విశేషాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 1995నుంచి సింగపూర్‌తో సిఎం చంద్రబాబుకు అనుబంధం ఉంది. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి నేరపూరిత రాజకీయాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఉదయం 8 నుంచి రాత్రి 11.30వరకు రాష్ట్రంకోసం అహర్నిశలు కష్టపడుతున్నారు. సిఎంతోపాటే మేంకూడా పోటీపడి పనిచేస్తున్నాం. రికార్డులను సరిచేయడానికే వెళ్లామన్నారు. అధికారంలో ఉన్నా,లేకపోయినా చంద్రబాబును అక్కడి ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు.

**పెట్టుబడులను అడ్డుకునేందుకు కుట్ర..**

మురళీకృష్ణ అనే వ్యక్తి సింగపూర్ ప్రభుత్వానికి మంత్రులు, అధికారులు, హైకమీషనర్‌కు రాష్ట్రంలో అస్థిరమైన ప్రభుత్వం ఉందని, పెట్టుబడులు పెట్టొద్దని ఈ మెయిల్ పంపారు. మేం ఆరా తీస్తే ఆ వ్యక్తి పెద్దిరెడ్డికి చెందిన పిఎల్ఆర్ కంపెనీతో, వైసిపి నేతలతో తరచూ మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునేందుకే ఇటువంటి కుట్రలకు తెరలేపారు. టిసిఎస్‌కు 99 పైసలకే భూములిస్తే కోర్టులో కేసులు వేశారు. చెన్నయ్‌లో ఒక కంపెనీకి ఇబ్బంది వస్తే రాజకీయాలకు అతీతంగా అక్కడ రాజకీయా పక్షాలన్నీ సింగపూర్ హైకమిషనర్ వద్దకు వెళ్లారు. రాజకీయ పోరాటం చెన్నయ్ వరకే, బయటకు వచ్చాక మేమంతా తమిళనాడు వాళ్లం, రాష్ట్రం కోసం కలసికట్టుగా ప్రయత్నిస్తామని వారుచెప్పారు. మన రాష్ట్రంలో రాష్ట్రాభివృద్ధి కోసం బాండ్స్ విడుదల చేస్తే ఆర్ బిఐ నుంచి అందరికీ ఈమెయిల్ ద్వారా తప్పుడు ఫిర్యాదులు చేశారు. ఇటువంటి వారివల్లే ఎపి బ్రాండ్ పడిపోతుంది.

**పట్టుదలతో పరిశ్రమలు రప్పిస్తున్నాం**

సిబిఎన్ 4.0 అంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. 2024లో గెలిచిన వెంటనే ఆదిత్య మిట్టల్‌తో జూమ్ కాల్‌లో చర్చించాను. ఎన్ ఎండిసి రా మెటీరియల్ కోసం సిఎంతో మాట్లాడి గ్రీన్ సిగ్నల్ ఇప్పించాను. ప్రధానితో ఈ విషయమై 3సార్లు చంద్రబాబు మాట్లాడారు. త్వరలో ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేస్తాం.

2029 నాటికి కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభమవుతుంది. భారతదేశంలోనే అతిపెద్ద డాటా సెంటర్ విశాఖకు రాబోతోంది. ముంబాయి వెళ్లి టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ తో చర్చలు జరిపామన్నారు. దాంతో టాటా పవర్, టిసిఎస్ రాష్ట్రానికి వచ్చాయి.

టాటా పవర్ 7గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను ఏర్పాటుచేయబోతోంది. దావోస్ కి వెళ్లినపుడు కాగ్నిజెంట్ సిఇఒను కలిశా. విశాఖవస్తే 99 పైసలకు భూమి ఇస్తామని టిసిఎస్ రావడంతో ఆ తర్వాత కాగ్నిజెంట్ వచ్చింది.

రాబోయే నాలుగేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. >>2



## మహిళల ఉచిత బస్సుకు 'స్త్రీశక్తి' పేరు

### 15 నుంచి అమలుకు సర్కార్ చర్యలు

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ అమలుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకానికి పేరు ఖరారైంది. మహిళాలోకం శక్తిని చాటేలా 'స్త్రీ శక్తి' అనే పేరును రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. పేరుకు తగ్గట్టుగానే పథకాన్ని శక్తివంతంగా, సమర్థంగా అమలు చేసేందుకు సర్కారు పక్కాగా చర్యలు తీసుకుంటోంది. జీరో ఫెయిర్ టికెట్ జారీ కోసం నేటి నుంచి ఆర్టీసీ సిబ్బందికి డిపోల్లో శిక్షణ ఇచ్చేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. సూపర్ సిక్స్‌లో >>2

## 31న కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీనీవా నీళ్లు

**విజయవాడ, జూలై31, ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలోకి వృధాగా పోతున్న నీటితో రిజర్వాయర్లు నింపాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులకు ఈ నీటిని తరలించాలని సిఎం దిశానిర్దేశం చేశారు. గురువారం సచివాలయంలో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు సమర్ధ నీటి నిర్వహణపై జల వనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ నీటి బొట్టును సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక ఉండాలని సిఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల్లో 771 టీఎంసీల మేర నీటినిల్వలు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మధ్య స్థాయి ప్రాజెక్టుల్లో 43 టీఎంసీలు, చిన్న నీటి చెరువుల్లో 67 టీఎంసీల మేర నీరు నిల్వ ఉందని తెలిపారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వాయర్లు, చెరువుల్లో 882 టీఎంసీల మేర నీరుఉన్నట్టు వివరించారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహాలు కొనసాగుతున్నందున రాయలసీమలోని ప్రాజెక్టులకు నీటిని తరలించే అంశంపై సీఎం అధికారులకు దిశా నిర్దేశంచేశారు. నదుల్లోకి ఇంకా ఎన్నిరోజుల పాటు ప్రవాహాలు కొనసాగే అవకాశం ఉందని ఆరా తీశారు. సోమశిల, కండలేరు, గండికోట,తదితర రిజర్వాయర్లన్నీ నింపాలని సిఎం ఆదేశించారు.



గురువారం సింగపూర్‌లో జెటిసి పౌల్ట్రీ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులతో మంత్రి నారాయణ

## అమరావతిలో అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థ

### సింగపూర్ ల్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులతో మంత్రి నారాయణ భేటీ

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతికి ప్రజా రవాణా వ్యవస్థను అత్యంత ఆధునీకంగా ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ చేసారు.ఇందులో భాగంగా సింగపూర్‌లో రవాణా, రహదారి వ్యవస్థను పరిశీలిస్తున్నామన్నారు. ఆ దిశలో సింగపూర్‌లో సంస్థల సహకారం తీసుకుంటున్నామన్నారు. సింగపూర్‌లో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణపర్యటన కొనసాగుతోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించి ఆయన అధ్యయనం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం సింగపూర్ ల్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులతో మంత్రి నారాయణతో పాటు సీఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి ప్రాంతంలో రోడ్డు రవాణాపై వారితో చర్చించారు. సింగపూర్‌లో ఉపరితల రవాణా మౌలిక వసతుల కల్పనను ల్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ పర్యవేక్షిస్తోంది. ప్రజా రవాణా వ్యవస్థ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌ల ఏర్పాటును ఈ అథారిటీ పర్యవేక్షించనుంది. ఇక సింగపూర్‌లో జెటిసి పౌల్ట్రీ ప్రాసెసింగ్ హబ్‌ను సైతం మంత్రి నారాయణ బృందం సందర్శించింది.

ఈ యూనిట్ సింగపూర్‌లోని మొట్టమొదటి వన్ స్టాప్ పౌల్ట్రీ ప్రాసెసింగ్ యూనిట్‌గా పని చేస్తుంది. అంటే.. లైవ్ చికెన్, చికెన్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, డెలివరీ చేస్తున్న విధానాలను ఈ బృందం అధ్యయనం చేసింది. ఇక చికెన్ వ్యర్థాలతో సైతం ఇతర ఉత్పత్తులను ఈ యూనిట్ తయారు చేస్తుంది. రాష్ట్రంలో చికెన్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసే ఈ తరహా యూనిట్లను ఏర్పాటు చేసే దిశా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. బ్రాండ్ ఎపి ప్రమోషన్ కోసం.. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమేలక్ష్యంగా జులై 26వ తేదీన సింగపూర్‌కు సిఎం చంద్రబాబు, >>2

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన



గురువారం నెల్లూరులో మీడియాతో మాజీ సిఎం జగన్

## సూపర్ సిక్స్‌ల పేరుతో ప్రజలకు వెన్నుపోటు

## ప్రెస్‌మీట్‌లు పెడితే కేసులు నమోదా?

## ప్రతి నియోకవర్గంలో బెల్ట్ షాపులు, ఎమ్మెల్యేలకు ముడుపులు: మాజీ సిఎం జగన్ విమర్శలు

**నెల్లూరు, జూలై 31 ప్రభాతవార్త:** ప్రజలు ప్రతిపక్ష నేతను కలవకుండా రోడ్లు అడ్డంగా తొవ్వించిన నాయకుడు చంద్రబాబునాయుడు అని ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంట్లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తుందని విమర్శించారు. నేను వస్తున్నానని 2 వేల మంది పోలీసుల్ని మోహరించారు. డిఐజి కూడా నెల్లూరులో తిష్ట వేయడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు.

ప్రతిపక్షనేతను చూస్తే ఎందుకయ్యా నీకంత భయం అని ఎద్దేవచేశారు. సూపర్ సిక్స్‌లపేరుతో చంద్రబాబు నాయుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. వైఎస్సార్సీ నేతలందర్ని అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారని ఈ దుర్మార్గపు పాలన ఎంతో కాలం కొనసాగదని ఆయన విమర్శించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై 14 కేసులు,మిధున్‌రెడ్డి అరెస్టు, వల్లభనేని వంశీ అరెస్టు, పెర్నేనినాని, ఆయన సతీమణిని కూడా అరెస్టు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొడుకును అరెస్టు చేయించాడు, చిన్నతనంలో జరిగిన సంఘటనను గుర్తు పెట్టుకొని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపైన కక్ష సాధిస్తున్నాడు. రైతు భరోసాని చంద్రబాబు నాయుడు కూని చేశారు. రాష్ట్రంలో లాండ్ ఆర్డర్ దిగజారిపోయింది. రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో పరిపాలన సాగుతోంది. ప్రసన్న >>2




గురువారం ఆపరేషన్ ట్రేస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిజిపి హరీష్ గుప్తా

## 'ఆపరేషన్ ట్రేస్'

### రాష్ట్రంలో తప్పిపోయిన బాలికలను గుర్తించే ప్రత్యేక కార్యక్రమం

### నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో తప్పిపోయిన బాలికలను గుర్తించి, వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఉద్దేశించిన ప్రత్యేక కార్యక్రమం ఆపరేషన్ ట్రేస్ ప్రారంభమైందని డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను >>2



గురువారం తులసీదాస్ జయంతి సందర్భంగా చిత్రకూట్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# హరిత రాజధాని అమరావతి

>> చేశారు. 250 ఎకరాలప్రాంతంలో 10 వేల మంది నివసించేలా బిడదారి ఎస్టేట్ ను నిర్మించారన్నారు. అలాగే ప్రకృతిలో సేదదీరేలా వివిధ ప్రాంతాలను తీర్చిదిద్దాలన్నారు. రాజధానిలో నిర్మించే వివిధ పార్కుల్లో వివిధ దేశాల పేర్లను పెట్టటంతోపాటు ఆయా దేశాల్లో పెరిగే పుష్ప జాతుల మొక్కలు ఉండేలా చూడాలన్నారు. ప్రధాన రహదారులకు ప్రకృతి పేర్లు కలిసొచ్చేలా పెట్టాలని స్పష్టం చేశారు. అలాగే అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగు సహా కాలువల వ్యవస్థను కూడా అత్యంత సుందరంగా కనిపించేలా ప్రణాళికలు చేయాలని స్పష్టం చేశారు. కృష్ణాతీరం ఇరువైపులా అహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మార్చాలన్నారు. రహదారి మార్గాలకు ఇరువైపులా సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. శాఖమూరు రిజర్వాయర్‌ను 50 ఎకరాల ప్రాంతంలో సిద్ధం చేస్తున్నట్టు ఎడిసి అధికారులు సిఎంకు వివరించారు. ఆ సరస్సు చుట్టూ గ్రీనింగ్‌తో పాటు సేదతీరేందుకు వీలుగా చెట్లను నాటాలని సిఎం సూచించారు. రహదారుల వెంట వెళ్తున్న వారు కూడా ప్రకృతిని ఆస్వాదించేలా బ్యూటిఫికేషన్ జరగాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మరోవైపు కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజికి ఎగువన ఉన్న ఆరు దీవుల్ని కూడా సుందరంగా తీర్చిదిద్ది రివర్ ఫ్రంట్‌లను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు వివరించారు. అయితే పర్యావరణానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉండవల్లి కొండ ఉన్న ప్రాంతం నగరంలో మధ్యన ఉంటుందని ఎక్కడి నుంచి చూసినా పూలతో అందమైన వనంలా కనిపించేలా మొక్కలు నాటాలని అన్నారు.



గురువారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం ఇస్తున్న బాలకృష్ణ

## హిందూపురం అభివృద్ధికి
# బాలయ్య మాస్టర్ ప్లాన్
### ఢిల్లీలో ఐదుగురు కేంద్ర మంత్రులతో భేటీ

**హిందూపురం జులై 31 ప్రభాతవార్త :** ఎపిలోనే హిందూపురం నియోజకవర్గాన్ని మోడల్ గా చేయాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు రంగంలోకి దిగారు. ఒకవైపు సినిమాల షూటింగ్ బిజీ షెడ్యూల్, మరోవైపు బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ బాధ్యతలు ఉన్నప్పటికీ నిత్యం హిందూపురం అభివృద్ధి కోసమే తపన పడే బాలయ్య ఏకంగా కేంద్ర ప్రభు త్వ పెద్దలతో కలిసి పురం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా బుధ, గురువారం ఢిల్లీలో బిజీ బిజీగా పర్యటించి లోకసభ స్పీకర్, ఐదుగురు కేంద్ర మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరి, కార్మిక శాఖ మంత్రి మాండవీయ, హౌసింగ్ అండ్ అర్బన్ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ కట్టర్, పెట్రోలియం శాఖ మంత్రి హరదీప్ సింగ్‌లతో భేటీ అయ్యారు. జిల్లాలో అతిపెద్ద పట్టణమైన హిందూపురానికి 28 కిలోమీటర్ల మేర ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించి ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు రూపొందించిన ప్రణాళికను గడ్కరికి అందించారు. కొడికొండ శిర జాతీయ రహదారిని ప్రస్తుతం పులివెందుల కదిరి బెంగళూరు వెళ్లే మరో జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు ప్రతిపాదనలను అందజేశారు. కగ్గలు వద్ద జాతీయ రహదారి నుంచి కొత్తగా కిరికేర, బేవనహళ్లి, సేవామందిరం, పరిగిలను కలుపుతూ లింక్ హైవేను ఏర్పాటు చేయాలని కోరారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు అయితే హిందూపురంలో భారీ వాహనాల వల్ల కలిగే ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎక్కడలేని విధంగా హిందూపురం నియోజకవర్గంలోని తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడ ప్రాంతంలో అత్యధికంగా పరిశ్రమలు ఉన్నందున వేలాదిమంది కార్మికుల కోసం ఈఎస్ఐ 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కార్మిక శాఖ, ఆరోగ్య శాఖ మంత్రులను కలిసి లిఖితపూర్వకంగా బాలయ్య కోరారు. హిందూపురం పార్లమెంట్ పరిధిలో పేదలకు పెద్ద సంఖ్యలో ఇండ్ల నిర్మాణాన్ని కల్పించేందుకు హౌసింగ్ శాఖ నుంచి విరివిగా నిధుల మంజూరు చేయాలని ప్రత్యేకంగా ఆ శాఖ మంత్రిని కోరారు. కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి పనుల కోసం చేసిన విజ్ఞప్తిపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని సంతోషం వ్యక్తం చేశారు.

# 'ఆపరేషన్ ట్రేస్'

>> డిజిపి హరీష్ కుమార్ గుప్తా తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్ రూపంలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా డిజిపి హరీష్ కుమార్‌గుప్తా మాట్లాడుతూ"బాలికల అపహరణలు, తప్పిపోవడాలను పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఆగష్టు 1వ తేదీ నుండి 31వతేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం పూర్తి సమన్వయంతో ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమంలో పాల్గొంటుందన్నారు. కుటుంబాల నుండి దూరమైన బాలికలను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించి, తిరిగి వారి కుటుంబాల వద్దకు చేర్చడమే ఆపరేషన్ ట్రేస లక్ష్యం" అని డిజిపి తెలిపారు. ట్రెస్‌లో టీ అంటే తప్పిన బాలికలను గుర్తించడం,ఆర్ అంటే గుర్తించిన కుటుంబాలను వారి కుటుంబాలకు అప్పగించడం,ఏ అంటే త్వరితగతిన వారికి మెడికల్ కేర్, ఆహారం, వసతి, దుస్తులు మరియు న్యాయసలహాలను ఏర్పాటు చేసి వారికి వయస్సు నిర్ధారణ పరీక్షలు మరియు గుర్తింపుకు సంబంధించిన పత్రాలను రూపొందించడం, వారిపై ఆకృత్యాలు జరిగినచో ఎఫ్ఐఆర్ నమోదు చేయించడం ,సీ అంటే ఎన్జీవోల ద్వారా కౌన్సిలర్స్ ని నియమించి బాధిత బాలికలకు మానసిక సంబంధమైన సమస్యలకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేయడం.ఇ అంటే ఎంపవర్‌మెంటని అంటే వారికి చదువు, స్కిల్ ట్రైనింగ్, కెరీర్ గైడెన్స్ మరియు ప్రభుత్వ వెల్ఫేర్ స్కీంలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఆగష్టు నెల ఒకటి, రెండవ తారీఖుల్లో డేటా కలెక్షన్‌కై జిల్లా మరియు సబ్ డివిజన్ స్థాయిలో టాస్క్ ఫోర్స్ లను ఏర్పాటు చేయడం.ఆగష్టు నెలలో 3వ తేదీ నుంచి, 10వ తేదీ వరకు ఎన్జీవోలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న షెల్టర్స్ తనిఖీ చేయడం. సంబంధిత ఎఫ్ఐఆర్‌లను రీక్ష వెరిఫికేషన్ చేయడం, అందులో భాగంగా టెక్నాలజీని ఉపయోగించడం. ముఖాధారిత గుర్తింపు,ఆధార్,డీఎన్ఏ పరీక్షల ద్వారా వయస్సుకు సంబంధించిన సమాచారం సేకరించడం. సంబంధిత కుటుంబ సభ్యులతో మాట్లాడటం. ఆగష్టు నెలలో 11వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రైల్వేస్టేషనలలో, బస్టాండ్లలో, ప్రార్ధనా స్థలాల్లో మరియు రెడ్ లైట్ ఏరియాలలో ప్రత్యేక తనిఖీల ద్వారా తప్పిపోయిన బాలికలను గుర్తించడం మరియు ప్రజల యొక్క భాగస్వామ్యంతో "ఫైండ్ హర్ "అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. శక్తి యాప్‌లో 'రిపోర్ట్ మిస్సింగ్ చిల్డ్రెన్' అనే ఫీచర్ ద్వారా తప్పిపోయిన పిల్లల కోసం ఫిర్యాదు చేయవచ్చు మరియు ఆపద సమయంలో సహాయం కోసం ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులు తక్షణమే స్పంధించి సహాయం చేయగలరన్నారు. తప్పిపోయిన పిల్లలకు సంభంధించిన సమాచారాన్ని 112 నెంబర్ కి ఫోన్ చెయ్యడం ద్వారా లేదా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి, ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181కి మరియు శక్తి వాట్స్ యాప్ నెంబర్ 7993485111కు సమాచారం ఇవ్వడం ద్వారా సహాయం పొందగలరన్నారు.

## విశాఖ రైల్వేజోన్ పిసిఎంఇగా
# అమిత్ గుప్తా

**గుంతకల్లు రైల్వే, జూలై 31,ప్రభాతవార్త :** భారతీయ రైల్వేలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ యాంత్రిక విభాగం ప్రిన్సిపల్ సిఎంఇగా అమిత్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్‌పాండే గురువారం ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ మధ్య రైల్వే పిసిఎంఇగా పనిచేస్తున్న మధుసూదనరావు గురువారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఆగ్నేయ రైల్వేలో పనిచేస్తున్న బి జయ కుమార్‌రథ్‌ను నియమించారు. ప్రస్తుతం దక్షిణమధ్య రైల్వే చీఫ్ వర్క్‌షాప్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అమిత్ గుప్తాను దక్షిణ కోస్తా రైల్వే పిసిఎంఇగా, వెస్ట్‌సెంట్రల్ రైల్వేలో పనిచేస్తున్న మనీష్ అగర్వాల్‌ను సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే పిసిఎంఇగా, ఈస్ట్ సెంట్రల్ రైల్వే సమస్తిపూర్ డిఆర్ఎంగా పనిచేస్తున్న వినయ్ శ్రీవాత్సవను సిఎల్‌డబ్ల్యు పిసిఎంఇగా నియమించారు.

# ఎమర్జెన్సీ పాలన

>> ఆరు సార్లు ఎమ్మెల్యే ఇంటికి వచ్చి వారి ఇంటిని ధ్వంసం చేసి, 83 సంవత్సరాల ప్రసనన్న అమ్మను బెదిరించారు.ఆ సమయంలో ప్రసనన్న ఉండిఉంటే ఆయనను చంపి వేసివుండేవారు. స్టేట్‌మెంట్లు నచ్చక పోతే మనుషుల్ని చంపేందుకు ప్రయత్నిం చడం అటవిక సాంప్రదాయం కాదాఅని ప్రశ్నించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది. లిక్కర్ మాఫీయాచేశారు. ప్రతి నియోజక వర్గంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా ఉన్నాయి. జిల్లాలో సిలికామైన్స్,క్వాడ్జిలో లోకేష్‌కి ముడుపులు, ప్రతి నియోజకర్గంలో విచ్చలవిడిగా పేకాటక్లబ్‌లు, పోలీసులు, ఎమ్మెల్యేలు భాగస్వామ్యంతో పంపకాలు, అవినీతి ప్రశ్నిస్తే అరెస్టు ఇదా ప్రభుత్వం అని జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. మూడు సంవత్సరాలు అయిపోయిన తరువాత మా ప్రభుత్వమే వస్తుంది. చంద్రబాబునాయుడు మీరు వేసిన విత్తనమే రాబోయే రోజులలో వృక్షం అవుతుంది.ప్రతి అధి టకారికి చెబుతున్నా సప్తసముద్రాల అవతల ఉన్నా చట్టం ముందు నిలబెట్టి శిక్ష పడేలా చేస్తాం అన్నారు.

# రవాణా వ్యవస్థ

>> మంత్రులు నారా లోకేష్, టిజి భరత్, పి నారాయణతోపాటు పలువురు ఉన్నతాధికారులు రాజధాని అమరావతి నుంచి బయలుదేరి వెళ్లారు., ఈ పర్యటనలో భాగంగా సింగపూర్ దేశాధ్యక్షుడితో సీఎం చంద్రబాబు ప్రతినిధి బృందం సమావేశమైంది. అలాగే పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులు, కంపెనీ సిఇఒలు, పారిశ్రామికవేత్తలతో సైతం సమావేశం అయింది. ఆ క్రమంలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పారిశ్రామిక పాలసీ, భూమి లభ్యత తదితర అంశాలను ఈ సందర్భంగా వారికి సిఎం చంద్రబాబుతోపాటు ప్రతినిధి బృందం సోదాహరణంగా వివరించారు. అలాగే ఈ ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం వేదికగా జరగనున్న సదస్సుకు సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించింది. ఈ పర్యటన ముగించుకుని సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం సింగపూర్ నుంచి ఏపీకి బయలుదేరి వచ్చారు. ఇంకా మంత్రి నారాయణ ప్రతినిధి బృందం సింగపూర్‌లో పర్యటిస్తుంది. రేపు, ఎల్లుండి కూడా సింగపూర్‌లో పలు ప్రాంతాలను సందర్శించనున్నారు.

## ఆర్థిక పునరుజ్జీవానికి బాట చూపిన
# సిఎం విదేశ పర్యటన
### రాష్ట్ర ప్రతిష్టను తుడిచిపెట్టే కుట్రలకు తెరలేపిన వైఎస్సార్సీ నేతలు: టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 31, ప్రభాత వార్త :** సిఎం చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటన సత్ఫలితాలు ఇచ్చిందని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ పర్యటనలో సీఎం ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశమై, రాష్ట్రంలోని మౌలిక రంగాలకు, విద్య, వైద్యం, పరిశ్రమ, నైపుణ్యాభివృద్ధి రంగాలకు పెట్టుబడులను ఆకర్షించేలా చర్చలు జరిపారని తెలిపారు. కృత్రిమ మేధస్సు నుంచి పచ్చ ఇంధనానికి.. నైపుణ్య వికాసం నుంచి ఆరోగ్య సంరక్షణ వరకు, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన దిశా నిర్దేశం విదేశీ పరిశ్రమల మెప్పును పొందిందని అన్నారు. ఈ అభివృద్ధి సంకేతాలను తట్టుకోలేక తాడేపల్లి తటాకంలో వర్షం కురిసిందని, రాష్ట్రానికి మేలు జరిగితే తట్టుకోలేని ఓ వర్గం మళ్లీ కుట్రల మకుటంతో రంగంలోకి దిగిందని అన్నారు."ఇది కేవలం చంద్రబాబు గారిపై వ్యతిరేకత కాదని.. ఏపీ ప్రజల ఆశయాలపై దాడి అని అన్నారు. అభివృద్ధిని అడ్డుకునే పబ్బం కోసం కొందరు పట్టుబట్టి తిప్పలు పెడుతున్నారని, గత ఐదేళ్ల వైఎస్సార్సీ పాలన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఇప్పుడు మళ్లీ మేధావుల పాదాలు రాష్ట్రానికి చేరుతున్నాయన్న సమయంలో ఈ కుట్రల రూపం కలిగింది," అని పల్లా అన్నారు.గతంలో లూలు సంస్థ, ఫ్రాంక్లిన్ వంటి ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి వెనక్కి నడవడానికి కారణమైన రాజకీయ అస్థిరత ఇప్పుడు మరోసారి పునరావృతమవుతుందా అన్నఆందోళన వ్యక్తమవుతోందనిఅన్నారు.పెట్టుబడులకి ఆకర్షణ రాకపోవచ్చు. కానీ అడ్డుగోలు ప్రచారాల వల్ల విదేశీ కంపెనీలు వెనక్కి తగ్గిపోతే, అది రాష్ట్రానికి మిగిలేది మళ్ళీ పశ్చాత్తాపమేనని అన్నారు.

# రేపటినుంచి 'అన్నదాతా సుఖీభవ'

>> రైతులకు నిధులే కాదు.. నీళ్లు ఇస్తున్నామని చెప్పారు.

**ప్రజల విశ్వసాన్ని నిలబెట్టుకున్నాం**

ఆగస్ట్ 2న అన్నదాత సుఖీభవ పథకం అమలు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలి. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది. నాడు ఆర్థిక విధ్వంసం జరిగింది. ప్రతీ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. రైతులకు హామీ ఇచ్చినట్టుగానే అన్నదాత సుఖీభవను అమలు చేసి చూపించాం. పథకాలు అమలు చేస్తూ ప్రజల విశ్వసాన్ని నిలబెట్టుకున్నాం. చేసిన మంచిని ప్రజలకు చెప్పాలి. రాజకీయ నేతలు పాలసీలు మాత్రమే తయారు చేస్తారు... వాటిని అమలు చేసేది అధికారులే. వ్యవస్థలో అందరూ జావాబుదారీతనంతో వ్యవహరించాలి. అన్నదాత సుఖీభవ అందుకునే రైతులకు సెల్ ఫోన్లకు ఒకరోజు ముందే మనమిత్ర ద్వారా సందేశాలు వెళ్లాలి. రైతులు తమ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించండి. అని ముఖ్యమంత్రి అన్నారు.

**వ్యవసాయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం**

ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. బొప్పాయి ధర తగ్గిందని కథనాలు వస్తున్నాయి. వాటిపైనా సమీక్ష చేసి రైతులకు న్యాయం చేయాలి. ఎరువుల విషయంలో కలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి... ఎక్కడా కొరత రానీయొద్దు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. గండికోట, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు ప్రాజెక్టులను వందశాతం నీటితో నింపాలి. రిజర్వాయర్లలో ఎంత నీరు ఉందనే సమాచారం ఉండాలి. నీటి నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలి. భారత్‌పై అమెరికా 25 శాతం సుంకాలు విధించింది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొనాలి. ఇప్పటి వరకు రైతులకు ప్రభుత్వం అందించిన సాయం, ఇతర వివరాలతో కరపత్రం రూపొందించి క్షేత్రస్థాయిలో ఇవ్వాలి అని ముఖ్యమంత్రి కలెక్టర్లకు సూచించారు.

**ఆగస్ట్ 2న ఒక్కో రైతుకు మొత్తం రూ.7,000 జమ**

ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20,000 చొప్పున అందిస్తామన్న కూటమి హామీని అన్నదాత సుఖీభవ, "పీఎం కిసాన్ అమలుతో నెరవేర్చినట్టయ్యింది. ఏడాదికి కేంద్రం ఇచ్చే రూ.6,000 సాయంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14,000 ఇవ్వనుంది. మొదటి, రెండో విడత రూ.5 వేల చొప్పున, అలాగే మూడో విడత రూ.4 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. రూ.14 వేలను 3 విడతలుగా అందించాలని గతంలోనే నిర్ణయించారు. కేంద్రం మొదటివిడతగా రూ.2,000 చొప్పున రూ.831.51 కోట్లు రైతులకు సాయం చేయనుంది. దీంతో ఆగస్ట్ 2న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7,000 జమ చేసినట్టు అవుతుంది. మరోవైపు "అన్నదాత సుఖీభవ"కు సంబంధించి 59,750 గ్రీవెన్సులు నమోదుకాగా... వాటిలో 58,464 దరఖాస్తులను పరిష్కరించారు. ఈ పథకంపై సందేహాలను నివృత్తి చేసేందుకు 155251 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచారు.

# రూ. 45 వేల కోట్లు!

>> **యువతకు ఉద్యోగాల కోసమే కంపెనీలకు భూములు..**

మేము భారతీ సిమెంట్స్, హెరిటేజ్‌కు భూములు ఇవ్వలేదు, యువతకు ఉద్యోగాలు ఇచ్చే టిసిఎస్, కాగ్నిజెంట్స్, డాటా సెంటర్ లకు ఇచ్చాం, ఎస్ఐపిబి పెట్టి మూడురోజుల్లో కేబినెట్ కు తెచ్చి ఐటి సంస్థలకు అనుమతులు ఇచ్చాం. ఎపికి పెట్టుబడులు రావాలి, 2029కల్లా ఉద్యోగాలు ఇవ్వాలన్న కండీషన్ తో భూములిచ్చాం. ప్రధాని మోడీజీ నుంచే మాకు 99 పైసలకు భూములు కేటాయించే ఐడియా వచ్చింది. మోడీ గుజరాత్ సిఎంగా ఉన్నపుడు పశ్చిమ బెంగాల్ అంగీకరించకపోతే టాటా మోటార్స్ నానో పరిశ్రమకు తక్కువ ధరకు భూములు ఇచ్చారు. సుప్రీంకోర్టు ఆ నిర్ణయం కరెక్టు అని చెప్పింది, వేలకోట్ల భూములు కట్టబెడుతున్నామని ఆరోపణలు చేసేవారు గత ప్రభుత్వంలో ఒక్క ఎకరం ఎందుకు అమ్మలేకపోయారు? లులూకి ఇచ్చిన భూమి ఆక్షన్‌కు పెడితే గతంలో ఒక్కడూ ముందుకు రాలేదు. వాళ్ల మాటవింటే రాష్ట్రం నష్టపోతుంది. పెట్టుబడుల కోసం అహర్నిశలు కష్టపడుతున్నాం. 1995లో కంప్యూటర్ అన్నం పెడుతుందా అని హేళన చేశారు. సైబర్ టవర్స్ నిర్మాణం తర్వాత హైదరాబాద్ రూపురేఖలు మారాయి. హాస్పిటాలిటీ, రిటైల్ రంగంలో మాగ్జిమమ్ జాబ్స్ వస్తాయి. రాబోయే అయిదేళ్లలో రాష్ట్రంలో 50వేల హోటల్ రూమ్ లు రావాలని సిఎం డైరక్షన్ ఇచ్చారు. విశాఖ, తిరుపతి, కర్నూలు, అమరావతి, కాకినాడ, రాజమండ్రిలో పెద్దఎత్తున హోటల్స్ రాబోతున్నాయి. ఉద్యోగాల కల్పనే మా ప్రభుత్వ లక్ష్యం.. రాష్ట్రంలో గత14నెలల్లో పెద్దఎత్తున ఎంఎస్ఎంఇ పరిశ్రమల రిజిస్ట్రేషన్స్ జరిగాయి. త్వరలోనే ప్రోత్సాహకాలు విడుదల చేస్తాం. ఎంఎస్ ఎంఇల కోసం ఒక ప్రత్యేక మోడల్ వర్కవుట్ చేయమని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఒక నెలలో ఆ మోడల్ ను కేబినెట్ ముందుకు తెస్తామన్నారు.

**రాష్ట్రాభివృద్ధికి రోడ్ సింగపూర్ రోడ్ మ్యాప్..**

సింగపూర్ పారిశ్రామికవేత్తలతో జరిగిన చర్చల్లో చంద్రబాబు గారు మేము మీతో ఉన్నాం, కలసికట్టుగా పనిచేద్దామని భరోసా ఇచ్చారు, రాష్ట్రానివృద్ధి కోసం అద్భుతమైన రోడ్ మ్యాప్, ఫ్రేమ్ వర్క్ ఏర్పాటుచేశామని భరోసా చెప్పారు. అమరావతితోపాటు ఎస్ఇజడ్‌లు, పోర్టుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులు పెడతామని వారు చెప్పారు. ప్రతి పారిశ్రామిక విప్లవం ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఏదేశం మార్పునకు సిద్ధంగా ఉంటుందో ఆ దేశం ఎక్కువ ఉద్యోగాలను సాధిస్తుంది. అందుకే కరిక్యులమ్‌లో ఎఐ అండ్ ఎంఎల్ ఉండాలని ఉన్నత విద్య చైర్మన్ కు సష్టంగా చెప్పాం, క్వాంటమ్ కంప్యూటింగ్ తెస్తున్నాం.

**సెప్టెంబర్‌లో విశాఖకు టిసిఎస్!..**

ఈ యేడాది సెప్టెంబర్‌లో విశాఖపట్నంలో టిసిఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. అక్టోబర్‌లో కాగ్నిజెంట్ వస్తుంది. ఎపి బ్రాండ్ దెబ్బతీయడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన సిఎం సింగపూర్ నుంచే ఆదేశాలు ఇచ్చారు. తప్పుడు ప్రచారం వల్ల స్టార్టప్ కంపెనీలకు అనుమానాలు వస్తాయి. అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గతంలో ఆర్ బిఐ, సెబీకి మెయిల్స్ పంపారు, ఇప్పుడు సింగపూర్‌లో మినిస్టర్స్, సెక్రటరీలకు పంపారు, నిన్నకోర్టులో కేసువేశారు. అయితే చంద్రబాబు గురించి సింగపూర్ ప్రభుత్వానికి తెలుసు. అందుకే వారి ఫిర్యాదులను పక్కన బెట్టారు. పరిశ్రమలకు సంబంధించి మేం సరైన నిర్ణయమే తీసుకున్నాం. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు 5వేల ఎకరాలు ఎందుకు అని ఆనాడు ప్రశ్నించారు. ఈరోజు భారత్ లోనే బెస్ట్ ఎయిర్ పోర్టుగా హైదరాబాద్ తయారైంది. వందేళ్లకు సరిపడా విస్తరించే అవకాశం కూడా ఉంది.

ప్రస్తుతం ఉన్న ఎయిర్ పోర్టు సరిపోకపోవడంతో బెంగుళూరులో రెండో ఎయిర్ పోర్టు కడుతున్నారు. ముందుచూపుతో ఆలోచించి చంద్రబాబుగారు సిఎంగా ఉన్నపుడు హైదరాబాద్‌లో అవుటర్ రింగ్ రోడ్డు, మెట్రో డిజైన్ చేశారు, బాబు గారి తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు వాటిని కొనసాగించారు, అదే హైదరాబాద్ అదృష్టం, జగన్ మాదిరిగా అక్కడ అడ్డుపడలేదు, జగన్ లాంటి నాయకుడు ఉండటం మన రాష్ట్ర దౌర్భాగ్యన్నారు,.ఎవ్వరెన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్ర అభివృద్ధి ఆగదన్నారు.

# వారం - వర్జ్యం

01-08-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
అష్టమి పూర్తి
స్వాతి రా.3.41
వర్జ్యం : ఉ.9.57-11.44
దు.ఉ.10.38-12.15,
2) రా.11.51-12.43
రాహుకాలం - ఉ.10.30-12.00

# వార్తాఫలం

**మేషం :** జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా వుంటాయి.

**వృషభం :** భూములకు సంబంధించి వివాదాలు తొలుగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం:** వాహనాలు, ఆభరణాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో హోదాలు లభిస్తాయి.

**కర్కాటకం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. దీర్ఘకాలిక ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**కన్య :** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కార్యాలయంలో ప్రతికూల వాతావరణం నెలకొంటుంది.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుంటాయి. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.

**మకరం:** ఆర్థికపరమైన లావాదేవీలు సంతృప్తికరంగా సాగుతాయి. సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుతుంది.

**కుంభం:** కీలక వ్యవహారాలలో పూర్తి చేస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**మీనం :** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. దూరపు బంధువులను కలిసి సంతోషంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహిళల ఉచిత బస్సుకు 'స్త్రీశక్తి' పేరు

>> భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని ఆగస్టు 15 నుంచి అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిఎం చంద్రబాబు ఇప్పటికే పలుమార్లు సమీక్షించి సూచనలు చేశారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బస్సుల్లో ప్రయాణించే మహిళామణులకు జీరో ఫెయిర్ టికెట్ల జారీ కోసం ఆర్టీసీ సాఫ్ట్ వేర్‌లో మార్పులు చేసింది. టిమ్ యంత్రాలు సహా డిపోల్లోని యుటిఎస్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలకు వీటిని పంపి డ్రైవర్లు, కండక్టర్లకు జీరో ఫెయిర్ టికెట్ జారీపై శిక్షణ ఇవ్వనున్నారు.

మహిళలకు జీరో టికెట్ జారీ చేసేలా సులభంగా మార్పులు చేశారు. మహిళలకు ఫ్రీ టికెట్లు జారీ కోసం టిమ్ యంత్రాల్లో టికెట్ ఇష్యూ ఆప్షన్ లేదా స్టార్ కీ బటన్ సెలక్ట్ చేయాలని ఆర్టీసీ తెలిపింది. మొదట వెళ్లాల్సిన ఊరును క్లిక్ చేయాలి. తర్వాత ఉమెన్స్ ఫ్రీ టికెట్ ఆప్షన్ లేదా టిమ్ యంత్రంలో 8 బటన్ నొక్కితే చాలు వెంటనే టికెట్ సిద్ధమై ప్రింట్ వచ్చేస్తుంది. ప్రస్తుతం బస్సుల్లో జారీ చేసే టికెట్ పైనే అదనపు వివరాలతో మహిళా టికెట్ ముద్రించనున్నారు. స్త్రీ శక్తి అని పెద్ద అక్షరాలతో ముద్రించారు. ప్రభుత్వ రాయితీని టిక్కెట్ పై చూపిస్తారు. ప్రయాణించిన తేదీ, సమయంతో పాటు డ్రైవర్ కండక్టర్ ఐడీ నెంబర్, ప్రయాణించిన కిలోమీటర్లు, వాహనం నెంబర్ వంటి వివరాలను సమగ్రంగా ముద్రించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, అంతకన్నా ఎక్కువ మంది మహిళలు, ఆడపిల్లలతో పాటు ఒకే గమ్యస్థానానికి వెళ్తుంటే విడివిడిగా కాకుండా అందరికీ కలిపి ఒకే టికెట్ జారీ చేసేలా సాఫ్ట్ వేర్‌ను ఆర్టీసీ ఐటీ విభాగం సిద్ధం చేసింది. బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు వేగంగా టికెట్లు జారీ చేయడం ద్వారా సిబ్బందితో పాటు మహిళలకు సౌకర్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ఉమ్మడి జిల్లా పరిధిలో అమలు చేస్తామని చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారు.

# సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కి షాక్

>> నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారని, ఇదెలా సాధ్యమంటూ ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం సుప్రీం ధర్మాసనం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు అన్ని చూసుకోవాలి కదా, ఇష్టానుసారం చేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు అగ్నిఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు 59.93 లక్షల రూపాయల బిల్లులు చెల్లించేశారు. సిఐడి తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కోసం క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు కాంట్రాక్టు ఇచ్చి, 1.19 కోట్ల రూపాయలు చెల్లించారు.

దళితులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన పేరిట నిధుల దుర్వినియోగం చేశారని, పనులు జరగకుండానే చెల్లింపులపై ఆధారాలను రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఒక ప్రైవేటు సంస్థతో కలిసి సంజయ్ దుర్వినియోగానికి పాల్పడ్డారని తేల్చింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సమర్పించిన నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులు తెలిపారు.సదస్సులు మొత్తం సిఐడి అధికారులే నిర్వహించారని, క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించకపోయినా బిల్లుల పేరిట దోచేశారని పేర్కొన్నారు. దీనివలన ప్రభుత్వ ఖజానాకు సుమారు 2 కోట్ల రూపాయల మేర నష్టం కలిగించారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి 2 వేర్వేరు రిపోర్టులు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఎసిబి కేసు నమోదు చేసింది.

# నష్టపరిహారం ఇప్పించిన ఉపలోకాయుక్త
### భూ సేకరణలో రైతుకు రూ.20 లక్షలు చెల్లింపు

**కర్నూలు, జూలై 31, ప్రభాతవార్త :** జాతీయ రహదారికి సంబంధించి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించే విషయంలో లోకాయుక్త సంస్థ కీలకంగా వ్యవహరించారు. ఆ మేరకు లోకాయుక్తను ఆశ్రయించిన వ్యక్తి ఫిర్యాదును విచారించిన ఉపలోపయుక్త జస్టిస్.రజిని నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇచ్చారు. ప్రకాశం జిల్లా, సి.యస్ పురం మండలం, ముసునూరు గ్రామ పరిధిలో జరిగిన భూసేకరణ విషయంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థ నష్టపరిహారం ఇప్పించింది. బెంగులూరుకడపవిజయవాడ ఆర్థిక కారిడార్ కోసం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సేకరించిన ఎ.1.72 సెంట్లు భూమికి పరిహారం చెల్లించలేదని, ప్రకాశం జిల్లా కలెక్టరు మరియు ప్రత్యేక జిల్లా కలెక్టరు (భూసేకరణ) చర్యల తీసుకోలేదని ఫిర్యాదిదారుడు పి.ఓం శివయ్య లోకాయుక్త సంస్థ నందు ఆరోపించారు. అంతేకాక సదరు భూమిని పట్టా భూమిగా నిర్ధారిస్తూ, జిల్లా కలెక్టరు మరియు ప్రత్యేక జిల్లా కలెక్టరు (భూసేకరణ) నష్టపరిహారం కోసం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని ఆదేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టరు, మరియు ప్రత్యేక జిల్లా కలెక్టరు (భూసేకరణ) సమగ్ర నివేదికలు సమర్పించారు.

అందులో సదరు భూమి ప్రైవేట్ పట్టాభూమిగా గుర్తించబడిందని, నిషేధిత జాబితా నుండి తొలగించామని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డులలో తహశీల్దార్ అవసరమైన మార్పులు చేసారు. అనంతరం ఫిర్యాదిదారుడు ఓం శివయ్యకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్, ద్వారా రూ.20,11,645/లు భూమి నష్టపరిహారంగా చెల్లించారు.

# రైల్వేలో నేటి నుంచి స్వచ్ఛత అభియాన్

**గుంతకల్లు రైల్వే, జూలై 31,ప్రభాతవార్త** భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించు కుని భారతీయ రైల్వేలో స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ ఆదేశించారు. రైల్వేలోని రైల్వే స్టేషన్లు, రైళ్లు,రైల్వే కాలనీలలో, కార్యాలయాల్లో వివిధ విభాగాలకు సంబం ధించిన డిపోలలో వర్క్‌షాప్‌లలో శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలని తద్వారా రైల్వే పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, గార్బేజ్‌ను తొలగించాలని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇందులో భాగంగా తొలిదశలో ఆగస్టు 1నుంచి 15వరకు, మలి దశలో ఆగస్టు 16నుంచి అక్టోబరు 31వరకు దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లు, డివిజన్లు,ఉత్పత్తి కర్మాగారాల్లో స్వచ్ఛత అభియాన్ పథకం అమలు చేయాలని ఆయన ఆదేశించారు.



# జగన్ ఉద్దేశపూర్వకంగా శాంతి భద్రతల పరిస్థితికి భంగం కలిగిస్తున్నారు

## - హోం మంత్రి అనిత

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై బల ప్రదర్శన కోసమే అన్నట్లు ఉన్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యా నించారు.ఆయన ఉద్దేశపూర్వకంగా శాంతి భద్రతల పరిస్థితికి భంగం కలిగిస్తున్నారన్నారు. జగన్ మానసిక పరిస్థితిపై చర్చ జరగాలన్నారు. మహిళలపై నీచాతి నీచంగా మాట్లాడిన వ్యక్తిని జగన్ పరామర్శించడం జుగుప్సాకరంగా ఉందని ఆమె అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై ప్రసన్న కుమార్ రెడ్డి మాటలని జగన్ సమర్థిస్తు న్నారా? అని హోంమంత్రి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుతో హోంమంత్రి అనిత సమావేశ మయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, సిట్ దర్యాప్తు, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. "ప్రస్తుతం వైఎస్ జగన్ జైల్ యాత్రలు జరుగుతున్నాయి. రాష్ట్రం కోసం సీఎం చంద్రబాబు కష్టపడి దేశాలు పట్టుకు తిరుగు తుంటే.. జగన్ బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నారు. పొగాకు రైతుల పరామర్శ పేరుతో తొక్కిసలాటకు కారణమయ్యారు. జగన్ మానసిక పరిస్థితిపై చర్చ జరగాలి. మహిళలపై నీచాతి నీచంగా మాట్లాడిన వ్యక్తిని జగన్ పరామర్శించడం జుగుప్సాకరంగా ఉంది. ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిని ధ్వంసం చేసిన వారిపై కేసులు పెట్టాము. ప్రసన్నకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చెల్లి అవుతారు. అయినా చెల్లి వరస అయ్యే మహిళపై నీచాతి నీచంగా మాట్లాడారు. అంటే ప్రసన్న మాటలని జగన్ సమర్థి స్తున్నారా? అని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. వైఎస్ జగన్ మానసిక పరిస్థితి దారుణంగా ఉంది. ఎలా ఉందంటే.. తల్లి, చెల్లిపై మాట్లాడినా కూడా నోరు మెదపని పరిస్థితి ఆయనది. మేం ప్రజాసేవ కోసం కుటుంబ సభ్యులను వదిలి వస్తున్నాం. ఎస్పీఎలేటిలో తల్లిపై గెలిస్తే విజయమా?. మాట్లాడితే జగన్ పోలీసులపై పడుతున్నారు. ఈ మధ్య జగన్ తన పర్యటన సమాచారం పోలీస్ శాఖకు కూడా జగన్ చెప్పాలి. ఒక చనిపోయిన వారి ఇంటికి వెళ్లి బలప్రదర్శన చేస్తారా?. మీటింగ్ పెడతాను అంటే పర్మిషన్ ఇస్తాం.



# కాకాణితో జైలులో మాజీ సీఎం జగన్ ములాఖత్

## - పోలీస్ ఆంక్షల నడుమ నెల్లూరులో జగన్ పర్యటన
## - దారి పొడవునా జన నీరాజనం

**నెల్లూరు క్రైమ్, జూలై 31, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డిని గురువారం ములాఖత్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కలుసుకున్నారు. ఉదయం 10.40కు కాకాణి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు జగన్ హెలికాఫ్టర్ ద్వారా చేరుకున్నారు. అక్కడ నుండి రోడ్డు మార్గంలో జైలు వద్దకు చేరుకుని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలతో కలిసి కాకాణిని కలిశారు. ఆ సమయంలో కాకాణి కుమార్తె పూజిత కూడా జైలు వద్ద ఉన్నప్పటికీ ముగ్గురికి మాత్రమే లోపలికి అనుమతి ఇవ్వడంతో ఆమె బయటే ఉండిపోయారు. సుమారు 20 నిమిషాలు పైగా ఆయన మాజీ మంత్రి కాకాణితో భేటీ అయ్యారు. అంతకు ముందు పోలీసుల అనుమతి కలిగిన జిల్లాకు చెందిన సీనియర్ వైసీపీ నేతలు హెలిపాడు వద్ద జగన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తన వాహనంలో జగన్‌కు స్వాగతం పలికేందుకు హెలిపాడు వద్దకు చేరుకుంటున్న సమయంలో అక్కడ ఉన్న పోలీసులు కారు తనిఖీ చేసి ముందస్తు అనుమతి ఉన్న వారిని మాత్రమే హెలిప్యాడ్ వద్దకు పంపగలమని చెప్పగా, వారికి సమాధానం ఇవ్వకుండా అనిల్ కుమార్ కారుని అక్కడి నుంచి వేగంగా హెలిప్యాడ్ వద్దకు తీసుకెళ్లిపోయారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసి ఎందుకు జిల్లా జైలు వద్దకు వచ్చిన జగన్మోహన్ రెడ్డిని చూసేందుకు వైసిపి కార్యకర్తలు భారీ ఎత్తున అక్కడికి చేరుకునే ప్రయత్నం చేశారు. అయితే పోలీసు అధికారులు ఎక్కడికి అక్కడే బారికేడ్లు, ఫెన్సింగులు, రోప్ పార్టీలతో జైలు వైపు వెళ్లే దారులన్నీ మూసి వేయడంతో జైలు వద్దకు చేరుకోలేకపోయారు. అయితే జైలు బయట నుండి జగన్ కాన్వాయ్ బయలుదేరగానే ఎక్కడెక్కడో ఉన్న కార్యకర్తలు ఒక్కసారిగా జైలు మార్గం వైపుకు దూసుకు వచ్చారు. కాన్వాయ్ జాతీయ రహదారిపైకి రాగానే వందల సంఖ్యలో రహదారిపైకి చేరుకున్న వైసిపి కార్యకర్తలు, అభిమానులు జగన్ వాహనానికి అడ్డు తగలకుండా చూసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కార్యకర్తల సందోహాన్ని చూసిన జగన్ వాహనం బయటకు వచ్చి అభివాదం చేస్తూ అందరినీ పలకరిస్తూ వెళ్లారు. అక్కడి నుండి జగన్ కాన్వాయ్ నెల్లూరు నగరంలోకి ప్రవేశించగానే అయ్యప్ప గుడి కూడలి నుండి వైసిపి కార్యకర్తల అత్యుత్సాహాన్ని నిలువరిస్తూ కాన్వాయిని ముందుకు నడిపించడం పోలీసులకు క్రమంగా మించిపోయింది. కాన్వాయ్‌కు అడుగడుగునా కార్యకర్తలు, జగన్ అభిమానులు గులు తీస్తూ వెళ్లారు. జన సందోహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జగన్ బయటికి వస్తూ అందర్నీ పలకరిస్తూ అభివాదం చేస్తూ వెళ్లారు. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు, కోవూరు నియోజకవర్గాల నుండి వైసీపీ శ్రేణులు భారీ జన సమీకరణ చేపట్టడంతో జిల్లా కారాగారం నుండి కొండాయపాలెం గేటు ప్రాంతం వరకు వైసిపి కార్యకర్తలు భారీ ఎత్తున కదిలి వచ్చారు.

# పదో తరగతి ప్రశ్నపత్రం వెయిటేజీలో మార్పులు

## - 'పరాఖ్' విధానంలో ప్రశ్నపత్రాల రూపకల్పన

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** పదో తరగతి ప్రశ్నాపత్రాల్లో ప్రభుత్వ పరీక్షల విభాగం మార్పులు చేసింది.ఇప్పటి వరకు అకడమిక్ ప్రమాణాల ప్రకారం ప్రశ్నలు ఇస్తుండగా...ఇప్పుడు ఆరు లక్ష్యాలతో పరాఖ్ విధానంలో ప్రశ్నలు ఇవ్వనున్నారు. ఈ మేరకు కొత్త ప్రశ్నాపత్రాల బ్లూప్రింట్లను పరీక్షల విభాగం విడుదల చేసింది.నూతన విద్యా విధానం ప్రకారం సమగ్ర అభివృద్ధి కోసం జ్ఞానం, పనితీరు అంచనా,సమీక్ష విశ్లేషణ(పరాఖ్) ఆధారంగా ఈ ప్రశ్నాపత్రాలను రూపొందించారు. భాషేతర సబ్జెక్టుల్లో నాలెడ్జ్‌కు 20%,అవగాహనకు 25%,అన్వయానికి 20%,విశ్లేషణకు 15%,మూల్యాం కనానికి 10%,సృజనాత్మకతకు,10% చొప్పు వెయిటేజి ఇచ్చారు. ప్రశ్నాపత్రాల డిజైన్‌లో ఎలాంటి మార్పు చేయలేదు. గతంలో లనే ఒక్క మార్కు ప్రశ్నలు 12,రెండు మార్కులవి 8,నాలుగు మార్కు లవి-8,8 మార్కులవి 5 ప్రశ్నలు ఇస్తారు.బాషా సబ్జెక్టులకు వచ్చేసరికి అవగాహన ప్రతిస్పందనకు 24%,వ్యక్తీకరణ సృజనాత్మకతకు 44%,బాషాంశాలకు 32%,వెయిటేజి ఇస్తారు. ఎనిమిది మార్కుల వ్యాసరూప ప్రశ్నలు 7,నాలుగు మార్కుల లఘు ప్రశ్నలు-3,రెండు మార్కుల అతి లఘు ప్రశ్నలు-9,ఒక్క మార్కు లక్ష్మాత్మక ప్రశ్నలు-14 ఇస్తారు.8,9 తరగతులకు సంబంధించి ప్రశ్నాపత్రాల డిజైన్‌లో మార్పులు చేశారు. 80 మార్కులకు రాత పరీక్ష,20 అంతర్గత మార్కులు ఉంటాయి.

# కరవు అంచనా తగ్గించేందుకు అంతరిక్ష సాంకేతిక సాధనాలు అభివృద్ధి కాలేదు

## రాజ్యసభలో ఎంపి రఘునాథరెడ్డికి కేంద్రమంత్రి జితేంద్రసింగ్ సమాధానం

**రాజంపేట, జూలై 31 ప్రభాతవార్త** సాంప్రదాయకంగా కరువు పీడిత ప్రాంతాలలో కరువులను అంచనా వేయడానికి, మరియు తగ్గించడానికి ఇంకా అంతరిక్ష సాంకేతిక సాధనాలను అభివృద్ధి జరగలేదని కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ వెల్లడించారు. అయితే, వ్యవసాయ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సంస్థల సహకారంతో ఇస్రో, డిఓఎస్ కరువు పర్యవేక్షణ దాని ప్రభావ అంచనా కోసం నాదామ్స్ వ్యవస్థను అభివృద్ధి చేసి అమలు చేసిందని పేర్కొన్నారు. రాజ్యసభలో వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి వ్యవసాయానికి అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం,దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి, రాయలసీమలోని కరువు పీడిత ప్రాంతాలలో వ్యవసాయంలో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన అనువర్తనాలను ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలు, కరువులను అంచనా వేయడానికి, తగ్గించడానికి అందుబాటులో ఉన్న అంతరిక్ష సాంకేతిక సాధనాల వివరాలను అడిగారు. అందుకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ పంట వాతావరణ పరిశీలన వ్యవస్థ కింద వాతావరణ, ఉపగ్రహ ఆధారిత ఉత్పత్తులను, నేల, తేమ సూచికలు, కరువు సూచికలు ఉత్పత్తి చేయడంలో అంతరిక్ష శాఖ, వ్యవసాయం,రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వంటి కరువు పీడిత ప్రాంతాలకు ప్రత్యేకంగా, ఈ డేటాసెట్‌లు వాతావరణ క్రమరాహిత్యాలను ముందస్తుగా గుర్తించడంలో, పంట పరిస్థితిని పర్యవేక్షించడంలో , పంట కాలంలో కరువు తీవ్రతను అంచనా వేయడంలో సహాయపడ తాయని పేర్కొన్నారు.వాతావరణ, రిమోట్ సెన్సింగ్ , క్షేత్ర డేటాను నేషనల్ అగ్రికల్చరల్ డ్రౌట్ అసెస్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ఉపయోగించి కరువును అంచనా వేయడానికి పర్యవేక్షించడానికి ఒక కార్యాచరణ పద్ధతిని అభివృద్ధి చేసిందని అన్నారు. ఈ పద్ధతిని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ యొక్క మహాలనోబిస్ జాతీయ పంట సూచన కేంద్రానికి బదిలీ చేసిందని వివరించారు. ఉపగ్రహ రిమోట్ సెన్సింగ్ , వాతావరణ డేటాను ఉపయోగించి ఆంధ్ర, రాయలసీమతో సహా జాతీయ స్థాయి జియోస్పేషియల్ కరువు అంచనా పోర్టల్ ను అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈశాన్య ప్రాంతం అన్ని రాష్ట్రాలలో కాలక్రమ జియోస్పేషియల్ డేటాను ఉపయోగించి సీజనల్ వ్యవసాయ కరువు ప్రమాద మ్యాపింగ్ (రబీ సీజన్) నిర్వ హించబడిందన్నారు. ఈ విధానం కరువు పీడిత జిల్లాలను గుర్తించడంలో దోహదపడిందన్నారు.

# మూడు జిల్లాల్లో పేద, బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు

## - విశాఖ, విజయనగరం, అనకాపల్లిలో 1941 ఎకరాల భూ సమీకరణకు అనుమతి

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలు బలహీనవర్గాల ఇళ్ళ నిర్మాణం కోసం విశాఖ పట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో భూ సమీకరణ పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ నిర్ణయించింది. మూడు జిల్లాల్లో మొత్తం 1941.19 ఎకరాలు సమీకరించ నున్నారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) పరిధిలో భూ సమీకరణ కోసం విశాఖ కలెక్టర్ చైర మన్‌గా ప్రభుత్వం నియమించిన కమిటీ ఇటీవల నివేదిక ఇచ్చింది. విజయనగరం, అనకాపల్లిలో ఆయా జిల్లాల ఆర్డీఓలు అధికారాలు కల్పించారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో గిడిజాల,శొంఠ్యాం, బీడీపాలెం, పద్మనాభం మండలం కొవ్వాడలో మొత్తం 1,132.90 ఎకరాలువిజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస,భోగాపురం మండలం రావాడలో 23.41 ఎకరాలు, అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలో అంత కాపల్లి, బాటతజం గాలపాలెం, ఎ.శిరసవల్లి, నల్లరేగుడుపాలెం,పైడివాడ అగ్రహారం,అనకాపల్లి మండలం తగరంపూడిలో మొత్తం 783.69 ఎకరాలుభూ సమీకరణ పథకంలో సేకరించిన భూములు అభివృద్ధి చేశాక ఎసైన్డ్ భూములపై ఎకరాకు 900 చదరపు గజాల ప్లాట్ కేటాయిస్తారు. పదేళ్ళకు పైగా ఆక్రమణలో ఉన్న భూములపై ఎకరాకు 450 చదరపు గజాల ప్లాట్ ఇస్తారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయ నగరం జిల్లాల్లోని ఆరు మండలాల్లో అందుబాటులో ఉన్న భూముల వివరాలను నివేదికలో పేర్కొంది.

# బంగారు కుటుంబాలను ఆదుకొనేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త** బంగారు కుటుంబాలుగా తీర్చి దిద్దుటకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి పారిశ్రామిక వెత్త సహకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన గురువారం పంచాయతీరాజ్ అతిథి గృహంలో పారిశ్రామిక వెత్తలతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి 31 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 'బంగారు కుటుంబాల' కార్యక్రమాలను పి4గా తీసుకున్నారన్నారు. సమాజం లోనూ, ఆంధ్ర రాష్ట్రం లో పేదరికం లేని సమాజాన్ని తీర్చి దిద్దాలనే మహోన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాలను చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో పరిశ్రమలను ఆహ్వాని స్తున్నామని అలాగే పరిశ్రమల స్థాపనకు అన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నామని అయితే ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు సిఎం లక్ష్య సాధనకు మనం అందరం సహకరిం చాలని పిలుపు నిచ్చారు. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి పెద్ద పారిశ్రామిక హబ్‌గా ఉందని కాబట్టి ఇక్కడ ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేస్తూ రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా ఉండాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సమాజంలోని రుగ్మతలను తొలగించుటకు పేద ధనిక అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలనే మహోన్నత లక్ష్యంతో సిఎం నిర్ణయించారు.ఈ కార్యక్రమాల్లో పరిశ్రమలు తమకు అందుబాటులో ఉంటే సిఆర్‌ఎస్ నిధులను కేటాయించాలని వివరించారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

## - హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ

**విజయవాడ,జూలై 31,ప్రభాతవార్త ప్రతినిధి** వివాహ,వ్యాపార సంబంధ వివాదాలకు మధ్యవర్తిత్వం మంచి పరిష్కార మార్గమని ఏపీ న్యాయయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్,హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ పేర్కొన్నారు. మధ్యవర్తి సమక్షంలో జరిగే చర్చలు గోప్యంగా ఉంటాయని,తద్వారా లభించే పరిష్కారం శాశ్వతమైందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 90 రోజులుగా కొనసాగుతున్న మీడియేషన్ ఫర్ నేషన్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన హైకోర్టు న్యాయవాదులను బుధవారం ఒక రోజు దిశా నిర్ధేశం (ఓరియంటేషన్)కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మధ్యవర్తిత్వంలో మెలుకువలు నేర్చుకొని,కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో సాయపడాలని సూచించారు. ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు జస్టిస్ ఆర్.రఘునందనరావు మాట్లాడుతూ...మధ్యవర్తిత్వం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కోర్టు ఫీజులను తిరిగి పొందవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య,జస్టిస్ టీసీడీ శేఖర్,సీనియర్ ట్రైనర్లు అనుజా సక్సేనా,ఎస్.అరుణాచలం పాల్గొన్నార,ఏపీ హైకోర్టు మధ్యవర్తిత్వ కేంద్ర ఇన్‌ఛార్జి డైరెక్టర్ జి.మాలతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


# ఒక ఎపిపిఎస్సీ ఉద్యోగాల్లో చాలా వాటికి ఒక్క పరీక్షే!, విధానంలో కీలక మార్పులు

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల విధానంలో కీలక మార్పు చోటుచేసు కుంది. ఇకపై ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 200 రెట్లు దాటి ధరఖాస్తులు వస్తేనే ప్రిలిమ్స్ నిర్వహిస్తారు.

ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ పూర్వ ఉత్తర్వులను సవరించింది.100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు కనీసం 20,000 (200 రెట్లు) దరఖాస్తులు దాటితేనే ప్రిలిమ్స్,మెయిన్స్ ఎగ్జామ్ పెడతారు. ప్రస్తుతం ఉద్యోగాల సంఖ్యతో నిమిత్తం లేకుండా 25 వేలు దాటి ధరఖాస్తులు వచ్చినప్పుడు ప్రిలిమ్స్,మెయిన్స్ నిర్వహిస్తున్నారు. దీనివల్ల విలువైన సమయం వృధా అవుతోంది. ఖర్చు కూడా ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో ఖాళీల సంఖ్య కంటే ధరఖాస్తు చేసిన అభ్యర్థుల సంఖ్య 200 రెట్లు మించినప్పుడే ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు అనుమతినివ్వాలని ఏపీపీఎస్సీ ప్రభుత్వాన్ని కోరింది. దీనిని ప్రభుత్వం ఆమోదించడం ద్వారా ఏపీపీఎస్సీ భర్తీ చేసే ఉద్యోగాల్లో చాలా వరాటికి ఒక్క పరీక్ష మాత్రమే ఉండే అవకాశం ఉంది.

# పవిత్రతను దెబ్బతీసేలా రీల్స్ చేస్తే ఇక అంతే సంగతులు !

## - ఆలయం ముందు రీల్స్ నిషేధం - తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం కాపాడాలి



**తిరుమల,జూలై 31ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలకొండపై భక్తులు ఆధ్యాత్మిక భావంతో మెలగాలని, పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడాలని తిరుమల తిరుపతిదేవస్థానం కోరింది. ఆధ్మాత్మిక వాతావరణం నెలకొనేలా చూస్తున్న టిటిడికి భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. తిరుమలలో ఆలయ పవిత్రతకు భంగం కలిగేలా రీల్స్ ,వీడియోలు చిత్రీకరిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి టిటిడి సిద్ధమైంది. ఇలాంటి తప్పులు చేయవద్దని భక్తులకు సూచించింది. తిరుపతి అలిపిరిలో,తిరుమలకొండపై రీల్స్ చేసి కొందరు సామాజికమాధ్యమాల్లో చేర్చడం(అప్‌లోడ్)పై తీవ్రంగా పరిగణించింది. దీనిపై టిటిడి సంచన నిర్ణయం కూడా తీసుకుంది. ఇష్టదైవమ్ ఆపదమొక్కులవాడి దర్శనానికి వచ్చి రీల్స్,ఫోటో షూట్ చేస్తూ తోటి భక్తులకు పలువురు ఇబ్బందులు కలిగించారు. అంతేగాక ఆలయం ముందు, మాఢవీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు చేస్తూ, నృత్యాలు ప్రదర్శిస్తూ వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో చేర్చడంపై టిటిడి తీవ్రంగా పరిగణించింది. గతంలో జరిగిన అనేక తప్పిదాలపై టిటిడి కేసులు నమోదు, భక్తులపట్ల సంయమనం ధోరణితో వ్యవహరించింది. అయితే ఈ రీల్స్ పిచ్చి పవిత్రతకు భంగం కలిగేలా, ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతినేలా మారింది. ఏకంగా ఆలయం ముందు రీల్స్ చేయడాన్ని టిటిడి నిషేధించింది. దీనిపై టిటిడి విజిలెన్స్,పోలీసుశాఖలు గట్టి నిఘా ఉంచాయి.

# ఆగస్ట్ 8న సౌభాగ్యం

## - సుమంగళిద్రవ్యాలు దాత సహకారంతో సిద్ధం

**తిరుమల,జూలై 31ప్రభాత వార్తప్రతి నిధి:** పవిత్రమైన శ్రావణ మాసంలో ఆగస్ట్ 8న శుక్రవారం వరలక్ష్మి వ్రతం పర్వదినం సందర్భంగా టిటిడి,హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సౌబాగ్యం నిర్వ హిస్తోంది. ఈ కార్యక్రమానికి అవసరమైన సుమంగళిద్రవ్యాల సామాగ్రిని ఓ దాత సహకారంతో సిద్ధంచేశారు. సౌభాగ్యం సామాగ్రికి గురువారం శ్వేత భవనంలో టిటిడి, డిపిపి అధికారులు, సిబ్బంది శ్రీవారి సేవకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిటిడి ఆధ్వర్యంలో రెండు తెలుగురాష్ట్రాల్లో నడుస్తున్న 51 ఆలయాల్లో సౌబాగ్యం పేరుతో మహిళలకు గాజులు ,పసుపు, కుంకుమ, అక్షింతలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సౌభాగ్యులకు గాజులు, పద్మావతిఅమ్మవారి



కుంకుమప్యాకెట్లు, కంకణాలు, పసుపుదారాలు, పద్మావతి అమ్మ వారి లక్ష్మీఅష్టోత్తర శతరా మావళి పుస్తక ప్రసాదాలను అందించనున్నారు. 8లక్షలు గాజులు, 1.40లక్షలు కంకణాలు, 1.40లక్షలు పసుపుదారాలు, కుంకుమ ప్యాకె ట్లు, పుస్తకప్రసాదాలను అందించ నున్నారు.

# పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6వేలకు పైగా తరగతి గదుల నిర్మాణం

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ప్రభుత్వ పాఠశాలల్లో 'మన బడి-మన భవిష్యత్తు'కింద పనులు చేపట్టేందుకు రాష్ట్రపాఠశాల విద్య మౌలికసదుపాయాల కల్పన విభాగం చర్యలు చేపట్టింది. 2025-26 సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాల ఆధారంగా అవసరమైన చోట్ల మొదటి ప్రాధాన్యతగా పనులు చేపట్టనుంది. ఇందుకోసం జాబితాను రూపొందించింది. పాఠశాల విద్యలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా మౌలిక సదుపాయాల అవసరాలు మారాయి. గత ప్రభుత్వంలో 3,4,5 తరగతులను 3,692 ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలకు మార్చారు.అందుకోసం అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు.

అయితే,వైకాపా ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు 3,4,5 తరగతులను చాలా చోట్ల మళ్ళీ వెనక్కి తీసుకొచ్చారు. దాంతో ఆయా తరగతి గదుల అవసరాలు మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా 294 హైస్కూలు ప్లస్‌లలో ఇంటర్మీడియట్ కోసం ఒక్కో చోట మూడు తరగతి గదుల చొప్పున ప్రతిపాదించారు.

# హజ్ యాత్ర 2026 కు దరఖాస్తు గడువు పెంపు

## మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తరపతినిధి:** హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్ 2026 కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువు ను ఆగస్టు 7 వ తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అమరావతిలో గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.హజ్ యాత్ర కోసం దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించడం కోసం కేంద్రహజ్ కమిటీ దేశవ్యాప్త ప్రకటన చేయడం జరిగిందని తెలిపారు.హజ్ దరఖాస్తుల ఫారమ్‌లను పూరించడానికి కేంద్ర హజ్ కమిటీ మొదట జులై 31వ తేదీ వరకు గడువు నిర్ణయించిందన్నారు. హజ్‌కు వెళ్లాలనుకొని గడువులోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను పూరించని ఆంధ్రప్రదేశ్ కు చెందిన యాత్రికులంతా ఆగస్టు 7వ తేదీ వరకు గడువు పెంపు సౌలభ్యంతో విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్ ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకొని దరఖాస్తు చేసుకోవాలని మంత్రి కోరారు. ముఖ్యంగా ఇప్పటికే హజ్ 2026 కు దరఖాస్తు చేసుకున్న యాత్రికులందరూ కూడా ఎంబార్కేషన్ కేంద్రాల ప్రాధాన్యతలో మార్పు చేసుకుని విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని సూచించారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లే యాత్రికులకు కూటమి ప్రభుత్వం మంజూరు చేసే రూ. లక్ష ఆర్థిక సాయాన్ని యాత్రికులు సద్వినియోగం చేసు కునేందుకు వీలుగా విజయవాడ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి హజ్ యాత్రికులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి కోరారు. గడువు పొడిగింపు ఉండదన్నారు..

# మాజీ సిఎం జగన్‌కు అట్టపెట్టెల లెక్క బాగా తెలుసు: మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జూలై31, ప్రభాతవార్తప్రతినిధి:** అవినీతికి మాజీ సీఎం జగన్ పర్యాయపదమని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ఆరోపించారు. లిక్కర్ కుంభకోణంలో పెద్దఎత్తున డబ్బు పట్టుబడటంపై గురువారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి లోకేష్ పలు అంశాలపై స్పందించారు,అట్టపెట్టెల్లో పట్టుబడిన సొమ్ముపై ఆయన మాట్లాడుతూ ఇంత డబ్బు ఎంత మంది చేతులు మారాయో జగన్ ను అడిగితే లెక్కలు ఇస్తారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**
SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8(6) ప్రకారం జారీ చేయడమైనది.

టు, ఋణగ్రహీత(లు): 1) శ్రీ గంటి రాంబాబు, తండ్రి : శ్రీ గంటి కృష్ణ, డి నెం.26-16-3/1, మొదటి అంతస్తు, కంబాలపేట, నందం గనిరాజు జంక్షన్ దగ్గర, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533101. మరొక చిరునామా : శ్రీ గంటి రాంబాబు, తండ్రి : శ్రీ గంటి కృష్ణ, డి నెం.13-2-5/1A, కోటిలింగాలపేట, రామాలయం ఎదురుగా, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533101. మరొక చిరునామా : శ్రీ గంటి రాంబాబు, తండ్రి : శ్రీ గంటి కృష్ణ, జెకె కన్సల్టెన్సీ సర్వీసెస్, డి నెం.46-12-19/A, దానవాయిపేట, శ్రేయా హాస్పిటల్ ప్రక్కన, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533103. 2) శ్రీమతి గంటి జయ మాధవి, భర్త : శ్రీ గంటి రాంబాబు, డి నెం.26-16-3/1, మొదటి అంతస్తు కంబాలపేట, నందం గనిరాజు జంక్షన్ దగ్గర, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533101. మరొక చిరునామా : శ్రీమతి గంటి జయ మాధవి, భర్త: శ్రీ గంటి రాంబాబు, డి నెం.13-2-5/1A, కోటిలింగాలపేట, రామాలయం ఎదురుగా, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533101. మరొక చిరునామా : శ్రీమతి గంటి జయ మాధవి, భర్త: శ్రీ గంటి రాంబాబు, జెకె కన్సల్టెన్సీ సర్వీసెస్, డి నెం.46-12-19/A, దానవాయిపేట, శ్రేయా హాస్పిటల్ ప్రక్కన, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533103.
సార్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోవలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి తేది.06.12.2023 న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా తేది.04.12.2023 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.33,97,498/- (అక్షరాల ముప్పై మూడు లక్షల తొంభై ఏడు వేల నాలుగు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే) + తేది.05.12.2023 నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది.05.12.2024 న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది.08.12.2024 న (సాక్షి : తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్ (తెలుగు) మరియు టైమ్స్ ఆఫ్ ఇండియా : విశాఖపట్నం ఎడిషన్ (ఇంగ్లీష్) స్థానిక దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తేది. 06.12.2023 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులు విక్రయించుటకు బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు:**
రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.12428/2016 తేది.24.11.2016, ఎస్ఆర్ఓ, రాజమండ్రి ప్రకారం శ్రీ గంటి రాంబాబు, తండ్రి : శ్రీ గంటి కృష్ణ & శ్రీమతి గంటి జయ మాధవి, భర్త : శ్రీ గంటి రాంబాబు గార్ల పేరున ఉన్న, తనఖా పెట్టిన స్థిరాస్తి : ఎ-షెడ్యూల్: తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, రాజానగరం మండలం, దివాన్‌చెరువు గ్రామ పంచాయితీ, పాలచర్ల గ్రామం మరియు తాలూక, స్వరూప్ నగర్ హిల్ కాలనీ, ఆర్.ఎస్ నెం.507/2 నందు దివాన్ చెరువు గ్రామపంచాయితీ వద్ద ఎకరా 7.46 సెంట్లులోని ఎకరా 1.70 సెంట్లు భూమిని ఇతరుల తాలూకు భూమితో కలిపి ఒకే లే-అవుట్‌గా ఏర్పాటు చేయబడినది. ఇది P.R.No.31. తేది.31.01.1985 ప్రకారం ఆమోదించబడిన లేఅవుట్, ఇందులో ప్లాట్ నెం.28 లోని 342.22 చ॥గ॥లు స్థలంలో "శ్రీ త్రిపుర రెసిడెన్సీ" అను పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మించబడినది. హద్దులు : తూర్పు : 40 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం : స్థలం ప్లాన్ ప్రకారం ప్లాట్ నెం.29, పడమర : ప్లాట్ నెం.30 స్థలం కొంత భాగం మరియు ప్లాట్ నెం.26 కొంత భాగం, ఉత్తరం : ప్లాట్ నెం.27.

పై హద్దుల యందు విస్తీర్ణం 342.22 చ॥గ॥లు (లేదా) 286.13 చ॥మీ॥లు స్థలంలోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 24.44 చ॥గ॥లు (లేదా) 20.436 చ॥మీ॥లు అనగా 1/14వ వాటాతో కూడు.

షెడ్యూల్-బి : పైన చెప్పబడిన ఎ-షెడ్యూల్ 342.22 చ॥గ॥లులో నిర్మించిన శ్రీ త్రిపుర రెసిడెన్సీ మొదటి అంతస్తులోని విస్తీర్ణం 1066 చ॥అ॥లుతో (మెట్లు, బాల్కనీలు, కామన్ ఏరియాలు మరియు కార్ పార్కింగ్ ఏరియాలతో కలిపి) నార్త్‌ఈస్ట్ కార్నర్ టూ బెడ్ రూమ్ ఫ్లాట్ నెం.202. హద్దులు : తూర్పు: ప్రవేశం & ఓపెన్ వరండా, దక్షిణం : ఫ్లాట్ నెం.201, పడమర : శూన్యాకాశం, ఉత్తరం : శూన్యాకాశం.

తేది : 25.07.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వార్త

కొందరు గొప్పవారుగా జన్మిస్తారు. మరి కొందరు గొప్పవారుగా జీవిస్తారు. ఇంకా కొందరు గొప్పవారుగా తయారవుతారు.

-ఫ్రాంక్లిన్

# రక్తసిక్తమవుతున్న రహదారులు


దేశంలో రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చేది గ్యారంటీ లేని అభద్రతా భావం పెరిగిపోతున్నది. అన్నెంపున్నెం ఎరుగుని వేలాది మంది అమాయకులు రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు. ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు. యేటా వేలాది మంది అసువులు భాస్తున్నారు. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 2001-2020 వరకు తొంభైఆరు లక్షల, అరవైరెండువేలకుపైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవైమూడు లక్షల, ఇరవైఐదువేల మంది మృత్యువాతపడినట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి.ఇక క్షతగాత్రులైనవారి సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత నాలుగేళ్లలో దాదాపు ముప్పైవేల ప్రమాదాలుచోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యుతో పోరాడి రోడ్లపైనే ప్రాణం వదిలినవారెందరో ఉన్నారు. మొన్న శనివారం తెలంగాణలోని రంగారెడ్డిజిల్లా షాద్‌నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇలా సకాలంలో వైద్యం అందక తండ్రీకూతురు ఇద్దరూ ప్రాణాలు వదిలిన హృదయవిదారక సంఘటన చోటు చేసుకున్నది. ఇంజినీరింగ్ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్న ఏకైక కుమార్తెను కాలేజీ బస్సుఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి పట్టణ కూడలి వద్దకు వచ్చేసరికి ఒక ట్యాంకర్ ఢీకొట్టింది.ఆ ప్రమాదంలో తీవ్ర గాయాలైన తండ్రి దూరంగా పడిపోగా కుమార్తె లారీ చక్రాల కింద ఇరుక్కుపోయింది. ఒకవైపు క్షతగాత్రు డైన తండ్రి, మరొకవైపు చక్రాల కింద నలిగిపోతూనే ఆ యువతి తమను కాపాడాలంటూ చేసిన ఆర్తనాదాలు చూపరులను కలచివేశాయి. ఒకపక్క తీవ్ర రక్తస్రావం అవుతున్నా తన ఇంటికి సమాచారం అందించాలని ఆమె తన సెల్‌ఫోన్‌ను అందించింది. ఆ తర్వాత అందరు కలిసి బయటకు తీసి ఆస్పత్రికి తరలించేలోపే తండ్రి కుమార్తెలు ఇద్దరూ మరణించారు. భర్తను, ఏకైక కుమార్తెను కోల్పోయిన ఆ ఇల్లాలు వేదనను వర్ణించడానికి మాటలు అందవు. అదే రోజూ విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ముగ్గురు పోలీసు అధికారులు రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు డిఎస్పీలు అక్కడికక్కడే మరణించగా మరొక అడిషనల్ ఎస్పీతోపాటు డ్రైవర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డి చెరువు కట్టపై ఈ నెల పదమూడోతేదీ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది కూలీలు మరణించగా మరో పన్నెండు మంది గాయపడ్డారు. రాజంపేట మండలం ఇస్కపల్లి గ్రామ పరిసరాల్లోనే తోటల నుంచి మామిడి కాయలు కోసుకొని మార్కెట్‌కు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. పైభాగాన కూర్చొని ఉండడం వల్ల లారీ ఒక్కసారిగా తిరగబడడంతో మామిడి కాయలన్నీ వారిపై పడ్డాయి. ఊపిరి ఆడక కొందరు, మరికొందరు దెబ్బలతో మృతిచెందగా ఇంకొందరిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా సకాలంలో సహాయం అంది ఉంటే మామిడి కాయల కింద ఉన్నవారిని బయటకు తీసే అవకాశంఉండేదని అంటున్నారు. అమెరికా లాంటి దేశాల్లో ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మితిమీరిన వేగంతోపాటు మద్యం మత్తులో కూడా ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలా నిత్యం రక్తసిక్తం అవుతున్నాయి. అసలు పోలీసు రికార్డుల్లోకి రాని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. చనిపోయిన వారిలో అధిక శాతం పద్దెనిమిదేళ్లు, ముప్పైయేళ్ల వయసు ఉన్నవారే. సంపాదన చేస్తున్న భర్తో, కుమారుడో, చేతికి అంది వస్తున్న వారిని కోల్పోయిన ఆ కుటుంబాల పరిస్థితి ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. ఒకటి, రెండు కుటుంబాలు కాదు. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. వారి పరిస్థితి వింటుంటే ఆ కుటుంబ సభ్యుల విషాదగాథలు చూస్తుంటే ద్రవించని హృదయం ఉండదు. యేటా వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో అసువులు బాస్తుంటే పట్టించుకోకపోవడం క్షంతవ్యం కాదు. అన్నిటికంటే ముఖ్యంగా మద్యం ఈ ప్రమాదాల్లో కీలక పాత్ర వహిస్తున్నది. చివరకు పిల్లలను స్కూళ్లకు తీసుకు వెళ్లే బస్సుల వాహనదారులు కూడా కొందరు మద్యం మత్తులో ఉన్నారంటే ఏమనుకోవాలి. మొన్న ఈ మధ్య హైదరాబాద్ నగరవ్యాప్తంగా చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఇలా పిల్లలను పాఠశాలలకు చేరవేస్తున్న బస్సు డ్రైవర్లలో పద్నాలుగు మంది, ఆటో డ్రైవర్లలో ఇరవై ఆరు మంది పూర్తి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. ఇందులో కొందరు అయితే ఒళ్లు తెలియని పరిస్థితుల్లో ఉన్నట్లు కూడా సమాచారం. కేవలం మత్తు మైకంలో వాహనాలు తోలడం వల్ల దేశంలో 2022లో పదివేలకుపైగా ప్రమాదాలు జరిగితే 4,200మంది అసువులు బాశారు.మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాలను పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ప్రాణాలను లెక్క చేయడంలేదనిపిస్తున్నది. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి.ప్రధానంగా మద్యం సేవించడం, లేక అలక్ష్యంతో వాహనాలు నడిపి ఎంత మందిని చంపినా జరిమానా చెల్లిస్తే సరిపోతుందనే భావన పోగొట్టాలి. కొన్ని పాశ్చాత్య దేశాల్లో లాగా మరణానికి కారణమైన వాహన చోదకులు జీవితంలో స్టీరింగ్ పట్టకుండా పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేయాలి.

సందేహాన్ని ప్రశ్నించేవాడు ఆ సమయంలో మాత్రమే మూర్ఖుడు. అసలు ఎవరినీ ప్రశ్నించనివాడు జీవితాంతం మూర్ఖుడే.



జాన్సన్

మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. వినాశనానికి కాదు.



షేక్స్పియర్

# ప్రజావాక్కు



## ఉద్యోగులకు బై బై చెప్పిన టాటా

ప్రముఖ ఐటీకంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఒకేసారి 12,200మంది ఉద్యోగులను తొలగించబోతున్నట్లు ప్రకటించడం అందరినీ షాక్‌కి గురిచేసింది. ఆ సంఖ్య తన మొత్తం ఉద్యోగుల సంఖ్యలో రెండు శాతం. ఈ స్థాయిలో ఉద్యోగాలకు ఉద్వాసన పలకడం భవిష్యత్‌లో జాబ్ మార్కెట్‌లో జరగబోతున్నపరిణామాలకు తొలి సంకేతం. ప్రమాద హెచ్చరిక.ఉద్యోగాల తొలగింపు అన్నది ఒక ఐటీ రంగానికి,లేదాభారత్‌కి మాత్రమే సంబంధించిన కుదుపు కాదు. ప్రపంచవ్యాప్తంగా, అన్నిరంగాల్లో ఎదురవ్వబోయే కీలక మార్పులకు అద్దం పడుతుంది.ఐటీ రంగంలో ఇప్పటికే కృత్రిమ మేధప్రభావం వేగంఅందుకుంది. కోడింగ్‌లో ముప్పై శాతం మేరకు కృత్రిమ మేధ ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. మిగతా రంగాల్లో కూడా దాని ప్రభావం విస్తృతమవుతోంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయ కక్ష్యలు,కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి.మనుషులంటే సరేసరి. ఆరాజకీయ కక్ష్యలు,కార్పణ్యాలు గతప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు. గ్రామంలో ఎవరు ఎవరికి ఓటు వేసినా, వేయకపోయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన, మన అనే భేదం లేకుండా మనకు ఓటు వేయమని వారిని ఏ ప్రభుత్వ పథకాలు ఇచ్చి వారిని ఆ ప్రభుత్వంపై మంచి అభిప్రాయం తీసుకురావాలని ఆలోచించాలి.

- పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

## వెల్‌నెస్ సెంటర్లో అందని సేవలు

ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా హనుమకొండలోని మెటర్నిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయబడ్డ వెల్ నెస్ సెంటర్‌లోనిత్యంవచ్చేవారికి పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టులు నిత్యం వెల్‌నెస్ సెంటర్‌కి వస్తారు. కానీ అన్ని సేవలు అందుబాటులోకిరావడంలేదు.న్యూరో,పీడియాట్రిక్ డాక్టర్ లేకపోవడం వల్ల నానా యాతన పడుతున్నారు.

- కె. సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## ఉన్నత వర్గాల వారికే ఉద్యోగాలా..

నిజానికిమ్యాథమెటిక్స్ ఎప్పుడూ ఇంగ్లీష్ మీడియంలోనే ఉన్నది. మాతృభాషలో అర్థం అవడానికి వీలుగా కొన్ని పదాలను కలుపుతూ ఉంటారు. ఇంగ్లీష్ టీచర్లు కూడా లెసన్స్ ఇంగ్లీష్ టు ఇంగ్లీష్‌లో చెప్పకుండా మాతృభాషలో ట్రెడిషనల్ టీచింగ్ ట్రాన్స్‌లేషన్ మెథడ్‌లోనే విద్యార్థినీవిద్యార్థులకు చేరువ కావడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ప్లస్, మైనస్, ఈజీ ఈక్వల్ టు, ఎ స్క్వేర్, బి స్క్వేర్ మొదలగు పదాల్ని తెలుగులో ఎవరూ చెప్పలేరు.అవి ఇంగ్లీషులోనే చెబుతారు. ఫిజిక్స్ కూడా తెలుగు పదాలతో చెప్పలేరు సాధ్యమైనంత వరకు ఇంగ్లీష్ పదాలతో ఇంగ్లీష్ మీడియంలోనే చెబుతారు. నవోదయ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మ్యాథమెటిక్స్ సైన్స్ ఇంగ్లీష్ మీడియంలో చెబుతూ సోషల్ స్టడీస్ మాతృభాషలో చెబుతారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఖచ్చితంగా ఇంగ్లీష్ మీడియంలోనే ఉండాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## వృక్షో రక్షతి రక్షితః

శబ్ద,వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు. ఇక పశుపక్ష్యాదుల సంగతి సరేసరి. ప్రకృతి అసమతుల్యత వైపుపయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడు మేలుకోలేదన్నవిషయం ఆందోళనకరం.ఇది ముమ్మాటికి మానవ తప్పిదం. మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు,భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తలపెట్టేపనులు ఇకనుంచి అయినా మానుకోవాలి. ప్రపంచ దేశాలకే పెను సవాళ్లుగా ఎదురవుతున్న గ్లోబల్ వార్మింగ్‌కై సమష్టి కృషితో ప్రయత్నించాలి.

-ఆర్.వెంకటేష్, బెంగళూరు

## పర్యవేక్షణ తప్పనిసరి

ప్రస్తుతం పాఠశాలలకు విద్యార్థులను చేరవేస్తున్న ఆటోల భద్రత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేటు బస్సుల ఫీజులు భరించలేక, పల్లెలనుంచి సరైన రవాణా సౌకర్యాలు లేక చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటోల్లో పంపించక తప్పని పరిస్థితి. ఆటోడ్రైవర్ల అత్యాశ, అధికారుల పర్యవేక్షణాలోపం విద్యార్థుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయి.అతివేగం, ఎక్కువ మంది పిల్లలను ఎక్కిస్తే ఎక్కువ ఆదాయం అనే డ్రైవర్ల ఆలోచన ప్రధాన ప్రమాద కారణాలుగా మారుతున్నాయి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రామాల్లో కనిపించని ప్రభుత్వం!

**ప్రజలు ఇవ్వనున్న ఫిర్యాదులకు 15 రోజుల్లోగా స్పందించాల్సిందే అన్న నియమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి. అధికారులు స్వయంగా సోషల్ మీడియాలో ప్రజల ఫిర్యాదులను చూచి స్పందించే విధంగా వ్యవస్థలు బలోపేతం చేయాలి. ఒక ప్రజాస్వామ్యంలో అధికారి పదవిలో ఉండడం మానవ సేవకే నిదర్శనం. ప్రజల కష్టాలు, అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కరించడమే అసలైన పబ్లిక్ సర్వీస్. నేరుగా ప్రజలను కలిసే అధికారులే నమ్మకాన్ని కలిగిస్తారు. వారి మాటలకు బలం వస్తుంది. వారు తీసుకునే చర్యలకు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రజలకు దగ్గరగా ఉండే విధానాలు, బాధ్యతాయుత పాలన లేకుంటే ప్రజాస్వామ్యమే ఖాళీ నినాదంగా మిగులుతుంది. అధికారులు కార్యాలయాల్లోనే కాకుండా ప్రజల మధ్యకు వెళ్లి, వారి బాధలు తెలుసుకొని, తక్షణమే స్పందించగలగాలి. అప్పుడే నిజమైన ప్రజాపాలన సాధ్యమవుతుంది.**



మన్నారం నాగరాజు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయ్యాయి. రాష్ట్ర ఏర్పాటు సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆశలు, కలలు వేరు. కానీ వాస్తవిక పాలన మరోలా ఉంది.పాలనావ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండాలని భావించి కొత్త జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేశారు. కానీ అసలు లక్ష్యం అయిన ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వాటిని పరిష్కరించడం అనే ప్రధాన అంశం మాత్రం అధికార యంత్రాంగానికి మరచిపోయిన పనిఅయింది. ఇప్పటి పరిపాలన వ్యవస్థలో అనేకమంది తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లు వాస్తవంగా ప్రజల అవసరాలను ఎదుర్కొనాల్సిన బాధ్యతలు ఉన్నప్పటికీ, వారు కార్యాలయాల్లోనే పరిమితంఅవుతూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ప్రజా సమస్యలు తెలుసుకోవాలంటే తాము గ్రామాల్లోకి, బస్తీల్లోకి వెళ్లి పరిశీలించాల్సిన అవసరం ఉంది. కానీ చాలా మంది అధికారులు ఫీల్డ్ విసిట్‌లు చేయకుండా, ఎయిర్ కండీషన్ గదుల్లోంచే పరిపాలన నిర్వహిస్తున్న పరిస్థితి ఏర్పడింది. తహసీల్దార్ స్థాయి నుంచీ కలెక్టర్ స్థాయి వరకు ఉన్న అధికారులలో కొందరు తప్ప మిగతావారంతా దాదాపు ఆఫీసులో పనులకే పరిమితం అవుతున్నారు. ఫలితంగాగ్రామాల్లో భూమి సమస్యలు, రేషన్ కార్డుల తడబాటు, సంక్షేమ పథకాల అమలులో తలెత్తుతున్న లోపాలు అధికారుల దృష్టికి రాకుండానే ఉంటున్నాయి. ప్రజల నుండి విజ్ఞప్తులు వచ్చినా, వాటిని కేవలం ఫైల్ నిప్పులు పేర్చే స్థాయిలో పరిష్కరించే ప్రయత్నమే జరుగుతోంది. ఇతరంగా చూస్తే, ప్రజలపై ప్రత్యక్ష నిఘా లేకపోవడం వల్ల స్థానిక అధికారులు, విలేజ్ సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది తాము అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అవినీతి పెరుగుతోంది. పై స్థాయి అధికారులు ప్రజల మధ్యకి వస్తేనే అటువంటి లోపాలు వెలుగులోకి వస్తాయి. కానీ అధికారులు తమ భద్రత, కార్యాచరణలు, 'ప్రోటోకాల్'ల పేరిట బయటకు వెళ్లడం మానేయడం వల్ల ప్రజాస్వామ్య సంబంధ పరిపాలన దెబ్బతింటోంది. పదవుల్లో ఉండే ప్రతి అధికారికి ప్రజల పట్ల నైతిక బాధ్యత ఉంటుంది. కార్యాలయంలో కూర్చొని కాకుండా, వారంలో కనీసం రెండు రోజులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు స్వయంగా విన్నప్పుడే పరిపాలనలో నైతిక బలం ఏర్పడుతుంది. ప్రజలపై నేరుగా గమనిక పెడితేనే అర్థవంతమైన పాలన సాధ్యమవుతుంది. అధికారులు ఆఫీసుల్లో నుంచే పరిమితమైతే, పాలన అర్ధాంతరంగా మారుతుంది. అధికారాల కొరత, స్టాఫ్ లేమి అనేది గ్రామీణ పాలనలో ఒక పెద్ద సమస్యగా మారుతోంది. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వల్ల ప్రజలకు అవసరమైన సేవలు ఆలస్యమవుతున్నాయి. పటేల్స్, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు లేకపోవడం వల్ల నిత్య సేవలు నిలిచిపోతున్నాయి. వ్యవసాయ శాఖలో వ్యవసాయ అధికారుల కొరత రైతులకు సలహాలు,సహాయం అందే విధానాన్ని తగ్గిస్తోంది. ఈ ఖాళీలు వెంటనే నింపకపోతే, ప్రజల పనులు పెండింగ్ అయ్యి, పాలనపై నమ్మకం తక్కువవుతుంది. ప్రభుత్వం దీన్ని అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రజలకు డిజిటల్ పాలన అందుబాటులోఉందా? ప్రభుత్వాలు 'డిజిటల్ ఇండియా' 'ఈగవర్నెన్' వంటి కార్యక్రమాలద్వారా పౌరులకు సేవలు వేగంగా, పారదర్శకంగా అందించాలన్న ఆశయంతో ముందుకొస్తున్నాయి.రేషన్,పెన్షన్,విద్య, ఆరోగ్య సేవలు ఇలా అన్నింటికీ సంబంధించి మొబైల్ యాప్‌లు, పోర్టల్స్ అందుబాటులోకి తీసుకువచ్చాయి.కానీ ఇవి నిజంగా గ్రామీణ ప్రజలకు ఉపయోగపడుతున్నాయా? గ్రామాల్లో



ఇప్పటికీ అనేకచోట్ల స్థిరమైన విద్యుత్ సరఫరాలేదు.మొబైల్ సిగ్నల్ బలహీనంగా ఉండటం, ఇంటర్నెట్ వేగం తక్కువగా ఉండటం వల్ల, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడం లేదు.ఒక వృద్ధుడు పెన్షన్‌కోసం అప్లైచేయాలన్నా,ఓ మహిళ రేషన్‌లో సమస్యకు ఫిర్యాదు చేయాలన్నా - అంగలార్చాల్సిందే. యాప్‌లలో లోడవ్వకపోవడం, ఒటిపిరాకపోవడం, సాంకేతిక సమస్యలు సాధారణమే. పైగా,చాలామంది గ్రామస్తులకు యాప్‌లు ఎలావాడాలో తెలీదు. ఈ నేపథ్యంలో, అధికారులు గ్రామాల్లోకి వచ్చి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినాల్సిన అవసరం ఉంది.కానీ ఇప్పుడు మొబైల్‌యాప్ లేదా పోర్టల్ వాడలేకపోయినా, సమస్య ఎక్కడ చెప్పాలో గ్రామస్థులకు స్పష్టత లేదు. అధికారుల డిజిటల్ మాయాజాలం ప్రజలకు నిరాశను మిగులుస్తోంది. గ్రామీణ ప్రజల డిజిటల్ సౌకర్యాలపై నిజమైన అధ్యయనం లేకుండా, కేవలం గణాంకాల కోసం ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నట్టుగా చూపించడం ప్రమాదకరం.ప్రజలు తమ సమస్యల పరిష్కారాల కోసం అధికార కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, అక్కడ వారిని ఎదుర్కొనే విధానం మాత్రం నిరాశ కలిగించేలా మారుతోంది. అధికారుల తీరులో ప్రజల పట్ల గౌరవం కాకుండా, అధికారపు అహంకారం నిండిపోయినట్టుగా అనిపిస్తోంది.సమస్యలతో వచ్చిన పౌరులకు సరైనసమాధానం చెప్పకుండా, వారికి ఏకపక్షంగా తలుపులు మూసే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపోటువలె మారుతోంది. ప్రజల సేవకులుగా ఉండాల్సిన వారు అధికార ధోరణితో ప్రవర్తించడం అసహనానికి దారితీస్తోంది.ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం అత్యవసరం. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులుగా సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మండల స్థాయి నాయకులు పనిచేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అధికారులకు వినతుల రూపంలో అందజేస్తుంటారు. కానీ చాలా సందర్భాల్లో అధికారులు ఆ వినతులను పట్టించుకోవడం లేదు. ఇది ప్రజాప్రతినిధుల సామర్థ్యాన్ని ప్రశ్నించేలా చేస్తోంది. స్థానికంగా ఉండే సమస్యలు మంచినీటి కొరత, డ్రైనేజీ సమస్య, రహదారి మరమ్మతులు వంటి వాటికి సత్వర పరిష్కారం లభించకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే స్థానిక నేతల వినతులను అధికారులు గౌరవించకపోతే ప్రజాస్వామ్యానికి నష్టం కలుగుతుంది. అందుకే అధికార యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను సమర్థవంతంగా పరిశీలించి, వాటిపై స్పందించాల్సిన అవసరం ఉంది. అధికారులు ప్రజల వద్దకు రాకపోవడంతో,గ్రామాలు పట్టణాల స్థాయిలో నీటికొరత, డ్రైనేజ్ సమస్యలు, రోడ్ల ఘోర స్థితిగతులు వంటి ప్రాథమిక సమస్యలే కలెక్టర్ దృష్టికి రాకుండా మిగిలిపోతున్నాయి. ఫీల్డ్‌లోకి వెళ్లి ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే విధానం లేకపోవడం, మధ్యస్థాయి ధికారుల నివేదికలపై మాత్రమే ఆధారపడటం వల్ల సమస్యలు అసలు రూపంలో తెలియకపోతున్నాయి. దీనివల్లప్రజల ఇబ్బందులు పెరిగిపోతుండగా, పాలన మాత్రం ఫైలులపైనే నడుస్తోంది. ఇకధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమవుతున్నాయి. రైతులు అనేక కష్టాలతో పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చినా, కొనుగోలు కేంద్రాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు వారి ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. వర్షాల కారణంగా ధాన్యం కొంతమేర తడిసిపోవడం సహజం. కానీ, అధికారులు సడలింపులు లేకుండా కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు మూడోపార్టీ వ్యాపారుల వద్ద కనీస ధరకు కూడా రాని ధరకు విక్రయించాల్సిన పరిస్థితిలో ఉన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద బాధ్యత వహించాల్సిన అధికారులు ఫీల్డ్‌కి రావడం లేదు. దీంతో రైతులు అక్కడ గంటల తరబడి నిలబడాల్సిన,వారి సమస్యలు వినడానికి ఎవరూ లేకపోవడం గమనార్హం. ప్రజలు ఇవ్వనున్న ఫిర్యాదులకు 15 రోజుల్లోగా స్పందించాల్సిందే అన్న నియమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి. అధికారులు స్వయంగా సోషల్ మీడియాలో ప్రజల ఫిర్యాదులను చూచి స్పందించే విధంగా వ్యవస్థలు బలోపేతం చేయాలి. ఒక ప్రజా స్వామ్యంలో అధికారి పదవిలో ఉండడం మానవ సేవకే నిదర్శనం.ప్రజలకష్టాలు, అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కరించడమే అసలైన పబ్లిక్ సర్వీస్. నేరుగా ప్రజలను కలిసే అధికారులే నమ్మకాన్ని కలిగిస్తారు. వారి మాటలకు బలం వస్తుంది. వారు తీసుకునే చర్యలకు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రజలకు దగ్గరగా ఉండే విధానాలు, బాధ్యతాయుత పాలన లేకుంటే ప్రజాస్వామ్యమే ఖాళీ నినాదంగా మిగులుతుంది. అధికారులు కార్యాలయాల్లోనే కాకుండా ప్రజలమధ్యకు వెళ్లి, వారి బాధలు తెలుసుకొని, తక్షణమే స్పందించగలగాలి. అప్పుడే నిజమైన ప్రజాపాలన సాధ్యమవుతుంది. ●

# సీనియర్ సిటిజన్ కార్డుల నిలిపివేత సమంజసమా!

డాక్టర్ నీలం సంపత్

అరవై ఏళ్ల పాటు వారి కుటుంబాలతో పాటు సమాజ నిర్మాణంలో క్రియాశీలక భూమికను నిర్వర్తించి,ఎనలేని సేవలు అందించిన వయోవృద్ధుల సంక్షేమం కోసం, వారితో పాటు రాష్ట్రంలో ప్రత్యేక కేటగిరికి చెందిన వికలాంగులు, ట్రాన్స్ జెండర్‌లకు సైతం ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేయడం ద్వారా ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోపాటు బస్ ప్రయాణంలో, రైలు ప్రయాణంలో, విమాన ప్రయాణంలోనూ నిర్దిష్ట రాయితీలను సమకూర్చాలనే ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమే. సదరు ప్రభుత్వ పథకాల అమలుకు, సదుపాయాలను అనుభవించడానికి సీనియర్ సిటిజన్ కార్డులను కలిగివుండాలనే షరతుని విధించి వాటి జారీబాధ్యతను జిల్లా మహిళా శిశు సంక్షేమ, వికలాంగుల ట్రాన్స్ జెండర్ల శాఖకు అప్పగించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా నివసిస్తున్న వయోవృద్ధులైనా తమ నివాసాన్ని గుర్తించే ఆధార్ లేదా రేషన్ కార్డులతో పాటు వయస్సుని ధృవీకరించే స్కూల్ రికార్డుల ప్రకారం డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీ,నగరపాలక సంస్థలు జారీ చేసే జననధృవీకరణ పత్రాలతో నిర్దిష్టదరఖాస్తు ఫారాన్ని సంబంధిత అధికారులకు సమర్పించడం ద్వారా సీనియర్ సిటిజన్ కార్డులను పొందవచ్చుననేది ప్రభుత్వ విధానం. ఈనేపథ్యంలో 3కోట్ల ఎనభై లక్షల పైచిలుకు జనాభా కలిగిన తెలంగాణ రాష్ట్రంలో 11శాతంగా వున్న వయోవృద్ధులు ప్రారంభంలో సదరుకార్డులను పొందడానికి పెద్దగా ఆసక్తి చూపకపోవడం ఫలితంగా ప్రభుత్వం,ప్రింట్ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సోషల్ మీడియాచేసిన విస్తృత ప్రచారం నేపథ్యంలో ఇటీవల సదరు కార్డులను పొందడం కోసం భారీ సంఖ్యలో వయోవృద్ధులు సంబంధిత శాఖ అధికారులను సంప్రదించడం ప్రారంభించారు.ప్రతిజిల్లాలో ఆయా జిల్లాల సంక్షేమ అధికారుల కార్యాలయాల్లో వందల సంఖ్యలో సీనియర్ సిటిజన్ కార్డులు సంతకాల కోసం కుప్పలు, కుప్పలుగా పడి వుంటున్నాయని అంటున్నారు.గత పదిహేను రోజుల క్రితం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సంబంధిత శాఖలో వున్న కార్డుల కోసం దరఖాస్తుదారులు జిల్లా అధికారులను సంప్రదించినప్పుడు ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులను తాత్కాలికంగా నిలుపుదల చేయమని జూమ్ మీటింగ్‌లో రాష్ట్ర సంక్షేమ కమీషనం చెప్పినందున కార్డుల జారీని ఆపుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ ప్రక్రియను విజయవంతం చేయడం కోసం హెల్ప్ లైన్ నెంబర్‌ని నిర్వహిస్తుంది.సదరు నెంబర్‌ని సంప్రదించగా సీనియర్ సిటిజన్‌కార్డుల జారీ నిలుపుదలకు సంబంధించి తమ దగ్గర ఏ సమాచారం లేదని చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్ర శాఖ అధికారుల నుండి ఎలాంటి వ్రాతపూర్వక ఉత్తర్వులు లేకపోయినా,కనీసం మౌఖిక ఆదేశాలు రాకపోయినా కేవలం జూమ్ మీటింగ్‌లో రాష్ట్రస్థాయి అధికారుల సూచనల ప్రస్తావనతో సీనియర్ సిటిజన్ కార్డుల జారీనిలుపుదల నిస్సందేహంగా వయోవృద్ధుల ప్రయోజనాలకు భంగం కలిగించడంతో పాటు వారిపట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంగామారుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాల జారీతో సీనియర్ సిటిజన్ కార్డుల జారీ కొనసాగింపు లేదా రద్దుపట్లతమవైఖరిని స్పష్టంచేయాల్సిన అవసరం వుంది. ●

# ఎపిలో బిసిల ఆశలు నెరవేరేనా!

కైలసాని శివప్రసాద్

తెలుగుదేశం పార్టీకి, రాష్ట్ర జనాభాలో 52 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతి జాతులవారికి విడదీయరాని అనుబంధం ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. 1982లో ఆవిర్భావం జరిగిన నాటి నుండి నేటివరకు గత 43 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ మనుగడకు, ఉన్నతికి ఉన్న బిసిల పాత్రను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. మా పార్టీ బిసిల పార్టీ అని స్వయంగా తెలుగుదేశం పార్టీ అధిష్టానమే ప్రతినిత్యం చెపుతూ ఉంటుంది. ఈ వ్యాఖ్యలే టిడిపికి బిసిలకు ఉన్న అవినాభావ సంబంధానికి నిదర్శనంగా భావించవచ్చు. ఈ నాలుగన్నర దశాబ్దాలలో తెలుగుదేశం పార్టీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చెక్కు చెదరని రీతిలో పటిష్టంగా రూపుదిద్దుకుంది. పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి నేటివరకు సుమారు 23 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండడం విశేషం. ప్రస్తుతం కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉంది. ఇంకా నాలుగు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీనే అధికారంలో ఉంటుంది. అదేసమయంలో రాష్ట్ర రాజకీయాలతో పాటూ జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి తెలుగుదేశం పార్టీ చేరుకుంది. ఒక సందర్భంలో కొద్ది కాలం పాటూ దేశానికి దశ దిశ నిర్దేశించే పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కూడా తెలుగుదేశం పార్టీ వ్యవహరించడం గొప్ప పరిణామం. జాతీయ స్థాయిలో లోక్‌సభ స్పీకర్, కేంద్రంలో మంత్రి పదవులు లాంటి ఉన్నత పదవులను అనేక పర్యాయాలు తెలుగుదేశం పార్టీ నిర్వహించింది. ప్రధానమంత్రి, రాష్ట్రపతి లాంటి దేశ అత్యున్నత పదవుల నియామకాలలో కూడా తెలుగుదేశం పార్టీ చాలా క్రియాశీలకంగా వ్యవహరించింది. టిడిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలనలో అనుసరించిన సరికొత్త పంథా దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశంలో మొట్టమొదటి పర్యాయం రెండు రూపాయలకు కిలోబియ్యం లాంటి అనేక సంక్షేమ పథకాలు, బిసిలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల కల్పన, మండల వ్యవస్థ ఏర్పాటు, పటేల్ పట్వారీ, రెడ్డి కరణం వ్యవస్థలను రద్దు చేయడం వంటి అనేక పాలనా సంస్కరణలు అమలు చేసి తెలుగుదేశం పార్టీ సంచలనం సృష్టించింది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి సమ పాళ్లలో చేసి పాలనంటే ఇలా ఉండాలని టిడిపి దేశానికి చూపించింది. పాలనలో టిడిపి అనుసరిస్తున్న వైఖరినే దేశంలోని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అనేక విషయాలలో టిడిపి చూపిన దారిలోనే దేశాన్ని ఏలుతున్న పార్టీలు కూడా అనుసరించడం గమనార్హం. అదేవిధంగా పార్టీ వ్యవహారాలలో కూడా తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న నిర్ణయాత్మక నమూనా దేశంలోని జాతీయ రాజకీయ పార్టీలతో పాటూ, ప్రాంతీయ పార్టీలకు




మార్గదర్శకంగా మారిందని కచ్చితంగా చెప్పవచ్చు. తెలుగుదేశం పార్టీ అంతటి ఘనమైన చారిత్రిక నేపథ్యాన్ని పొందింది. కానీ గత నాలుగున్నర దశాబ్దాలుగా టీడీపి జెండా మోస్తున్న వెనుకబడిన తరగతి జాతుల వారి జీవితాలలో మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో మార్పు రాకపోవడం బాధాకరం. నిజం చెప్పాలంటే బిసిల బ్రతుకులు నానాటికీ దిగజారిపోతున్నాయనేది నిర్వివాదాంశం. వెనుకబడిన తరగతి జాతుల వారందరి జీవనాధారం కులవృత్తులు. గత కొద్ది సంవత్సరాలుగా డ్రైవాష్, మెన్స్ బ్యూటీ పార్లర్,ఫ్యాబ్రిక్స్, రెడీమేడ్ డ్రస్‌లు లాంటి పేర్లతో దాదాపు బిసిల కుల వృత్తులన్నింటిలోకి కార్పొరేట్ సంస్థలతో పాటూ ఇతర పెట్టుబడిదారులు ప్రవేశించారు.దీంతో బిసిల బ్రతుకులు ఆగమ్యగోచరంగా తయారయ్యాయి. ఈదుర్భర పరిస్థితుల దృష్ట్యా నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి బిసిలు తమ బ్రతుకులు బాగు చేస్తాయని, ప్రభుత్వాలపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు.ముఖ్యంగా 2014-19 మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన నారా చంద్రబాబు నాయుడిపై అధికంగా ఆశలు పెట్టుకొన్నారు. 2014 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేతగా నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన బిసి డిక్లరేషన్ కూడా దానికి ఒక ప్రధాన కారణంగా తెలుస్తోంది. కానీ ఆ సమయంలో వారి ఆశలు అడియాశలు అయ్యాయి.2019-24 మధ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన జగన్ మోహన్‌రెడ్డి బిసి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడంతో బిసిల నోట్లో వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. దీంతో అప్పటి వరకు ప్రభుత్వం నుండి అందుతున్న అరకొర సాయం కూడా బిసిలకు అందకుండా పోయింది. 2024లో నారా చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో బిసిల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ సర్కార్‌కు సారథ్యం వహిస్తున్నందువలన ఈ పర్యాయం తమ ఆశలు కచ్చితంగా నెరవేర్చి తమ జీవితాలలో వెలుగులు నింపుతారని బిసిలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మునుపటి కంటే ఎక్కువగా ఆశలు పెట్టుకోవడం గమనార్హం. బిసిలు చంద్రబాబు నాయుడుని కొత్త కోర్కెలు, గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. గతంలో ప్రకటించిన బిసి డిక్లరేషన్‌లో తెలుగుదేశం పార్టీ పొందుపరచిన హామీలు నెరవేర్చి తమను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి పరచమని బిసిలు కోరుతున్నారు. 2014 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బిసి డిక్లరేషన్ ద్వారా బిసి లకు ప్రతి సంవత్సరం 10 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించడం, చేనేతలకు ప్రత్యేకంగా సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయలు బడ్జెట్‌లో పెట్టడం, ఉద్యోగుల ప్రమోషన్లలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించడం, కాంట్రాక్టులలో బిసిలకు వాటా కల్పించడం, అన్నిరకాల నామినేటెడ్ పోస్టులలో 33 శాతం కేటాయించడం, స్థానిక సంస్థలలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను బిసి జనాభా ధామాషా ప్రకారం పెంచడం, ప్రతిసాధారణ ఎన్నికలలో 100శాసనసభా స్థానాలు కేటాయించడం, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక బడ్జెట్‌కొరకు, ప్రత్యేక బిసి మంత్రిత్వశాఖ ఏర్పాటుకు, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడం కొరకు కృషి చేయడం వంటి ప్రధాన హామీలతో పాటూ ఇతర సంక్షేమ హామీలు అనేకం ఇవ్వడం జరిగినది. ఈ హామీలు అన్నీ నిజంగా నెరవేరిస్తే బిసిల జీవితాలలో వెలుగులు వస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ●

# ఉత్తరాదిని ఊపేస్తున్న భారీ వర్షాలు



## హిమాచల్‌లో ఇప్పటివరకూ 170 మంది మృతి

## 301 రహదారుల్లో రాకపోకలు నిలిపివేత

## రాజస్థాన్, ఢిల్లీల్లోను కుంభవృష్టి

**సిమ్లా,జూలై 31:** ఉత్తరాది రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్‌లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లో భారీ వర్షాల కారణంగా భారీ సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించింది. కొండచరియలు విరిగిపడటం వల్ల పలు రహదారులను బ్లాక్ చేశారు. అలాగే మరో రెండు రోజులపాటు భారీవర్షాలు కరిసే అవకాశముందని భారతవాతావరణశాఖ అంచనా వేసింది. హిమాచల్ ప్రదేశ్ అత్యవసర విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపిన వివరాలు ప్రకారం జులై 31 ఉదయం 10గంటలకు నాటికి మొత్తం 301 రహదారులు ఇప్పటికే బ్లాక్ చేశారు. 436 విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. 254 నీటి సరఫరా పథకాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇక జూన్ 20న మొదలైన వర్షాల కారణంగా 170మంది మరణించారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్, విద్యుదాఘాతం వంటి ఘటనల కారణంగా 94 మంది మరణించారు. రోడ్డు ప్రమాదాల్లో 76 మంది మృతి చెందినట్లు రాష్ట్ర విపత్తు కేంద్రం తెలిపింది. వర్షాల కారణంగా 400కు పైగా ఇళ్లు, 1,627 గోశాలలు, రోడ్లు, విద్యుత్ లైన్లు, నీటి వ్యవస్థలతోసహా ప్రభుత్వ ఆస్తులు గణనీయంగా దెబ్బతిన్నాయి. 2,743 హెక్టార్ల పంటలు నాశనమయ్యాయి. 680 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 22,900 పశువులు మృతి చెందినట్లు రాష్ట్ర విపత్తు కేంద్రం పేర్కొంది. అలాగే కొండచరియలు విరిగిపడటం, వరదలకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైతే తప్ప ప్రయామాలు చేయొద్దని రాష్ట్ర విపత్తు కేంద్రం సూచించింది. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, వర్షాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని సూచించిందిపేర్కొంది. ఇక రాజస్థాన్‌లో వచ్చే 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ముఖ్యంగా అజ్మీర్, జయ్‌పుర్, బీకనేర్, జోధ్‌పూర్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కోటా, ఉదయపుర్, భరత్‌పుర్ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల మోస్తరునుంచి భారీవర్షం కురవొచ్చని తెలిపింది. ఆగస్టు 1న భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆగస్టు 2 నుంచి తేలిపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. రానున్న 24గంటల్లో తూర్పు రాజస్థాన్ లోని కొన్ని ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని సూచించి. రాజస్థాన్‌లోని ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రటించింది. దీంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు అధికారులు. కొన్ని ప్రాంతాల్లో ఆగస్టు 2వరకు సెలవులు ప్రకటించారు. రాజస్థాన్‌లో జూన్ 15 నుంచి ఇప్పటి వరకు 80మంది మరణించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గడచిన కొన్ని రోజులగా దేశరాజధాని దిల్లీలో కూడా వర్షాలు కురుస్తున్నాయి. అయితే గురువారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. రోజంతా తేలికపాటి జల్లులతో ఉంటుందని అంచనా వేసింది.

### ట్రంప్ నిజం చెప్పినా

# తీరుమారని మోడీ

### లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,జూలై 31:** భారత ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీగా మారిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. భారత్ డెడ్ ఎకానమీ అని ప్రపంచంలో ప్రతి ఒక్కరికి తెలిసిపోయిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి మినహా ప్రతి ఒక్కరికి ఈ విషయం తెలుసని ఎద్దేవా చేశారు. కేవలం ఒక అదానీకి సాయం చేసేందుకు భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని బిజెపిపై మండిపడ్డారు. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరితే ట్రంప్ చెప్పినట్లే మోడీ చేస్తారు. మన ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా ధ్వంసంచేస్తుంది. దేశాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారు. నేనే కాల్పుల విరమణ చేశానని ట్రంప్ దాదాపు ముప్పయి 32 సార్లు చెప్పారు. దీంతో పాటు 5 ఇండియన్ జెట్లు కూడా కూలాయని అన్నారు. ఇప్పుడు వచ్చి ఏకంగా 25శాతం సుంకాలు వేస్తున్నానని ప్రకటించారు. వీటన్నింటికి ప్రధాని మోడీ సమాధానం చెప్పలేకపోతున్నారు, ఎవరి చెప్పుచేతల్లో ఆయన ఉన్నట్లని విపక్ష నేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. విదేశాంగ మంత్రి పార్లమెంట్‌లో మాట్లాడుతూ మనకు అద్భుతమైన విదేశాంగ విధానం ఉందని చెప్పారు. ఒకవైపు అమెరికా దూషిస్తుంది. మరో వైపు చైనా మనవెనుకపడుతుంది. మీరు ప్రపంచ వ్యాప్తంగా అఖిలపక్ష బృందాలను పంపినా ఒక్క దేశం కూడా పాకిస్థాన్ వైఖరిని ఖండించలేదు. ప్రధాని మెడీ తన ప్రసంగంలో ఎక్కడా ట్రంప్, చైనా పేరు ఎత్తలేదు. పహల్గాం ఉగ్రదాడికి కారణమైన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి భోజనం చేసి భారీ విజయాన్ని సాధించామని అంటున్నారని రాహుల్ మండిపడ్డారు.

## భారత్-రష్యా బంధం.. 'ఐ డోంట్ కేర్'

### డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్, జూలై 31:** భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయడమే అందుకు కారణమని కూడా తెలిపారు. తాజాగా రష్యా, భారత్‌లను ఉద్దేశిస్తూ ఆయన మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ట్రూత్ సోషల్‌లో ఆయన ఓ పోస్టు పెట్టారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తనకు సంబంధం లేదన్నారు. వారి ఆర్థిక వ్యవస్థను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీతో చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నామన్నారు. ఎందుకంటే భారత్ అత్యధికంగా సుంకాలు విధిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రష్యా, యుఎస్‌లు కలిసి ఎలాంటి వ్యాపారం చేయట్లేదని ట్రంప్ స్పష్టం చేశారు. తర్వాత ఆ దేశ మాజీ అధ్యక్షుడు దిమిత్రి మద్వెదేవ్‌పై విరుచుకుపడ్డారు. తమతో వాషింగ్టన్ గేమ్ ఆడుతుందని, అది యుద్ధానికి దారి తీయొచ్చని దిమిత్రి హెచ్చరించడంపై ట్రంప్ స్పందిస్తూ.. ఆయన ఇంకా అధ్యక్షుడిననే అనుకుంటున్నారని విమర్శించారు. ఆయనప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని హెచ్చరించారు. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారీగా సుంకాలు విధిస్తాయని భారత్‌తోపాటు పలు దేశాలను ఇటీవల పలుమార్లు అమెరికా హెచ్చరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఇదే కారణాన్ని చూపుతూ.. భారత దిగుమతులపై 25 శాతం సుంకంతోపాటు, పెనాల్టీలుకూడా విధించారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూఢిల్లీ ఒకటని ఆరోపించారు. ఆగస్టు 1నుంచి ఈనిర్ణయం అమలులోకి వస్తుందన్నారు. రష్యా నుంచి దిగుమతుల కారణంగా యుఎస్ పెనాల్టీలకు గురైన తొలి దేశం భారత్. ఈ సుంకాలపై భారత్ స్పందిస్తూ.. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంది.



## బిజెపితో ఒపిఎస్ తెగతెంపులు

### స్టాలిన్‌తో మార్నింగ్‌వాక్ .. వెనువెంటనే తన నిర్ణయం వెల్లడి

**చెన్నై,జూలై 31:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, అన్నాడిఎంకే బహిష్కృత నేత ఒపిఎస్‌గా పిలుచుకునే ఓ పన్నీర్ సెల్వం ఎన్డీయేతో తెగదెంపులు చేసుకున్నట్టు గురువారం ప్రకటించారు. గతేడాది పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఒపిఎస్ బిజెపి నాయకత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరిన విషయం తెలిసిందే. అయితే, తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌తో మార్నింగ్ వాక్ సందర్భంగా సమావేశమైన కొద్ది గంటల్లోనే పన్నీర్ సెల్వం ఈ ప్రకటన చేయడం గమనార్హం. అదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ పరిణామం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొద్దిరోజుల నుంచి కేంద్ర ప్రభుత్వంపై పన్నీర్‌సెల్వం తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడుకు 'సమగ్ర శిక్షాభియాన్' నిధులను విడుదల చేయకపోవడంపై ఆయన మండి పడ్డారు. విద్యార్థులు, ఉపాధ్యాయులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఒపిఎస్ ఆగ్రహంవ్యక్తం చేశారు. కాగా, 2022లోనే అన్నా డిఎంకే నుంచి పన్నీర్ సెల్వంను బహిష్కరించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు ఎన్నికల్లో అధికార డిఎంకే, నటుడు విజయం కొత్త పార్టీ టివికే, బిజెపి అన్నాడిఎంకే కూటమిమధ్య త్రిముఖ పోరు తప్పదని భావిస్తున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ పెట్టిన విజయ్‌కు ఇవే తొలి ఎన్నికలు.

## ఐర్లాండ్‌లో మరో జాత్యహంకార దాడి

**డబ్లిన్,జూలై 31:** ఐర్లాండ్‌లో జాత్యహంకార దాడి ఘటన చోటుచేసుకుంది. డబ్లిన్‌లో భారత్‌కు చెందిన ఓ వ్యక్తిపై అక్కడి కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. సంతోశ్ యాదవ్ అనే వ్యక్తి లెట్టర్‌కెన్ని సిటీలో ఉన్న విసార్ ల్యాబ్ అండ్ టెక్నాలజీ కంపెనీలో సీనియర్ డేటా అనలిస్టుగా పనిచేస్తున్నాడు. తనపై జరిగిన దాడిగురించి ఆయన తన లింక్డిన్ ప్రొఫైల్‌లో పోస్టు చేశారు. తల, ముఖం, మెడ, ఛాతి, చేతులు, కాళ్లపై యువకులు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఈ ఘటనపై ఆయన సుదీర్ఘమైన పోస్టు చేశారు. భారతీయ సంతతి వ్యక్తులపై ఐర్లాండ్‌లో దాడులు పెరుగుతున్నట్లు అతను పేర్కొన్నారు.

డిన్నర్ చేసిన తర్వాత తన అపార్ట్‌మెంట్ వద్ద వాకింగ్ చేస్తున్న సమయంలో ఆరుగురు వ్యక్తులు అటాక్ చేసినట్లు సంతోశ్ యాదవ్ తెలిపారు. తన కంటి అద్దాలను తీసివేసి.. నిర్దాక్షిణ్యంగా తల, మెడపై దాడి చేశారన్నారు. రోడ్డుపైనే రక్తం కారుతున్న దశలో తనను వదిలేయడంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశానని, వాళ్లు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. తన దవడ ఎముక విరిగినట్లు మెడికల్ బృందం పేర్కొన్నట్లు తన పోస్టులో తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఇదే కోవలో డబ్లిన్‌లోనే ఓ భారతీయుడిపై దాడి జరిగింది. చిన్న పిల్లలతో అనుచితంగా ప్రవర్తించాడనే నెపంతో ఒక గుంపు భారత వ్యక్తిపై దాడికి పాల్పడింది. ఈ ఘటన జరిగిన వారం తర్వాత మళ్లీ ఇప్పుడు మరో జాత్యహంకార దాడి వెలుగులోకి వచ్చింది.

# పహల్గాం ఉగ్రదాడి లష్కరే తోయిబా పనే!

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ,జూలై 31:** పహల్గాం ఉగ్రదాడిలో లష్కరే తోయిబా హస్తం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఆపరేషన్ మహదేవ్ చేపట్టి అంతం చేసిన ముగ్గురు ఉగ్రవాదులు ఆ ఉగ్రసంస్థకు చెందినవారేనని స్పష్టం చేశారు. వాస్తవానికి పహల్గాం దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల తలపై కాల్చి చంపాలని ప్రజలు కోరుకున్నారని, యాదృచ్ఛికంగా ఆ ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు తలపైనే గురిచూసి కాల్చాయని ఆయన రాజ్యసభలో చెప్పారు. మహిళలు, పిల్లల ముందు మతం అడిగి మరీ చంపేశారని, ఇంత అనాగరిక నేరం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదని అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే రాజకీయాలే ముఖ్యమైపోయాని అమిత్ షా విమర్శలు గుప్పించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్ సంతృప్తి పడుతోందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాక్‌ఆక్రమిత కాశ్మీర్‌లను పాకిస్థాన్‌కు ఇచ్చేసిందని, కానీ బీజేపీ దానిని తిరిగి భారత్‌లో చేరుస్తుందని అమిత్‌షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల వల్లే ఉగ్రవాదం వృద్ధి చెందిందని ఆయన విమర్శించారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఉంటే, ఉగ్రవాదులపై చర్య తీసుకునే బదులు పత్రాలను పంపి ఉండేదని ఆయన ఆరోపించారు. భారత్‌లో ఉగ్రవాదం పూర్తిగా అంతరించే దిశలో ఉందని, అది కచ్చితంగా అంతం అవుతుందని అమిత్‌షా అన్నారు. హిందువులు ఎప్పటికీ ఉగ్రవాదులు కాలేరని, ఈ విషయాన్ని ప్రపంచానికి గర్వంగా ప్రకటిస్తున్నానని తెలిపారు. మరోవైపు అమిత్‌షా మాట్లాడడం ప్రారంభించగానే ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేశాయి. ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కానీ సభాధ్యక్షులు విపక్షాల డిమాండ్‌ను అంగీకరించలేదు. దీంతో వారు వాకౌట్‌చేశారు. అమిత్‌షా ప్రసంగాన్ని కొనసాగిస్తూ, కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర హోంమంత్రి చిదంబరంపై విమర్శలు గుప్పించారు. చిదంబరం నా రాజీనామా కోరారు. పహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందినవారని రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఆపరేషన్ సిందూర్ సమర్థతను కూడా చిదంబరం సవాల్ చేశారు. అంటే కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కన్నా రాజకీయాలు ముఖ్యం. అది ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయింది. కాంగ్రెస్ మనస్తత్వాన్ని చిదంబరం ప్రపంచానికి బహిర్గతం చేశారు. ఓటు బ్యాంకు కోసం వారు పాకిస్థాన్, లష్కరే తోయిబాతో సహా ఉగ్రవాదులు అందరికీ మద్దతు ఇస్తారని అమిత్‌షా విమర్శలతో ధ్వజమెత్తారు. శివాజీ మహారాజ్ మొఘలులపై పోరాడినప్పుడు, ఆయన యుద్ధ నినాదం హరహర మహాదేవ్. వాస్తవానికి భారతీయ సైనికులు వివిధ యుద్ధ నినాదాలు మతాలపై ఆధారపడి ఉంటాయి. అయితే వాటికి హిందూ, ముస్లింలతో సంబంధంలేదు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు మన సిఆర్‌పిఎఫ్, సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు చాలా కృషి చేశారు. కష్టతరమైన భూభాగంలో ఉంటూ, డ్రోన్‌ల ద్వారా పంపే ఆహారాన్ని తిన్నారు. ఇలా ఉగ్రవాదులను వెంబడించి వారికి తుదముట్టించారని రాజ్యసభలో హోంమంత్రి వివరించారు.

## మాలేగాం పేలుళ్లకేసులో ఏడుగురు నిందితులు నిర్దోషులే

### ముంబయి ఎన్ఐఎ కోర్టు తీర్పు

**ముంబయి,జూలై 31:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో ముంబయిలోని ఎన్ఐఎ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు నిందితులను నిర్దోషులుగా తేల్చింది. మాజీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞా సింగ్ సహ మిగిలిన నిందితులు నేరం చేశారని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లేవని వెల్లడించింది. మాలేగావ్‌లో బైకులోనే బాంబు పెట్టినట్లు ఎన్ఐఎ నిరూపించలేక పోయిందని కోర్టు పేర్కొంది.

మాజీ సాధ్వి ప్రజ్ఞాసింగ్‌కు సొంత బైకు ఉన్నట్లు ఆధారాల్లేవని న్యాయస్థానం పేర్కొంది. మరో నిందితుడు కర్నల్ ప్రసాద్ పురోహిత్ ఇంట్లో ఆర్డీఎక్స్ ఉన్నట్లు ఆధారాల్లే వని వివరించింది. ఘటనాస్థలం నుంచి వేలి ముద్రలు, డిఎన్ఎ నమూనాలను సేకరించలేదని తెలిపింది. నిందితుల మధ్య సమావేశాలు జరిగినట్లు, కుట్ర పన్నినట్లు దర్యాప్తు సంస్థ నిరూపించలేక పోయిందని పేర్కొంది. ఈ కేసులో తీవ్రవాద నిరోధక చట్టం చేర్చడానికి వీల్లేదని, అది చెల్లదని తీర్పులో స్పష్టంచేసింది. 2008 సెప్టెంబర్ 29న మాలేగావ్‌లో మసీదు వద్ద పార్క్ చేసిన బైకులో బాంబు పేలి ఆరుగురు దుర్మరణం చెందారు. 100 మందికిపైగా గాయ పడ్డారు. ఈ కేసులో బిజెపి నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, రిటైర్డ్ మేజర్ రమేష్ ఉపాధ్యాయ, అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి నిందితులుగాఉన్నారు.

17 సంవత్సరాల తర్వాత ఈ కేసులో తీర్పు వెలువరించిన ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు నిందితులు అందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో 2018లో ప్రారంభమైనవిచారణ 2025 ఏప్రిల్ 19న ముగియగా, ఆ రోజే తీర్పును రిజర్వుచేసిన న్యాయస్థానం గురువారం వెలువరించింది.

ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐఎ, నిందితులకు తగినశిక్ష విధించాలని వాదించింది. ముస్లిం జనాభా గణనీయంగాఉన్న మాలేగావ్‌లో ఈ పేలుడు ద్వారా ముస్లిం సమాజంలోని ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించారని ఎన్ఐఎ ఆరోపించింది. మతపరమైన ఇందుకు కచ్చితమైనా, నిరూపించదగిన ఆధారాలు ఉన్నట్లు ఎన్ఐఎ వాదించింది. నిందితులు కుట్రలో నేరుగా పాల్గొన్నారని తెలిపింది. రంజాన్ మాసంలో, నవరాత్రికి ముందు పేలుడు జరపడం ద్వారా ముస్లిం సమాజంలోని మతకలహాల భయం సృష్టించాలనే ఉద్దేశంతోనే నిందితులు ఈ చర్యకు పాల్పడినట్లు ఎన్ఐఎ తెలిపింది.



# చైనాలో మెరుపు వరదలు

## కొట్టుకుపోయిన రూ. 12 కోట్ల బంగారం

## వెతుకులాటకు వీధుల్లో ఎగబడిన స్థానిక జనం!



**బీజింగ్, జూలై 31:** చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీ పడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీలో జూలై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్ర తీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకువచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి.

అయితే ఆ వరదల్లో కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతోపాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 12 కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు.

బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కిలో బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన విడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# సంక్షిప్తంగా..

### డెల్టా విమానంలో కుదుపులు.. అత్యవసర ల్యాండింగ్

**వాషింగ్టన్, జూలై 31:** డెల్టా ఎయిర్‌లైన్‌కు చెందిన విమానం కుదుపులకు లోనైంది. దీంతో ఈ విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. అసలేం జరిగిదంటే.. బుధవారం డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన డిఎల్56 విమానం సాల్ట్ లేక్ సిటీ నుంచి ఆమ్‌స్టర్‌డామ్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో విమానాన్ని మినియాపొలిస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో 25 మందికిపైగా ప్రయాణికులకు గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే వైద్య సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందించారు. ఈ ఘటన సమయంలో విమానంలో 275 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. డెల్టా ఎయిర్‌లైన్స్ కూడా దీన్ని ధ్రువీకరించింది. అయితే ఈ కుదుపులకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపింది.

### అండమాన్, నికోబార్‌లోని పోర్ట్‌బ్లెయిర్‌లో ఇడి దాడులు!

**న్యూఢిల్లీ, జులై 31:** ఓ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఇడి తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఓ సహకారబ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపి కుల్దీప్‌రాయ్‌శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు పోర్ట్‌బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు.

### రూ. 800 కోట్ల భూమి కబ్జా: కర్ణాటక లోకాయుక్తకు ఫిర్యాదు

**బెంగళూరు, జూలై 31:** కర్ణాటక రాజధాని బెంగళూరులో రూ. 800 కోట్ల విలువైన 108 ఎకరాల భూమిని కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌సి బాలకృష్ణ కబ్జా చేశారని బిజెపి నేత ఎన్ఆర్ రమేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సన్నిహితుడు యశ్వంత్‌పూర్ ఎమ్మెల్యే ఎస్‌టి సోమశేఖర్, పలువురు ప్రభుత్వ అధికారులకు ఈ కబ్జాలో హస్తం ఉందని రమేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రమేశ్ లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు ప్రకారం.. బెంగళూరు సౌత్ తాలూకాలోని తవరకేరె హొబ్లిలోని సర్వే నంబర్లు 233, 234, 235, 236లలో గల 108 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. అందులో రూ. 165 కోట్ల విలువ చేసే 26 ఎకరాల భూమిలో ఇప్పటికే నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కెంగెరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఈ యేడాది ఏప్రిల్ 3న ఈ రిజిస్ట్రేషన్ జరిగింది. యశ్వంత్‌పూర్ నియోజకవర్గం కురుబరహల్లి గ్రామంలోని 158 సర్వే నంబర్‌లో మరికొంత భూమి కబ్జాకు గురైంది. మొత్తం 130.29 ఎకరాల ఈ భూమి విలువ రూ. 800 కోట్లు ఉంటుంది. అంటే అక్కడ ఒక్కో ఎకరా రూ. 6 కోట్ల చొప్పున పలుకుతోంది.

### చీటింగ్‌కేసులో తమిళనటుడు అరెస్టు!



**చెన్నై,జూలై 31:** తమిళ నటుడు ఎస్. శ్రీనివాసన్‌ను ఒక భారీ మోసం కేసులో ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.1000 కోట్ల లోన్ ఇప్పిస్తానని చెప్పి ఒక సంస్థ నుంచి రూ. 5 కోట్లు తీసుకుని మోసం చేసినట్లు ఆరోపణలు రావడంతో అతడిని బుధవారం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2010లో ఓ సంస్థకు రూ.1000 కోట్లు రుణం ఇప్పిస్తానని శ్రీనివాసన్ హామీ ఇచ్చారు. దీనికి బదులుగా వారి వద్ద నుంచి రూ.5 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. నెల రోజుల్లో లోన్ వస్తుందని రాకపోతే డబ్బులు తిరిగి ఇస్తానని హామీ ఇచ్చారు. అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బును వ్యక్తిగత అవసరాల కోసంతో పాటు సినిమాల నిర్మాణానికి ఉపయోగించినట్లు సమాచారం. అయితే, నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో మోసపోయామని గుర్తించిన సంస్థ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. దీంతో ఢిల్లీ పోలీసులు శ్రీనివాసన్‌ను చెన్నైలో అరెస్టు చేశారు. ఇక, 2010లో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన శ్రీనివాసన్ ఇప్పటివరకు 60కి పైగా చిత్రాల్లో నటించారు.

## దసరా ఉత్సవాల విజయవంతానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం: కలెక్టర్ లక్ష్మీశ


సమన్వయ శాఖల అధికారుల సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,జూలై 31,ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంద్రకీలాద్రిపై గతేడాది దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు విజయవంతాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరింత మిన్నగా సామాన్య భక్తులకు తొలి ప్రాధాన్యతనిస్తూ ప్రణాళిక ప్రకారం భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి సాంకేతికత, ఏఐ టూల్స్ అనుసంధానంతో భక్తులకు మధురానుభూతి కలిగించేలా ఈ ఏడాది దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబులు తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజులపాటు జరగనున్న దసరా ఉత్సవాలపై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఆలయ ఈవో వీకే శీనానాయక్ తదితరులు హాజరైన సమావేశంలో రెవెన్యూ, దేవాదాయ, పోలీస్, వీఎంసీ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, విద్యుత్, రవాణా, ఆర్ అండ్ బీ, సమాచార, పౌర సంబంధాలు తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, అమ్మవారి అలంకరణలు, భక్తుల క్యూలైన్లు, బ్యారికేడింగ్, ఆన్‌లైన్, కరెంట్ బుకింగ్ కౌంటర్లు, పార్కింగ్, మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఘాట్ల వద్ద షవర్ ఏర్పాట్లు, భద్రతా వ్యవస్థ, ప్రసాదాల తయారీ, పంపిణీ, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, వైద్య శిబిరాలు, పాస్‌ల జారీ, సూచిక బోర్డుల ఏర్పాటు తదితరాలపై చర్చించి.. గత జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ ఏటా దసరా ఉత్సవాలకు విజయవాడ వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోందని.. ఈ ఏడాది రోజుకు దాదాపు లక్ష మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశముందని.. ఆదేవిధంగా మూలా నక్షత్రం రోజున దాదాపు 1,50,000 నుంచి రెండు లక్షల వరకు భక్తులు రావొచ్చన్నారు. రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని.. ఎంత మంది నగరానికి వచ్చినా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

## కరవు పరిస్థితులు కనిపిస్తున్నా పాలకులు స్పందించరా..


వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, జూలై 31 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో కరువు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నా జిల్లాలోని మంత్రులు, ప్రజా ప్రతినిధులు రైతాంగాన్ని ఆదుకునే దిశగా ప్రయత్నం చేయరా అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. ఖరీఫ్ ప్రారంభంలో అరకొరగా వర్షాలు కురిస్తే వేరుశనగ, పత్తి, ఆముదం, కంది వంటి పంటలు సాగు చేస్తే వర్షాలు రాకపోవడంతో పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడి గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. సాధారణ సాగు విస్తీర్ణం జిల్లాలో 15 లక్షలు ఎకరాలు కాగా ఇప్పటి వరకు 3.9 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేసిని పరిస్థితి కనిపిస్తోం దన్నారు.

## ఎస్ఆర్ పురంలో డెయిరీ రీజినల్ మేనేజర్ అనుమానాస్పద మృతి

**శ్రీరంగరాజపురం, జులై 31 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలంలో ఓ ప్రైవేటు డైరీలో రీజినల్ డైరీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించే కొండల్‌గౌడ్(35) గురువారం తెల్లవారుజాము ఎస్ఆర్ పురం మండలం ఎస్ఆర్ పురం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహమై కన్పించాడు. ఈ వ్యవసాయ బావిలో కొండల్ గౌడ్‌ను ఎవరైనా హత్య చేసి తోసివేశారా! లేక అతనే ప్రమాదవశాత్తు జారి పడి బావిలో మృతి చెందాడా! అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలు ఇలా వున్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మహబూబ్‌నగర్ మండలం సంగమ్మపల్లి గ్రామంకు చెందిన జగయ్య కుమారుడు కొండల్‌గౌడ్ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం మండలం కొల్లాగుంట గ్రామంలో నివాసం వుంటూ పాలసముద్రం మండలంలోని ఓ ప్రైవేటు డైరీలో రీజినల్ డైరీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొండల్‌గౌడ్ మంగళవారం రాత్రి ఎస్ఆర్ పురం మండలం పెద్దకొండపల్లి వద్ద వున్న డైరీ సెంటర్‌లో తన విధులు నిర్వర్తించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో అంకనపల్లి గ్రామం సమీపంలో వున్న ఓ వ్యవసాయ బావిలో పడినట్లు తెలుస్తోంది.

## ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

**విజయవాడ,జూలై 31,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద కవరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నుంచి బ్యారేజీకి వస్తోన్న వరద నీరు 2 లక్షల 65 వేల క్యూసెక్కులుగా ఉంది. పులిచింతల నుంచి దిగువకు నీరు వస్తుండటంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద తీవ్రత పెరుగుతుందికృష్ణా తూర్పు ప్రధాన కాలువ, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ, గుంటూరు ఛానల్లతోపాటు బ్యారేజీ దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీలోని 70 గేట్లు తెరిచి 10 గేట్లను 5 అడుగుల మేర, 60 గేట్లను 6 అడుగుల మేర ఎత్తి నీటిని వదులుతున్నారు. కృష్ణా నదీ పరీవాహక ప్రాంత ప్రజలు, లంకగ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టరు జి. లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం చినలంక, ఫెర్రీ ఘాట్ ప్రాంతాల్లో కలెక్టరు లక్ష్మీశపర్యటించారు. ఎగువన నాగార్జునసాగర్ నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టు నిండు కుండలా మారింది. 41.58 టీఎంసీల నీరు చేరడంతో 12 గేట్లను మూడు అడుగులకు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువనున్న ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 3,01,167 క్యూసెక్కులు ఉంది. గంట గంటకూ సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతోందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. భారీగా వరద వస్తుండటంతో ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 94,679 క్యూసెక్కులు ఉందని, ఇది 3 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉంది.

## అత్యధిక కాలం ప్రధానిగా సేవలు అందించిన నేతగా మోడీ

### నిబద్ధతతో పని చేసినందుకే మాధవ్‌కు రాష్ట్ర అధ్యక్ష హోదా: మంత్రి సత్య కుమార్


శోభాయాత్రలో పాల్గొన్న మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు

**పుట్టపర్తి టౌన్, జూలై 31,ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి లో జరిగిన శోభాయాత్ర మరియు విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ఉత్సాహంగా జరిగింది. గురువారం జిల్లా అధ్యక్షుడు జివిఎం శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పట్టణంలోని విద్యాగిరి నుండి ఆర్.వి.జే. కళ్యాణ మండపం వరకు జరిగిన శోభాయాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం జరిగిన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత నరేంద్ర మోడీ మొదటి స్థానంలో ఉన్నారన్నారు. మోదీ నాయకత్వంలో భారతదేశ పటం పై తన గుర్తింపు మరింత బలంగా చాటిందన్నారు. ఇది ప్రతి దేశ పౌరునికి గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. నిబద్ధతతో పని చేసినందుకే రాష్ట్ర అధ్యక్షుడిగా పివిఎన్ మాధవ్‌కి అవకాశం దక్కిందన్నారు. ఆయనకు నిబద్ధత అహంభావం లేని ఆచరణ కార్యకర్త స్థాయిలో మొదలై విశ్వాస ప్రయాణం ఫలితమేనన్నారు.

## పరిశ్రమదారుల్లో విశ్వాసాన్ని నింపడంలో విజయవంతమైన మంత్రి లోకేష్

### - సింగపూర్ టూర్ సక్సెస్‌తో స్వదేశానికి బయలుదేరిన యువనేత


పర్యటన అనంతరం లోకేష్‌కు వీడ్కోలు పలుకుతున్న ఏపి ఎన్ఆర్‌టి చైర్మన్ రవి.వేమూరి


**సచివాలయం,జూలై 31,ప్రభాతవార్త :** రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి రాష్ట్ర విద ,ఐటి,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన సింగపూర్ పర్యటన విజయవంతమైంది. 4రోజుల పర్యటన ముగించుకొని గురువారం ఉదయం స్వరాష్ట్రానికి బయలుదేరిన మంత్రి లోకేష్‌కు అక్కడి తెలుగు ప్రవాస భారతీయులు,ఏపి ఎన్ఆర్‌టి చైర్మన్ రవి.వేమూరి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కనీవిని ఎరుగని రీతిలో సింగపూర్ ప్రభుత్వ పెద్దలు,పారిశ్రామికవేత్తల నుంచి లభించిన స్పందన ఏపి బ్రాండ్ ఇమేజ్‌ను ఇనుమడింపచేసింది. ఈ పర్యటనలో సీఎంతో కొన్ని,విడిగా మరికొన్ని కార్యక్రమాల్లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. పారిశ్రామికవేత్తలతో వన్ టు వన్ చర్చలు 19,జి టు జి (గవర్నమెంట్ టు గవర న్మెంట్) సమావేశాలు 6,4, రౌంట్ టేబుల్ సమావేశాలు, 4సైట్ విజిట్లు,రోడ్ షో/ దయాస్పోరా ఈవెంట్స్ 2 కలిపి మొత్తం 35కార్యక్రమాలకు లోకేష్ హాజరయ్యారు.

## సమాచార శాఖ పబ్లిసిటీ అసిస్టెంట్ చోరగుడి జాక్సన్ బాబు పదవీ విరమణ

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** సమాచార శాఖ పబ్లిసిటీ అసిస్టెంట్ చోరగుడి జాక్సన్ బాబు పదవి విరమణ చేసారు. రాష్ట్ర సమాచార కేంద్రం, విజయవాడలో పబ్లిసిటీ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదవి విరమణ చేసిన చోరగుడి జాక్సన్ బాబు యొక్క వీడ్కోలు సమావేశాన్ని రాష్ట్ర సమచార , పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. 30 సంవత్సరాలు విధిగా తన భాద్యతలను నిర్వర్తిస్తూ తనదైన శైలిలో సేవలు అందించిన చోరగుడి జాక్సన్ బాబుకు పదవి విరమణ శుభాకాంక్షలను తెలియజేస్తూ తను సేవలకు గుర్తుగా సమాచార శాఖ ఉద్యోగులంతా కలిసి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సమచార పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ .స్వర్ణలత మాట్లాడుతూ, జాక్సన్ బాబు దాదాపు 30 సంవత్సరాల పాటు నిర్విరామంగా పుబ్లిసిటీ అసిస్టెంట్ గా సేవలు అందించారని, ఉద్యోగ రిత్యా ఎన్నో రోజులు కుటుంబానికి దూరంగా ఉండాల్సి వచ్చిన సందర్భంలో కూడా సంయమనం కోల్పోకుండా భాద్యతలు నిర్వర్తించారని తెలియజేస్తూ పదివి విరమణ చేపడుతున్న జాక్సన్ బాబుకి శుభాకాంక్షలు తెలిపారు.
రాష్ట్ర సమచార,పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ జాక్సన్ బాబుకు పదవి విరమణ శుభాకాంక్షలను తెలియచేసారు.

## జగన్ లాంటి వ్యక్తిని ప్రజలు దూరంగా పెట్టాలి

### - ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, జూలై 31, ప్రభాతవార్త** గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఫ్రస్టేషన్ ఎక్కువై అనవసర మాటలు మాట్లాడుతున్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పక్కన వాళ్లు చెప్పింది వింటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. రూరల్ నియోజకవర్గం బుజబుజ నెల్లూరులో గురువారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి 61 లక్షల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో 61 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎక్కడి నుంచైనా నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని కోటంరెడ్డి సోదరులను అభినందించారు. అన్నకు తోడుగా గిరిధర్‌రెడ్డి ప్రజల సమస్యలను పరిష్కరించేలా పనిచేస్తున్నారని కొనియాడారు. నెల్లూరుకు వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి అనవసరంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఈ ఐదేళ్ల కాలంలో ఏ గ్రామానికైనా జగన్‌మోహన్ రెడ్డి తిరిగారా అని ప్రశ్నించారు. ఏ ఒక్క మంచి పని చేయలేదని, బూతులు మాట్లాడే వారినే లీడర్లుగా తన పక్కన పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. ఇలాంటి వ్యక్తిని ప్రజలు దూరంగా పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### మద్యం కుంభకోణం కేసులో సీజ్ చేసిన నగదును బ్యాంకులో డిపాజిట్ చేయండి - సీట్‌కు విజయవాడ ఎసిబి కోర్టు ఆదేశం

**విజయవాడ, జులై 31,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నగదు సీజ్ వ్యవహారంపై ఏసీబీ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సీజ్ చేసిన ఈ నగదు మొత్తాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని సిట్‌ను ఏసీబీ కోర్టు గురువారం ఆదేశించింది. విజయవాడ ఎస్‌బీఐ మాచవరం శాఖలో ఈ నగదునంతా డిపాజిట్ చేయాలని జారీ చేసిన ఆదేశాల్లో కోర్టు స్పష్టం చేసింది. బుధవారం హైదరాబాద్ శంషాబాద్‌లోని కాచారంలో రూ. 11 కోట్ల నగదును సీజ్ చేసినట్లు కోర్టులో సిట్ అధికారులు మెమో దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఏసీబీ కోర్టు ఆదేశాలతో మరికొద్దిసేపట్లో సిట్ కార్యాలయం నుంచి రూ. 11 కోట్ల నగదును తరలించి మాచవరం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సిట్ అధికారులు డిపాజిట్ చేయనున్నారు. మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే పలువురిని సిట్ అధికారులు విచారించారు. ఆ క్రమంలో వరుణ్‌ను విచారించారు. అతడు చెప్పిన ఆధారాలతో బుధవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ కాచారంలో ఒక ఇంట్లో రూ.11 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును ఏపీలోని సిట్ కార్యాలయానికి తరలించారు.

## 'లులు'కు భూ కేటాయింపుపై హైకోర్టు విచారణ సవరణ పిటిషన్ వేసేందుకు వెసులుబాటు

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** లులు సంస్థకు విశాఖపట్నం,విజయవాడలలో భూ కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీఓను సవాలు చేస్తూ సవరణ పిటీషన్ దాఖలు చేసేందుకు పిటీషనర్‌కు హైకోర్టు వెసులుబాటు ఇచ్చింది. న్యాయవాది పాక సతయనారాయణ గురువారం తెలిపారు విశాఖ షాపింగ్ మాల్ ఏర్పాటుకు లులు గ్రూప్ ఇంటర్నేషనల్ సంస్థకు ప్రభుత్వం నామమాత్రపు ధరతో 13.83 ఎకరాలను కేటాయించబోతోందంటూ న్యాయవాది పాక సత్యన్నారాయణనే పిల్ వేసారు. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. సిజె జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. విశ న్యాయవాది అశోక్‌రాం వాదనలు వినిపిస్తూ...'లులు' గ్రూప్‌నకు విశాఖలో ఓసారి భూములు కేటాయించి, రద్దు చేశారు. ఆ సంస్థ చైర్మన్ లేఖ రాశారనే కారణంతో బిడ్‌లను ఆహ్వానించకుండానే ప్రభుత్వం మళ్ళీ భూములు కేటాయించబోతోంది. తాజాగా విజయవాడ లోనూ భూ కేటాయింపునకు అంగీకరిస్తూ జీఓ ఇచ్చింది. ' ఆ జివోను సవాలు చేస్తూ సవరణ పిటీషన్ వేసేందుకు అనుమతి ఇవ్వాలి' అని కోరగా ధర్మాసనం అంగీకరించింది.

## తిరుపతి జూపార్కు అటవీప్రాంతంలో వ్యక్తి ఆత్మహత్య

**తిరుపతి,జూలై 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి అలిపిరి-చెర్లోపల్లి బైపాస్‌మార్గంలోని ఎస్వీజూపార్కుఅటవీప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి(55) ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం ఈ విషయాన్ని కొందరు గమనించి తిరుపతి నగర వెస్టుపోలీసులకు సమాచారం అందించారు. వెస్టు పోలీసులు అటవీప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని క్రిందకు దించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎవరైనా స్థానికుడై ఉండవచ్చని, కుటుంబకలహాలు కారణంగా ఈ ఆత్యహత్యకు పాల్పడిఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు, తిరుపతి వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని ఒంటిపై బ్లూరంగు చొక్కా, నలుపురంగు ఫ్యాంటు ఉంది. అలాగే తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైలుపట్టాలపై గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైలునుండి క్రిందపడ్డాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా తెలియడం లేదు. మృతుని కుడిచేతిపై కృష్ణమూర్తి పచ్చబొట్టు, రాగికంకణం ధరించి ఉన్నాడు. రిబ్స్ వద్ద పిజికె పచచబొట్టు ఉంది.

## ప్రత్తిపాడు మండలంలో పెన్షన్ సొమ్ము గోల్‌మాల్..

### రూ.14 లక్షలు దుర్వినియోగం

**ప్రతిపాడు, జూలై 31( ప్రభాతవార్త ):** ప్రత్తిపాడు మండల ప్రజాపరిషత్ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ నిమిత్తం విడుదలైన నిధులు పంపిణీ చేయగా మిగిలిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు తిరిగి జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించిన అవినీతి ఘటన వెలుగులోకి రావడం తీవ్ర దుమారం రేపుతోంది. దీనికి సంబంధించి చిన్న శంకర్లపూడి, ఒమ్మంగి, గోకవరం, చింతలూరు, గజ్జనపూడి గ్రామాల్లో సుమారు రూ.14 లక్షల పెన్షన్ సొమ్ము ప్రభుత్వ ఖాతాలోకి జమ చేయకుండా మాయమయ్యిందని తాజా విచారణల్లో తేలింది. గామాల వారీగా దుర్వినియోగ వివరాలు ఇలా ఉన్నాయి.
చిన్న శంకర్లపూడిలో రూ 7,46,250లు, ఒమ్మంగిలో రూ 3,75,000లు,గోకవరంలో రూ 2,03,250లు, చింతలూరులో రూ 1,90,250లు,గజ్జనపూడిలో రూ 45,000 లు గ్రామాల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు ఎంపీడీవో ఇచ్చిన షోకాజు నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు అందిన 24 గంటల్లో ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆదేశించారు. లేనియెడల క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎండిఓ షొకాజ్ నోటీసులో హెచ్చరించారు.

# తిరుమల సమాచారం

## ఆగస్ట్ 5నుండి పవిత్రోత్సవాలు - 4న అంకురార్పణ



**తిరుమల,జూలై 31ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు, సేవలు జరిగే తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామి ఆలయంలో ఆగస్ట్ 5వతేదీ నుండి 7వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి ఏదాడి శ్రావణమాసంలో ఈ పవిత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో టిటిడి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా చేపడతారు. ఆలయంలో పలురకాలుగా భక్తులవల్ల గానీ,ఆలయ అధికారులు, అర్చకుల వల్ల తెలిసీతెలియక చేసిన తప్పిదాలు, పొరబాట్లు వల్ల దోష నివృత్తికి ఈ పవిత్రోత్సవాలు జరిపించడం ఆనవాయితీ. ఆగస్ట్ 5వతేదీ నుండి మూడురోజులు జరిగే ఈ ఉత్సవాలకు 4వతేదీ సోమవారం రాత్రి అంకురార్పాణ కార్యక్రమం చేపడతారు. 5వతేదీ మంగళవారం ఉదయం నుండి 7వతేదీ గురువారం పవిత్రాలు సమర్పణతో ముగుస్తాయి. ప్రతిరోజూ ఉదయం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవర్లకు విశేష స్నపనతిరుమంజన అభిషేకాలు జరిపిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో కొన్ని ఆర్జితసేవలు రద్దయ్యాయి. పవిత్రోత్సవాలకు గృహస్థ భక్తులను అనుమతినిస్తారు.

## ముగిసిన సద్గమయ శిక్షణ తరగతులు



**తిరుమల,జూలై 31ప్రభాతవార్తప్రతినిధి:** యువత మేలుకో మీ శక్తిని తెలుసుకో అనే నినాదంతో ఐదురోజులపాటు తిరుపతిలోని టిటిడి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులకు సద్గమయ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. జీవన వికాసం,నిజమైన వ్యక్తిత్వం, మానసిక శక్తులు ,స్వామివివేకానంద,దృఢ సంకల్పం,కనిపించే దేవతలు,అవరోధాలే అవకాశాలు, వ్యక్తిత్వ వికాస కథలు, శ్రీరామకృష్ణ పరమహంస,నీతికథ రత్నములు, బుద్ధివికాసం ,సక్సెస్‌ఆఫ్ స్టూడెంట్స్ పుస్తకప్రసాదాలను విద్యార్థులకు అందించారు. 700మంది విద్యార్థులకు 7పాఠశాలలకు చెందిన వారికి ఈ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు భక్తిభావం అలవరచుకోవాలని, సనాతన హిందు ధర్మపరిరక్షణపై అధ్యాపకులు బోధించారు.

## అక్రమ కేసులకు అధైర్యపడవద్దు అండగా ఉంటాం

### -'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ ప్రారంభంలో భూమన




**తిరుపతిరూరల్, జూలై 31 ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్రమ కేసులకు భయపడవద్దు...అధైర్య పడవద్దు ఎల్లవేళల పార్టీ మీకు అండగా ఉంటుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తుమ్మలగుంటలో 'బాబు షూరిటీ...మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని భూమన కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలకు సంక్షేమం అందిందని...ప్రస్తుత కూటమి పాలనలో సంక్షోభం తప్ప సంక్షేమం కంటికి కనబడలేదని ఆవేదన వ్యక్తం చేసారు. చంద్రబాబు ప్రజలను మోసం చేయడం తప్ప...ఇచ్చిన హామీలను ఏనాడు అమలు చేయలేదన్నారు. గడిచిన ఏడాది కూటమిపాలనలో ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఏద్దేవ చేసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని నమ్మబలికి ప్రజలను నట్టేట ముంచేసారన్నారు. ఉచిత గ్యాస్ ఇస్తామని తుస్సుమనిపించారు. ఇదిగో తల్లికి వందనం అన్నారు...ఎవ్వరికి అందకుండా చేసారు. ఆడబిడ్డ నిధి అన్నారు...ఆ పథకాన్ని ఆమడ దూరాన నిలిపేసారు. నిరుద్యోగులకు భృతి అన్నాడు...నిరుద్యోగుల నెత్తిన శఠగోపం పెట్టాడు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసారుడు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఎన్నికలలో ఇచ్చిన 143 హామీలను చంద్రబాబు విస్మరించాడన్నారు.

## నైపుణ్యం కలిగిన యువత కొరత ప్రపంచదేశాలను వేధిస్తున్నది

### - నైపుణ్య ఉద్యోగుల నియామక విభాగాధిపతి డా. బాల సుబ్రమణియన్ రమణి

**విజయవాడ,జూలై31,ప్రభాతవార్తప్రతినిధి:** నైపుణ్యం కలిగిన యువత కొరత ప్రపంచదేశాలను వేధిస్తుందని, జర్మన్ దేశంలో నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జర్మనీలోని లోయర్ సాక్సోనీ రాష్ట్రం, ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖలో నైపుణ్య ఉద్యోగుల నియామక విభాగాధిపతి డా. బాల సుబ్రమణియన్ రమణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు లోయర్ సాక్సోనీ రాష్ట్రం మధ్య నైపుణ్యాభివృద్ధి, జర్మన్ భాష శిక్షణ , ఇతర రంగాల్లో ద్వైపాక్షిక సహకార అవకాశాలపై డా. బాల సుబ్రమణియన్ రమణి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బాల సుబ్రమణియన్ రమణి మాట్లాడుతూ జర్మనీలో ప్రస్తుతం 7 లక్షల పైగా ఉద్యోగ ఖాళీలు ఉండగా, 2035 నాటికి మరో 70 లక్షల నిపుణుల అవసరం ఉంటుందని అంచనావేశామన్నారు. రవాణా, నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, ఇంజినీరింగ్, ఐటీ వంటి కీలక రంగాల్లో నైపుణ్య నిపుణుల కొరత ఉండనుందని వివరించారు. ఈ సమస్యకు పరిష్కారంగా జర్మనీ భారతదేశాన్ని వ్యూహాత్మక భాగస్వామిగా గుర్తించిందని, 2024లో ప్రారంభించిన ఇండియా స్కిల్డ్ లేబర్ స్ట్రాటజీ మరియు వలస గమనం భాగస్వామ్య ఒప్పందం ఈ సహకారానికి బలం చేకూర్చాయన్నారు. ఏపీ యువత నైపుణ్య విద్యతో పాటు జర్మన్ లాంగ్వేజీ పై పట్టు సాధించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ , హయ్యర్ ఎడ్యుకేషన్, మరియు స్కూల్ ఎడ్యుకేషన్ విభాగాల కార్యదర్శి కోన శశిధం తెలిపారు.

## వివాదాలకు ఆస్కారం లేకుండా మార్గదర్శులను గుర్తించండి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**జులై 31, ప్రభాతవార్త ప్రతినిధి :** స్వర్ణాంధ్ర పి4 కార్యక్రమం అమల్లో భాగంగా మార్గదర్శులను గుర్తించే విషయంలో ఎటు వంటి వివాదాలకు, విమర్శలకు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశించిన విధంగా స్వచ్ఛంధంగా ముందుకు వచ్చే మార్గదర్శులకే బంగారు కుటుంబాలను దతత్త నివ్వాలని, అప్పుడే బంగారు కుటుంబాల అభివృద్ధి సాధ్యమవుతుందని తద్వారా ప్రభుత్వం యొక్క ఆకాంక్ష కూడా నెరవేరుతుందన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్పరెన్సు నిర్వహించి స్వర్ణాంధ్ర శి4 ఫౌండేషన్, నీటి వనరుల మరమ్మత్తు, పునరుద్ధరణ, గ్రీన్ హైడ్రోజన్ హబ్ మరియు అన్నదాత సుఖీభవ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలను దత్తత చేసుకునే విషయంలో ఎవరినీ వత్తిడి చేయవద్దని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాలన్నారు. సమాజంలో మంచి స్థానాల్లో ఉన్న వారు మార్గదర్శులుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చే విధంగా మోటివేట్ చేయాలని తద్వారా మార్గదర్శులకు పెద్ద ఎత్తున గుర్తించాలన్నారు. ఆగస్టు 16న ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో ప్రారంభించే ఆలోచనలో ప్రభుత్వం ఉందున, ఆగస్టు 15 కల్లా నిర్ణీత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్లకు ఆయన సూచించారు. సమాజంలో జ్ఞాన పరంగా, ఆర్థిక పరంగా మరియు వృత్తి నైపుణ్య పరంగా ఉన్న వ్యత్యాలను రూపుమాపడానికే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించి విజయవంతంగా అమలు పర్చాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమం అమలుకు సంబందించి కమ్యునికేట్ చేస్తున్న ఎస్.ఓ.పి.లను సక్రమంగా అనుసరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.
రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి దోహదపడే విధంగా రాష్ట్రంలో నున్న జల వనరులను అన్నింటిని పరిరక్షింకునేందుకై అవసరమైన మరామత్తులు, పునరుద్ధరణ పనులను నిర్వహించేందుకు ప్రతిపాదనలను సత్వరమే ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం పథకం క్రింద కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటా నిధులతో రాష్ట్రంలోని జలవరులను అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని, ఈ కార్యక్రమం విజయవంతం చేసే అంశంపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు.

## గూగుల్‌కు విశాఖలో 50 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు రంగం సిద్ధం

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 31, ప్రభాత వార్త :** విశాఖలో గూగుల్ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టబోతోందన్న ప్రచారం చాలా రోజులుగా జరుగుతోంది. గతంలో ఎంవోయూ కూడా చేసుకున్నారు. అయితే ఏ విభాగంలో పెట్టుబడులు పెడతారన్నదానిపై ఇప్పుడిప్పుడే క్లారిటీ వస్తోంది. అమెరికా తర్వాత అతి పెద్ద డేటా సెంటర్ ను విశాఖలోనే ఏర్పాటు చేయాలని గూగుల్ నిర్ణయించుకున్నట్లుగా అంతర్జాతీయ మీడియా సంస్థ రాయిటర్స్ ప్రకటించింది. గూగుల్ విశాఖపట్నంలో 1 గిగావాట్ డేటా సెంటర్‌ను నిర్మించడానికి 6 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుందని రాయిటర్స్ రిపోర్ట్ చేసింది. అంటే మన రూపాయల్లో 50 వేల కోట్లు. ఈ పెట్టుబడిలో 2 బిలియన్ల రెన్యూవబుల్ ఎనర్జీ కెపాసిటీ కోసం కేటాయిస్తారు. ఇది డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ అందిస్తుంది. ఈ డేటా సెంటర్ ఆసియాలో అతిపెద్దదిగా ఉంటుందని, సింగపూర్, మలేషియా, థాయిలాండ్‌లలో గూగుల్ డేటా సెంటర్ విస్తరణలో భాగంగా ఉంటుందని రాయిటర్స్ చెబుతోంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌ను ఒక టెక్ హబ్‌గా మార్చడంలో భాగంగా, విశాఖపట్నంలో మూడు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడానికి కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

శుక్రవారం 01 - ఆగష్టు - 2025




# కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
సి ఎస్ ఆర్ కింద అందచేసిన రూ.42 లక్షల విలువ గల అత్యాధునిక అంబులెన్స్ ను మంత్రి వాసంశెట్టి ప్రారంభించారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందుకోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, కర్మగార, బాయిలర్స్ మరియు వైద్య భీమ సేవల మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరం శ్రీరామనగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో కార్పొరేట్ సామాజిక బాధ్యతకింద యూనియన్ బ్యాంక్ విరాళంగా అందజేసిన రూ.42 లక్షల విలువైన అత్యాధునిక సౌకర్యాలు (వెంటిలేటర్, మానిటర్, ఇన్‌ఫ్యూజన్, స్ట్రెచర్, ఏసీ) కలిగిన అంబులెన్స్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, జీరో ఇన్సిడెంట్ నమోదే ప్రభుత్వ లక్ష్యమని, ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించని ఫ్యాక్టరీలకు అనుమతులు మంజూరు చేయబోమని, ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని హెచ్చరించారు. రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిలో రోజూ 200%-%300 మంది పేషెంట్లు వైద్య సేవలు పొందు తున్నారని, కార్మికుల భీమా చెల్లింపులో యాజమాన్యాల నిర్లక్ష్యం ఉంటే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటా మని అన్నారు. త్వరలో 150 పడకల సామర్థ్యం గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అమరావతిలో నిర్మించనున్నట్లు తెలిపారు.

## సహకార సంఘాల ద్వారా రైతులకు సేవలు అందించాలి.. మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు



**ఆత్రేయపురం, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
సహకార సంఘాల ద్వారా రైతుల ప్రయోజనాల కోసం పాలకవర్గాలు పనిచేయాలని మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు అన్నారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలి సహకార వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం అధ్యక్షునిగా తోటకూర సుబ్బరాజు, సభ్యులుగా ఉర్రింకల నాగేశ్వరరావు, బోడపాటి సుబ్బారాయుడు ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా పాల్గొని సహకార సంఘం పాలకవర్గంగా నియమితులైన నూతన అధ్యక్షులు సభ్యులను ఈ సంఘం మరింత అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని వాటిని రైతులకు సక్రమంగా అందించే విధంగా పాలకవర్గాలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని మండల తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ తో కలసి అధ్యక్షులు తోటకూర సుబ్బరాజును పూల భూకే ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు ముదునూరి నరేంద్ర రాజు , ముదునూరి వీరబాబు, ఎంపీటీసీ మట్ట లక్ష్మి, వెంకటేశ్వర ప్రసాద్, కుటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ ఉత్తమ ప్రదర్శనగా తొండవరం హైస్కూల్ ప్రాజెక్ట్

**అంబాజీపేట, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
సైన్స్ ఎగ్జిబిషన్లో జాతీయ ఉత్తమ ప్రదర్శనగా తొండవరం హైస్కూల్ ప్రాజెక్టు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.వి. కేశవచార్యులు తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్నోవేటివ్ సెల్, ఏఐసిటియు ద్వారా జాతీయ స్థాయికి ఎంపికైన 39 ప్రాజెక్టులను గలకోటి యూనివర్సిటీ నోయిడాలో ప్రదర్శించారు. జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్టు ప్రజెంటేషన్, వర్క్ షాప్-2025ను పురస్కరించుకుని జూలై 28 నుండి 31 వరకు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర విద్యా శాఖామాత్యులు ధర్మేంద్ర ప్రధాన్, ఏఐసిటీఈ వైస్ చైర్మన్, అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. 2024 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపికై ప్రదర్శించిన తొండవరం హైస్కూల్ సైన్స్ ప్రాజెక్ట్ కార్బన్డయాక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టుకు సస




## పాంచాల రేవును పరిశీలిస్తున్న తాతకాపు



**మామిడికుదురు, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
మామిడికుదురు మండలం లూటుకుర్రు గ్రామంలో పంచాయతీ చెరువుల వద్ద పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో నిర్మిస్తున్న పాంచాల రేవు పనులను గ్రామ సర్పంచ్,పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచ్ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు గురువారం పరిశీలించారు. ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం వార్డు సభ్యులు బోనం అబ్బులు,గోకవరపు శేషు గ్రామస్తులు ఆయన వెంట ఉన్నారు.

## మండలంలో 205 కొత్త పెన్షన్లు మంజూరు

**రావులపాలెం, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
రావులపాలెం మండలంలో కొత్తగా 205 పెన్షన్లు మంజూరయ్యాని వాటిని శుక్రవారం నుంచి సంబంధిత సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తారని ఎంపీడీవో మహేశ్వర రావు తెలిపారు. ఈ పింఛన్లన్నీ భర్త పింఛను తీసుకుంటూ మరణిస్తే భార్యకు మంజూరైనవిగా వివరించారు. మొత్తం 205 పింఛన్లకు గాను రూ.8.26 లక్షలు విడుదల అయ్యాయన్నారు. వీటిలో రావువులపాలెం-2 సచివాలయం పరిధిలో ఒకరికి కిడ్నీ పెన్షన్ గా రూ.15 వేలు మంజూరయ్యాయని మిగిలినవన్నీ నాలుగువేల రూపాయలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. గ్రామాల వారిగా మంజూరైన పించన్ల వివరాలు ఎలా ఉన్నాయి. దేవరపల్లి-26, ఈతకోట-16,గోపాలపురం -22, కేతరాజుపల్లి-1, కొమరాజులంక-14, లక్ష్మీ పోలవరం-10, ముమ్మిడివర్పాడు-5, పొడగట్లపల్లి-22, రావులపాడు -12, రావులపాలెం-42 ఊబలంక-24,వెదిరేశ్వరం- 11 మంజూరయ్యాయన్నారు.



## బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం



**అంబాజీపేట, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని గంగలకుర్రు అగ్రహారం గ్రామ సచివాలయంలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన 8 మంది సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజలకు సేవలందించే ఏ అధికారైన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఎం.ఎం.శెట్టి,విత్తనాల ఇంద్రశేఖర్,కట్టా సుబ్రహ్మణ్యం, అడపా బాబ్జి, మట్టపర్తి సతీష్, మంద నాగరాజు, రాయుడు కృష్ణమహేష్ లు పాల్గొన్నారు.

## ర్యాలి జగన్మోహని కేశవస్వామి వారి దేవస్థానంలో ఆగస్టు 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

**ఆత్రేయపురం, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
స్వయంభుక్షేత్రం ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి, గోపాల స్వామి వారి దేవస్థానం నందు ఆగస్టు 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు దేవస్థానం వారిచే నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. కావున వరలక్ష్మి వ్రతం లో పాల్గొనే మహిళలు తమ పేర్లు గోత్రములు 20 తేది లోపు నమోదు చేసుకోగలరని తెలియజేశారు.




# పరిమళించిన మానవత్వం, లక్ష్యానికి మించి రక్తదానం

**గోపాలపురం , జులై 31 , ( ప్రభాతవార్త ) :**
గోపాలపురం మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. మానవతా సంస్థ సభ్యులు చేస్తున్న ఎన్నో ప్రజాహిత కార్యక్రమాల పట్ల అనేక మంది యువకులు స్పందించి వారిలోని మానవత్వం పరిమళించి ఈ రక్తదాన శిబిరానికి స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడంతో మానవతా సంస్థ మరో మైలురాయి దాటింది. అంతేగాక ఈ మెగా రక్తదాన శిబిరంలో వందమంది నుంచి రక్తం సేకరించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకోగా.. 130 మంది యువకులు వచ్చి రక్తదానం చేయడం విశేషం. శిబిరాన్ని తహసిల్దార్ అజయ్ బాబు ప్రారంభించి మాట్లాడుతూ.. యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. మానవతా సంస్థ చేస్తున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారికి, గర్భిణీ స్త్రీలకు తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉపయోగించేందుకు రక్తం సేకరించడం ఎంతో మంచి విషయమన్నారు. ఆపదలో ఉన్న అనేక మంది ప్రాణాలను మానవతా సంస్థ కాపాడుతుందని కొనియాడారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి, డాక్టర్ రాజేశ్వరి గోపాలపురం మానవత ఈ రక్తదాన శిబిరానికి వచ్చి రక్తదానం చేసిన వారిని అభినందనించారు. స్థానిక శర్వాణి స్కూల్లో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో రక్తదాతలకు, రక్తం సేకరించడానికి వచ్చిన సిబ్బందికి ఎంపీడీవో రాజమనోహర్, ట్రైనీ ఎస్ఐ శివ గణేష్, మానవతా సంస్థ సభ్యుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. మండల మానవతా చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మానవతా మండల అధ్యక్షులు రాపాక ఫణి కిషోర్, జిల్లా రక్త నిధి డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లి చంద్రశేఖర్, కీర్తి కుమార్, ముప్పన కృపావర ప్రసాద్, గుబ్బ లక్ష్మణరావు, రాధాకృష్ణ, హేమంత్, రమేష్ తదితర మానవతా సభ్యులు పాల్గొని సహాయ సహకారాలు అందించారు.




## కొనసాగుతున్న రిలే నిరాహారదీక్ష



**ప్రత్తిపాడు , జులై 31 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని ఇ.గోకవరంలో తనకు, తన పంటకు నష్ట చేకూర్చిన వ్యక్తిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చెయ్యాలంటూ బాధిత రైతు సత్తి వినోద్ కుమార్‌రెడ్డి చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారం 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధిత రైతు వినోద్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంకు చెందిన తాను మండలంలోని ఇ.గోకవరంలో పది ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమిని సాగు చెయ్యకుండా కొంత మంది తరచూ అడ్డుపడుతూ తనపై కూడా దాడికి పాల్పడుతున్న ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగేంత వరకు రిలే దీక్షను కొనసాగిస్తానని ఆయన ఉద్ఘాటించారు.

## ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



**ప్రత్తిపాడు , జులై 31 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని గజ్జనపూడి రామాలయంలో గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సాలివాహన కార్పోరేషన్ సభ్యుడు అనకాపల్లి నూకరాజు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అల్లు సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గొనగాల దేవుళ్ళు, బర్ల చక్రం, అనకాపల్లి నూకరాజు, ఇసరపు సూర్యారావు, నీలి మాణిక్యాల రావు, గార శీను, అల్లు గంగ బాబు, గొనగాల రవి, అల్లు పెద్దాపురం, బంధం తాతీలు, సీరం అప్పారావు, సప్ప అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అమలాపురం (మండపేట), జులై 31 , ( ప్రభాతవార్త ) :**
డెంగ్యూ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమీషనర్ టి.వి. రంగారావు పేర్కొన్నారు. మండపేట పురపాలక సంఘ పట్టణ పరిధిలో గురువారం డెంగ్యూ మాసోత్సవ ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ లో అన్ని వార్డు సచివాలయల నుండి గవర్నమెంట్, ప్రైవేటు స్కూల్ విద్యార్థులు, మెప్మా ఆర్పీ లు, ఆరోగ్య కార్యకర్తలు ఆయా వార్డుల నుండి ర్యాలీలు నిర్వహించారు.

## కష్టించి పనిచేసే వారికి ఎల్లవేళలా గుర్తింపు

**అంబాజీపేట, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
ఉద్యోగ నిర్వహణలో కష్టపడి పనిచేసేవారికి ఎళ్లవేళలా గుర్తింపు ఉంటుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మిలు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అటెండర్ గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన గుత్తుల సాయికృష్ణ సన్మానసభ ఇన్చార్జి ఎంపీడీవో ఎ.ఎల్.ఎస్.నరసింహం ఆధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 42 ఏళ్లుగా పంచాయతీ రాజ్, ట్రెజరీ కార్యాలయాలలో అటెండర్గా విధులు నిర్వహించిన సాయికృష్ణ అందరిమన్ననలు పొందారన్నారు. నాలుగేళ్లుగా అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ రామకృష్ణ అందరికీ దగ్గర వాడయ్యారని తెలిపారు. అనంతరం సాయికృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నే



## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**సీతానగరం, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
మండలంలో పలువురికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బత్తుల సతీమణి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మీ గురువారం అందజేశారు. రాపాక గ్రామం శ్రీరామనగరంకు చెందిన గొలకోటి శివ ప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ. 4,37,925. కాటవరం గ్రామానికి చెందిన బొల్లి శ్రీ లక్ష్మికి రూ. 1,40,798. ముగ్గళ్ళ గ్రామానికి చెందిన కూచిపూడి ఉమాదేవికి రూ. 1,18,013. కూనవరం గ్రామానికి చెందిన మద్దిరెడ్డి అయ్యప్పకు రూ. 1,00,000. ముత్యం రాముకు రూ. 50,000. నందూరి ఏడుకొండలుకు రూ. 65,904. రావూరి రాముకు రూ. 50,011. టి.విజయ దుర్గకి రూ. 94,158. చినకొండేపూడి గ్రామానికి చెందిన పెరవలి శ్రీనివాస్ కుమార్ కు రూ. 40,918. చిడిపి సుబ్బారావుకు రూ. 20,524. దుగ్గిరాల అనంతలక్ష్మీకి రూ. 15,000. రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఉందుర్తి హరీష్ కు రూ. 36,084. బొబ్బిల్లంక గ్రామానికి చెందిన గుత్తుల శాంతి సిరిశా దేవికి రూ. 23,400. సీతానగరం గ్రామానికి చెందిన పెంటా సునీత భవానికి రూ. 18,000. విలువైన చెక్కులను బత్తుల అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందుకున్న బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారిచర్ల విజయ శంకర్, మట్ట వేంకటేశ్వర రావు, గెద్దాడ త్రిమూర్తులు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులతో అలరారిన వాడపల్లి క్షేత్రం.... స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ,4.24,లక్షలు

**ఆత్రేయపురం, జులై 31 , ( ప్రభాతవార్త ) :**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి గురువారం అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్ని దర్శించుకున్నారు. భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ పరిసరాలు మర్మోగాయి. ఉదయం శ్రీ వేంకటేశ్వర సహిత ఐశ్వర్య లక్ష్మీ హెూమం,అష్టోత్తర శతనామావళి,నిత్యాకల్యాణం, గోపూజ, బాల భోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. దీంతో వివిధ సేవలద్వారా స్వామివారికి రూ, 4,24,663 /-లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.



## విలువలుతో కూడిన విద్యను అందిచడమే సంస్థ లక్ష్యం

**– శ్రీ భారతి కరస్పాండెంట్ సుంకర వీరబాబ**



**ప్రత్తిపాడు , జులై 31 , ( ప్రభాతవార్త ) :**
విలువలతో కూడిన విద్యను అందించడమే శ్రీ భారతి విద్యాసంస్థల లక్ష్యమని ఆ సంస్థల అధినేత సుంకర వీరబాబు తెలిపారు. మండలంలోని రాచపల్లి అడ్డరోడ్డు వద్ద అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర ఆలయంలో శ్రీ భారతి విద్యాసంస్థలు నూతనంగా కొనుగోలు చేసిన రెండు స్కూలు బస్సులను గురువారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆ బస్సులను ప్రారంభించారు. తమ విద్యాసంస్థలలో ప్రత్తిపాడు, కిర్లంపూడి,ఏలేశ్వరం,శంఖవరం మండలాలకు చెందిన 1500 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా 150 మంది సిబ్బంది పనిచేస్తున్నారనీ చెప్పారు. వ్యక్తి నిర్మాణ విద్య ప్రాధాన్యతగా భావించి ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన నిర్వహిస్తున్నామన్నారు. నేటి పోటీ ప్రపంచానికి అనుకూలంగా విద్యార్థుల ఆధునిక సామర్థ్యాలు పెంపుదల,విద్యాభివృద్ధి లక్ష్యంగా తమ విద్యాసంస్థలు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చైర్మన్ వీరబాబు తెలిపారు

# వల్లూరులో రొయ్యల సాగు పై ఆక్వా మీట్



రాజమహేంద్రవరం, జులై 31, (ప్రభాతవార్త ): రొయ్యల సాగు చేసే రైతులకు శాస్త్రీయ సమాచారాన్ని చేరవేసే లక్ష్యంతో ది వాటర్‌బేస్ లిమిటెడ్ సంస్థ వల్లూరులో ఆక్వా మీట్ను నిర్వహించింది. వర్షాకాలంలో కనిపించే వాతావరణ మార్పులు, నీటి నాణ్యతలో గల హెచ్చుతగ్గులు, వ్యాధుల ప్రమాదం వంటి అంశాలపై రైతులు అప్రమత్తంగా ఉండేలా చేయడం ఈ ఆక్వామీట్ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో ది వాటర్‌బేస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శక్తి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాల సవాళ్లను తట్టుకునేందుకు అనుసరించవలసిన మంచి యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఆక్సిజన్ స్థాయి నిర్వహణ, వర్షం సమయంలో ఫీడ్ మోతాదు ను సరిచేసుకుంటూ డిమాండ్ ఫీడింగ్ ఇవ్వడం ద్వారా చెరువు అడుగు భాగం శుభ్రంగా ఉంచడం, మరియు అనుమతి లేని రసాయనాల వినియోగం నివారించటం వంటి కీలక అంశాలను వివరించారు. "వర్షకాల ఒత్తిడి రొయ్యల ఆరోగ్యాన్ని దెబ్బతీసి సాగు నష్టాలకు దారితీస్తుంది," అని పేర్కొన్నారు. "అయితే, సమయానికి సరైన చర్యలు తీసుకుంటే ఈ సమస్యల్ని సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చు. ఆక్వా మీట్‌ల ద్వారా శాస్త్రీయ పద్ధతులను రైతులకు తెలియచేయటమేహా మా లక్ష్యం. అన్నారు. ఈ సందర్భంగా ది వాటర్‌బేస్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ చోళ వర్మ అలూరి మాట్లాడుతూ, "మేము రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు, నిపుణుల సూచనలతో పాటు విశ్వసనీయ ఏ డి సి సేవలను అందిస్తూ వారు విజవంతమైన పంట పండించేందుకు, మంచి దిగుబడి సాధించేందుకు మేము సహకరిస్తున్నాము అన్నారు. ఈ సమావేశంలో 140 మందికి పైగా రొయ్యల రైతులు పాల్గొన్నారు. ఈ విధంగా ఆక్వా మీట్ ద్వారా వర్షాకాలం సీజన్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు సాంకేతిక సలహాలు అందించినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. రైతులు వారికున్నసదేహాలను నివృత్తి చేసుకొన్నారు.

# డిఆర్‌ఓ రాజకుమారి సేవలు ప్రశంసనీయం : జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

కోనసీమ బ్యూరో, జులై 31, (ప్రభాతవార్త ): సుమారుగా 43 న్నర సంవత్సరాల పాటు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రెవెన్యూ విభాగంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పలువురు మన్ననలు పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం డిఆర్‌ఓగా పనిచేసిన రాజకుమారి పదవి విరమణ సన్మాన వీడ్కోలు సభ స్థానిక కలెక్టరేట్ నందు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి సుదీర్ఘ కాలం రెవెన్యూ శాఖలో 1983 నుండి అంతగా టెక్నాలజీ లేని సమయంలో ఎంతో కష్టించి పనిచేస్తూ వచ్చారని , ముక్కు సూటిగా మాట్లాడే తత్వం ఆమె సొంతమన్నారు. ఆమె బావి జీవితం మనువలు మనవ రాన్లతో సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తీ మాట్లాడు తూ ఆమె సేవలు ప్రశంసనీయ మని సమర్థవంతంగా పనిచేసే పలువురికి ఆదర్శ%శీ% స్ఫూర్తిదా యకంగా నిలిచాయ నడంలో అతిశయోక్తి లేదన్నారు ఎంతో సమర్థత అంకిత భావం జవాబుదారితనంతో సమాజ అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు ఆమె చూపిన చొరవతో అందిం చిన సేవలు ఎంతో ప్రశంసనీ యమన్నారు. సిబ్బంది అందరికీ వారధిగా స్నేహపూరకు వాతా వరణం లో పనిచేసి ఎంతో ఖ్యాతిని శాఖపర%శీ% గా గడించా రన్నారు. భావి జీవితం సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆమె ఆకాంక్షించారు. పలువురు వక్తలు ప్రసంగిస్తూఈరోజు మనమందరం ఎంతో గౌరవ ప్రదమైన, కానీ ఒకవైపు భావోద్వేగానికి లోనయ్యే ఘట్టంలో పాల్గొన్నా మన్నారు. మన జిల్లాకు గౌరవాన్ని తీసుకువచ్చిన జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి రిటైర్మెంట్ కార్యక్రమం అందరి



సమక్షంలో నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు ఆమె పాలన సామర్థ్యం, శ్రద్ధ, సేవా భావం చూసి, నిజంగా ఆఫీసర్ అంటే ఇదే అనిపించేలా చేసిందన్నారు ఒక మహిళా అధికారిగా ఎంతో బాధ్యతగా సమర్థంగా, ప్రామాణికంగా పని చేయాలో ఆమె తన విధి నిర్వహణ సేవ ద్వారా నిరూపించారన్నారు.పిల్లలతోపాటు పౌరులతో పాటు వ్యవస్థల మధ్య సమతుల్యం పాటిస్తూ, సమర్థత, న్యాయం అనే పదాలకు ఆమె నిర్వచనం ఇచ్చారన్నారు. సమస్యలపై ఆమె దృష్టి, పరిష్కారాల్లో ఆమె తీర్పు, మరియు పనితీరు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాయ న్నారు.ఆమె రాబోయే తరం మహిళా అధికారులకు మార్గ దర్శకురాలిగా నిలిచారని ప్రభుత్వ విధులను నిర్వర్తిం చడంలో మాత్రమే కాక, సమాజాన్ని ఎలా ప్రభావితం చేయాలో కూడా ఆమె చూపిం చార న్నారు.ఈ పదవీ విరమణ తర్వాత ఆమె జీవితం మరింత ప్రశాంతంగా, ఆనందంగా ఉండాలని, ఆమె ఆరోగ్యం వృద్ధి చెందాలని మనసారా ఆశిస్తు న్నామన్నారు. మేమందరం ఆమెతో కలిసి పనిచేసిన అనుభవాన్ని గర్వంగా గుర్తించుకుంటామన్నారు, మీ సేవలకు మా హృదయపూర్వక కృతజ్ఞతలనీ మీరు మాకు చూపిన మార్గం, స్ఫూర్తిగా ఉండిపోతుందన్నారు. పదవీ విరమణ సన్మాన గ్రహీత రాజకుమారి మాట్లాడుతూ ఈరోజు నా ఉద్యోగ జీవితానికి ఒక ముఖ్యమైన మలుపు అని ఎంతో కాలంగా నాకు తోడుగా నిలిచిన ఈ శాఖను, సహొా ద్యోగులు, స్నేహితుల్ని వదిలి వెళ్లడం నాకు ఎంతగానో కలత కలిగిస్తోందన్నారు. అయినా జీవితంలో ప్రతి ప్రారంభానికి ఒక ముగింపు ఉండే విధంగా, ఈ ప్రయాణానికి కూడా ముగిం పు వచ్చిందన్నారు.రెవిన్యూ లో పని చేయడం నా జీవితంలో గొప్ప అనుభవమనీ ఇక్కడ నేర్చుకున్న పాఠాలు, పొంది న అనుభవాలు, స్నేహాలు అన్నీ నాకు జీవితాంతం గుర్తుండి పోతాయన్నారు. ప్రతి ఒక్కరికి, నాకు చూపిన సహకారం, ఆదరణ, మరియు ప్రేమకు మనఃపూర్వ కంగా కృతజ్ఞతలు తెలుపు తున్నానన్నారు.నేను నన్ను నేను విశ్వసించేందుకు, ఎదగడానికి, మీరు అం దించిన తోడ్పాటు అపూర్వమని ఇది ఏమీ తేలికైన వీడ్కోలు కాదనీ కానీ మనం వేరుపడ్డా మన అనుబంధం అలాగే కొనసా గుతుందని ఆశిస్తున్నామ %శ్రీ%న్నారు మీ అందరికీ వ్యక్తిగ తంగా, వృత్తిపరంగా ఇంకా ఎక్కువ విజయాలు అందాలని ఆకాంక్షిస్తు న్నానన్నారు. జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ల సార ధ్యంలో యోగానంద ద్వారా జిల్లాకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం దక్కిం చుకోవడంలో పాలుపం చుకోవడం సంతోషం గా ఉందన్నారు. విదేశాలలో వివిధ కారణాల మూలంగా ఇబ్బందులు పడుతున్న 23 వ్యక్తులను స్వదేశాన్ని తీసు కురావడంలో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఏర్పాటుచేసి జిల్లా కలెక్టర్ వారు చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవోలు పీ శ్రీకర్ కే మాధవి డి అఖిల, ఏవో కాశీ విశ్వేశ్వర రావు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధి దివాకర్ జిల్లా అధికారులు తాసిల్దారులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



కోనసీమ బ్యూరో, జులై 31, (ప్రభాతవార్త ): అమలాపురం పట్టణం వడ్డిగూడెంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కర్రి రామస్వామి, జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, రోళ్ళపాలెం సొసైటీ అధ్యక్షులు మట్టా ప్రభాకర్, నల్లా స్వామి, బొర్రా వెంకటేశ్వరరావు,అబ్బాయి వెంకన్న, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జి, దున్నాల దుర్గా, వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ దేవత అమ్మవారి దేవాలయ కార్యవర్గ నియామకం



కోనసీమ బ్యూరో, జులై 31, (ప్రభాతవార్త ): అమలాపురం పట్టణ దేవత శ్రీ సుబ్బాలమ్మ, నూకాలమ్మ రాజ్యలక్ష్మి దేవస్థానం చైర్మన్ గా అప్పన వీర వెంకట భైరవ స్వామి (వీరన్న), కార్యవర్గ సభ్యులుగా ఒంటెద్దు వీర వెంకట సత్యనారాయణ, వాడ్రేవు సరోజ.గంటి నాగలక్ష్మి,పసుపులేటి రామకృష్ణ,సరిదే నాగరాజకుమారి,ఆకుల శ్రీ చాముండేశ్వరి.,బొల్లోజుమణి శ్రీకాంత్. అరిగెల చంద్రశేఖర్ ఎక్స్ అఫీషియ మెంబర్ గా గిత్త శ్రీను లను నియమిస్తూ దేవాదయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో సామూహిక సీమంత వేడుకలు - ముఖ్య అతిథిగా బత్తుల వెంకటలక్ష్మి



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జులై 31, (ప్రభాతవార్త ): రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో రాజానగరంలో మాధవి ఫంక్షన్ హాల్ నందు 2వేల మందికి సామూహిక సీమంత వేడుక జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాజనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భముగా సీమంతం జరుపుకునే మగువలకు పసుపు మరియు గంధం రాసి, పువ్వులు, వళ్ళు, గాజులు, జాకెట్టుముక్కలను వెంకటలక్ష్మి చేతుల మీదుగా వారికి అందజేశారు. అనంతరం బత్తుల వెంకటలక్ష్మి ని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ శాలువ కప్పి చిరు సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

## కాకినాడ ఎం ఎస్ ఎన్ చార్జెస్ ఈవోగా బల్ల నీలకంఠంకు అదనపు బాధ్యతలు

సామర్లకోట, జులై 31, (ప్రభాతవార్త ): శ్రీ కుమార రామా భీమేశ్వర స్వామి ఆలయం కార్యనిర్వహణాధికారి బల్ల నీలకంఠంకు కాకినాడ జగన్నాధపురం ఎంఎస్ఎన్ చార్టీస్ అదనపు కార్యనిర్వాహణాధికారిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ విజయవాడ వారి ఉత్తర్వులు మేరకు అదనపు బాధ్యతలు ఇవ్వడం జరిగిందని గురువారం బల్ల నీలకంఠం జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి బాధ్యతలు స్వీకరించారని



ఆయన తెలియజేశారు.


# స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకై అధికార యంత్రాంగం కృషి చేయాలి



\- కలెక్టర్ మహేష్ కుమార్

కోనసీమ బ్యూరో, జులై 31, (ప్రభాతవార్త ): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యంతో పి4 కార్యక్రమం లక్ష్యాలను చేరుకునేందుకు గ్రామ సభలు, సర్వే లు,నిర్వహణ ద్వారా బంగారు కుటుంబాల అవసరాల గుర్తించా లని జిల్లా కలెక్టర్ ఆర్ మహే ష్ కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధన పి4 సర్వే, బంగారు కుటుంబాల దత్తత,పాజిటివ్ పబ్లిక్ సంతృప్తి స్థాయిల పురోగతి,త్రాగునీటి చెరువుల నవీకరణ నూతన చెరువుల ప్రతిపాదనల పురోగతిపై సమీక్షించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 65 వేల బంగారు కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు 27 వేల బంగారు కుటుంబా లను దత్తత ఇవ్వడం జరి గిందని ఇప్పటివరకు 19 మార్గదర్శులను గుర్తించి నట్లు తెలిపారు. నిర్దేశిత ప్రగతి లక్ష్యాల మేరకు స్వ ర్ణాంధ్ర సాధనకై అధికార యంత్రాంగం కృషి చేయా లన్నారు. పనితీరు మెరుగుపరుచుకుని నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటూ జిల్లాను ముందంజలో నిలపాలని సూచించారు. ప్రజా సంతృప్తి కొలమానంగా అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత పై దృష్టి పెట్టాలని అదేవిధంగా సమయానికి తెరిచే విధంగా చర్యలు తీసుకుంటూ సంతృప్తి స్థాయిలను మెరుగు పరచాలన్నారు బహిరంగ ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పన అంశాలలో పోలీసు శాఖ సమన్వయం తో అవగాహన కార్యక్రమాల ను విస్తృతంగా చేపట్టి మహిళల భద్రత అంశాల పట్ల ప్రచారం గావించాల న్నారు. పురపాలక సంఘాలు గ్రామాలలో పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరుస్తూ ప్రజాసంతృప్తిస్థాయిని చేరుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి డ్రగ్స్ వాడకం రవాణా అరికడుతూ డి అడిక్షన్ కేంద్రాల ద్వారా పూర్తిగా మత్తు పదార్థాల వాడకం నిరోధానికి కృషి చేయాలన్నారు. త్రాగు సాగు నీటి సంరక్షణ పై దృష్టి సారించి వర్షపు నీటిని ఒడిసిపెట్టి నీటిని సమృద్ధిగా నిల్వ చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, ద్వామా పిడి మధుసూదన్ మున్సిపల్ కమిషనర్లు, సిపిఒ మురళీకృష్ణ, డిపిఒ శాంత లక్ష్మీ తదితరులు పాల్గొ న్నారు

# ప్రత్తిపాడు మండలం లో పెన్షన్ సొమ్ము గోల్‌మాల్



ప్రతిపాడు, జులై 31, (ప్రభాతవార్త ): ప్రత్తిపాడు మండల ప్రజా వ్రిక్షత్ వరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ నిమిత్తం విడుదలైన నిధులు పంపిణీ చేయగా మిగిలిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు తిరిగి జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించిన అవినీతి ఘటన వెలుగులోకి రావడం తీవ్ర దుమారం రేపుతోంది. దీనికి సంబంధించి చిన్న శంకర్లపూడి, ఒమ్మంగి, గోకవరం, చింతలూరు, గజ్జనపూడి గ్రామాల్లో సుమారు రూ.14 లక్షల పెన్షన్ సొమ్ము ప్రభుత్వ ఖాతాలోకి జమ చేయకుండా మాయమయ్యిందని తాజా విచారణల్లో తేలింది. గ్రామాల వారీగా దుర్వినియోగ వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న శంకర్లపూడిలో రూ 7,46,250లు,ఒమ్మంగిలో రూ 3,75,000లు,గోకవరంలో రూ 2,03,250లు, చింతలూరులో రూ 1,90,250లు,గజ్జనపూడిలో రూ 45,000 లు గ్రామాల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు ఎంపీడీవో ఇచ్చిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు అందిన 24 గంటల్లో ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆదేశించారు. లేనియెడల క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎండీఓ షోకాజ్ నోటీసులో హెచ్చరించారు.

## మంత్రి క్యాంపు కార్యాలయంలో నెలలో ఒకరోజు లీగల్ సెల్

రామచంద్రపురం, జులై 31, (ప్రభాతవార్త ): రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు ఇకనుంచి ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు అందించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవ తీసుకున్నారు. ప్రముఖ న్యాయవాది లకాని పద్మ కమల కుమారి ఆధ్వర్యంలో గురువారం లీగల్ సెల్ కమిటీ (న్యాయవాదుల బృందం) మంత్రి సుభాష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్,న్యాయవాదులతో పలు అంశాలపై చర్చించారు. నెలలో ఒకరోజు శని లేక ఆదివారాల్లో సమయం కేటాయించి లీగల్ సెల్ బృందం రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రజలకు ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్ణయించారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే మంత్రి క్యాంపు కార్యాలయంలో సంప్రదిస్తే లీగల్ కమిటీ వారికి న్యాయ సహాయం అందిస్తారు. అనంతరం న్యాయవాదుల బృందం కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం గారిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. గోపి,రవి, దొమ్మలపాటి సత్యనారాయణ తదితర న్యాయవాదులు ఉన్నారు.

# ధనికులు, పేదల మధ్య అంతరం తగ్గించడమే పి4 కార్యక్రమ లక్ష్యం

\- కలెక్టర్లతో దృశ్యమాధ్యమ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్





ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జులై 31, (ప్రభాతవార్త ): మార్గదర్శి, బంగారు కుటుంబాల మధ్య అనుబంధం దీర్ఘకాలం ఉండాలని అన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. కలెక్టర్లతో అన్నదాత సుఖీభవ, పి 4, సానుకూల అభిప్రాయ సర్వే (పాజిటివ్ పర్సెప్షన్ సర్వే), నీటి వనరుల పునరుద్ధరణ పథకాలపై గురువారం సాయంత్రం నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పలు సూచనలు చెయ్యడం జరిగింది. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులకి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి సూచనలు చేస్తూ ధనికులకు, పేదలకు మధ్య అంతరాన్ని తగ్గించడమే పి4 కార్యక్రమ లక్ష్యమన్నారు. మార్గదర్శకులుగా ఉండవాని ఒకరిని ఒత్తిడి చేయరాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా ఉండడానికి ఆసక్తి కనబరిస్తే ఆహ్వానించాలన్నారు. మార్గదర్శి, బంగారు కుటుంబాల మధ్య సంబంధం కేవలం అవసరం ప్రాతిపదికన ఉండరాదని, అతి దీర్ఘకాల అనుబంధంగా ఉండాలని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా మార్గదర్శుల్ని, బంగారు కుటుంబాల ఎంపికను గడువులోగా పూర్తి చేయాలన్నారు. సానుకూల ప్రజాభిప్రాయ సర్వే (పాజిటివ్ పర్సెప్షన్ సర్వే) లో సకాలంలో చెత్త తొలగింపు పై సానుకూల అభిప్రాయం వ్యక్తం అయిందని చెప్పారు. అయితే అన్న క్యాంటీన్ల ఆహార నాణ్యత విషయంలో కొంత అసంతృప్తి ఉందని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని చెప్పారు.మహిళలపై నేరాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని, దీనికి తగిన ప్రచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని దానికి అనుగుణంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాలువలు సక్రమంగా ఉన్నాయా, వాటి ద్వారా చెరువులు నిండుతున్నాయా అనే అంశాలను పరిశీలించాలని చెప్పారు. సాగునీటి, మంచినీటి చెరువుల పునరుద్ధరణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగ స్వామ్యంతో అమలవుతున్న ఆర్‌ఆర్‌ఆర్ పథకాని కై జిల్లాల నుంచి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించడం జరిగిందని , అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని కలెక్టర్ ఆదేశించారు. కొవ్వూరు, నిడదవోలులో ఉన్న పురపాలక సమస్యలపై దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలియ చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డిఆర్‌ఓ సీతారామమూర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి%ు% జాయింట్ డైరెక్టర్ అప్పలకొండ, ఎస్ ఈ, మైనింగ్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ రేడియేషన్ కేంద్రానికి బసవతారకం హాస్పిటల్ పూర్తి సహకారం : ఎంపీ సానా సతీష్ బాబు



కాకినాడ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ రేడియేషన్ కేంద్రానికి సాంకేతిక వైద్య సహాయం పూర్తిస్థాయిలో సహకారం అందించడానికి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ , సీఈఓ కె. కృష్ణయ్య తో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అలాగే జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడం వంటి పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించామని ఎంపీ తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి, అందరికీ చేరువగా నాణ్యమైన చికిత్స అందించడమే తమ లక్ష్యమని ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు.

## కాకినాడ రూరల్‌వల్లూరులో రొయ్యల సాగు పై ఆక్వా మీట్

రాజమహేంద్రవరం, జులై 31, (ప్రభాతవార్త ): రొయ్యల సాగు చేసే రైతులకు శాస్త్రీయ సమాచారాన్ని చేరవేసే లక్ష్యంతో ది వాటర్‌బేస్ లిమిటెడ్ సంస్థ వల్లూరులో ఆక్వా మీట్ను నిర్వహించింది. వర్షాకాలంలో కనిపించే వాతావరణ మార్పులు, నీటి నాణ్యతలో గల హెచ్చుతగ్గులు, వ్యాధుల ప్రమాదం వంటి అంశాలపై రైతులు అప్రమత్తంగా ఉండేలా చేయడం ఈ ఆక్వామీట్ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో ది వాటర్‌బేస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శక్తి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాల సవాళ్లను తట్టుకునేందుకు అనుసరించవలసిన మంచి యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఆక్సిజన్ స్థాయి నిర్వహణ, వర్షం సమయంలో ఫీడ్ మోతాదు ను సరిచేసుకుంటూ డిమాండ్ ఫీడింగ్ ఇవ్వడం ద్వారా చెరువు అడుగు భాగం శుభ్రంగా ఉంచడం, మరియు అనుమతి లేని రసాయనాల వినియోగం నివారించటం వంటి కీలక అంశాలను వివరించారు. "వర్షకాల ఒత్తిడి రొయ్యల ఆరోగ్యాన్ని దెబ్బతీసి సాగు నష్టాలకు దారితీస్తుంది," అని పేర్కొన్నారు. "అయితే, సమయానికి సరైన చర్యలు తీసుకుంటే ఈ సమస్యల్ని సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చు. ఆక్వా మీట్‌ల ద్వారా శాస్త్రీయ పద్ధతులను రైతులకు తెలియచేయటమేహా మా లక్ష్యం. అన్నారు. ఈ సందర్భంగా ది వాటర్‌బేస్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ చోళ వర్మ అలూరి మాట్లాడుతూ, "మేము రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు, నిపుణుల సూచనలతో పాటు విశ్వసనీయ ఏ డి సి సేవలను అందిస్తూ వారు హావిజవంతమైన పంట పండించేందుకు, మంచి దిగుబడి సాధించేందుకు మేము సహకరిస్తున్నాము అన్నారు. ఈ సమావేశంలో 140 మందికి పైగా రొయ్యల రైతులు పాల్గొన్నారు. ఈ విధంగా ఆక్వా మీట్ ద్వారా వర్షాకాలం సీజన్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు సాంకేతిక సలహాలు అందించినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. రైతులు వారికున్నసదేహాలను నివృత్తి చేసుకొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ప్రకృతి సాగు, విత్తనాల ఉత్పత్తితో..



విత్తు మంచిదతే పంట కూడా మంచిదవుతుంద'న్న మాటల్ని పక్కాగా పాటిస్తున్నారు గుంటూరు జిల్లా, తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామానికి చెందిన తాడిబోయిన **విజయలక్ష్మి.** ఈమె ఒకప్పుడు టైలరింగ్ చేసేవారు. ఓ పొదుపు సంఘ అధ్యక్షురాలు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు.. వీళ్ల సంఘ సభ్యులకు నిర్వహించిన అవగాహన, క్షేత్ర పరిశీలన తరగతుల తర్వాత ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి 2019 నుంచి వ్యవసాయంలోకి దిగారు. తమకున్న ఎకరాకుతోడు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని ప్రధాన పంటలుగా వరి, మొక్కజొన్న పండిస్తూ, చేను గట్లపైన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పూల సాగును ప్రారంభించారు. రసాయనాలు లేని పంటలకు ఆదరణ పెరిగిన నరకమంలో పొలం గట్టును 4 అడుగుల నుంచి 10 అడుగులకు పెంచుకుని డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి పండ్లకు లవంగాలు, చెక్క, యాలకులు వంటి సుగంధ ద్రవ్యాలను జోడించి మొత్తం మీద 92 రకాల ఉత్పత్తుల సాగుని దఫాల వారీగా చేపట్టారు. రెండు సంవత్సరాల నుంచి ప్రతి పంటలోనూ కొంత భాగం విత్తనాలకు తీస్తూ వస్తున్నారు. అలా 22 రకాల విత్తనాలను తాను వినియోగించుకోవడంతోపాటు ఇతర రైతులకూ అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు విజయలక్ష్మి చేస్తున్న ప్రకృతి సాగు, విత్తనాల ఉత్పత్తి తీరును పరిశీలించి ఆమెను అభినందించారు.

# సాగు, డాక్యుమెంటరీలతో..



రైతులు ఎవరూ వితనతనాలను బయట కొనరు. బేగరి లక్ష్మమ్మ 'సీడ్ బ్యాంక్' ఉండగా వాళ్లకా అవసరం లేదు మరి. 1990ల్లోనే డెక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ సాయంతో 'సీడ్ బ్యాంక్'ను ప్రారంభించారు. ఏళ్లుగా డిడిఎస్‌లో కమ్యూనిటీ వీడియోగ్రాఫర్‌గానూ పనిచేస్తున్నారు. అప్పట్లో ఆడవాళ్లు కెమెరా పట్టుకోవటమంటే ఓ సాహసం. కానీ, లక్ష్మమ్మ ఆ ధైర్యం చేశారు. మహిళా రైతుల కష్టాలు, సాగు పద్ధతులు.. వంటివన్నీ తన కెమెరాలో రికార్డ్ చేస్తూ వారి జీవితాలను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. 300లకు పైగా డాక్యుమెంటరీలను రూపొందించిన లక్ష్మమ్మ.. కెనడా, థాయ్‌లాండ్, జర్మనీల్లో జరిగిన ఫీల్మ్ ఫెస్టివల్స్‌కి వెళ్లే దక్కించుకున్నారు.

# తల్లిపాలు శిశువుకు అమృత తుల్యం



**తల్లిపాల వల్ల కల్గే ప్రయోజనాలపై అవగాహన కల్గించాలని మనం ప్రతి సంవత్సరం ఆగస్టు 1-7వరకు 120 దేశల్లో అంతర్జాతీయ వారోత్సవాలు జరుపుకుంటారు. అవగాహన రాహిత్యం వల్ల చాలామంది తల్లులు తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించలేకపోతున్నారు. దీనికి కుటుంబ సభ్యుల సహకారం, డాక్టర్ల సలహాలు, నర్సింగ్ కేర్ అవసరం. గర్భధారణ, ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యలు రాకుండా ముందే ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల, బ్రెస్ట్ ఫీడింగ్‌పైన ఉన్న అపోహల్ని దూరం చేయడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యం.**

సగానికి పైగా తల్లులు పిల్లలకి సరిగా పాలివ్వ లేకపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 37% శిశువులే ఆరు నెలల వరకు పాలు త్రాగుతున్నారని అంచనా. డబ్ల్యుహెచ్ఓ ప్రకారం ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి.అమెరికాలోని పిడియాట్రిక్స్ అకాడమీ, అమెరికన్ కాలేజ్ ఆఫ్ అబ్సటెనట్రిషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్ సంవత్సరం వరకు వీలైతే 2 సంవత్సరాల వరకు పాలు ఇవ్వడం వల్ల ఆనందకరమైన అనుభూతి తల్లి బిడ్డల మధ్య పెరిగి సెక్యూరిటీ ఫీలింగ్ కల్గుతుందని తెల్పారు. తల్లిపాలను సరిగా ఇవ్వగలిగితే ప్రతి సంవత్సరం 8-10 లక్షల మంది పిల్లల్ని 5 సంవత్సరాల లోపు స్త్రీలలో రొమ్ము కేన్సర్‌తో బాధపడే 20 వేల మందిని మరణించకుండా కాపాడవచ్చు. తల్లి పాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన, తేలికగా జీర్ణమయ్యే పోషకాలుండి వారి శారీరక, మానసిక అవసరాలకు తగినట్లుగా మారుతూ ఉంటుంది. బిడ్డకు అవసరమైన తొలి పోషణ, రక్షణ ఇవ్వాల్సిన తల్లి బాధ్యతని గుర్తు చేయడమే అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశం. ఇది సహజంగా జరిగే ప్రక్రియ కాని కొందరిలో కొన్ని సమస్యలు ఎదురవుతాయి. తల్లి బిడ్డకు పాలిచ్చే ప్రక్రియ 1-7 రోజులు పట్టవచ్చు. కంగారు పడనక్కరలేదు. తల్లిలోని ఆక్సిటోసిన్ హార్మోన్స్ వల్ల క్షీర గ్రంథుల్లోని డక్ట్స్ తెరుచుకోవడం వల్ల ప్రొలాక్టిన్ హార్మోన్ వల్ల ప్రతి ఒక్కరిలో పాలు పడతాయి. అందుకే ప్రసవానికి 3 నెలల ముందే పుట్టబోయే శిశువుకు ఏ విధంగా, ఎన్నిసార్లు, ఎలా పాలు పట్టాలి?ఎన్ని సార్లు మల, మూత్ర విసర్జన చేస్తారు? ఎక్కువ సేపు నిద్రపోవడం, ఎలా త్రాగాలో శిశువుకు తెలియకపోవడం, ఎంతసేపు వీలైతే అంతసేపు స్టిములేషన్ ఇవ్వడం వంటి అనేక సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలి అని కౌన్సిలింగ్ తీసుకోవడం అన్ని విధాలా మంచిది. బ్రెస్ట్ ఫీడింగ్ టెక్నిక్స్‌ని ఓర్పు, నేర్పుతో తెలుసుకోవడం చాలా అవసరం. దీని వల్ల తల్లి బిడ్డ అనుబంధం బాగుంటుంది. నార్మల్ డెలీవరీ అయిన అరగంట గంట లోపు, సిజెరియన్ అయిన 4 గంటలు లోపు వీలైనంత త్వరగా బిడ్డకు తల్లిపాలని ఇవ్వడం ప్రారంభించాలి. చాలా మందిలో పుట్టిన వెంటనే కొన్ని చుక్కల నుండి 10మి.లీ పసుపుపచ్చని ముర్రుపాలు పడతాయి. వీటిలో శిశువుకు కావలసిన ఇమ్యూనిటీని పెంపొందించే ఆంటిబాడీస్ ఉంటాయి. కాన్పు అయిన 2 నుంచి 4 రోజులకి 300-400 మి.లీ. 5వ రోజు నుంచి 500-800 మి.లీ పాలు ఉత్పత్తి అయి వేగంగా పెరిగే బిడ్డ శరీర అవసరాలకు తగినట్లుగా ఉండి శక్తిని అందిస్తాయి. వీటిలో లాక్టోజ్, క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. 5-14వ రోజు వరకు వచ్చే పాలను ట్రాన్సిషనల్ మిల్క్ అంటారు. కాన్పు అయిన 4 వారాల తర్వాత వచ్చే పాలలో 90% నీరు, పిండి పదార్థాలు, విటమిన్స్, మినరల్స్ 2% ప్రోటీన్స్, 8% క్రొవ్వులు, షుగర్స్, ఎంజైమ్స్, హార్మోన్స్, గ్రోత్ ఫ్యాక్టర్స్ ఉండి బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు సాయం చేస్తాయి. చాలా మంది తల్లులు తమ పిల్లలకు సరిపోయేన్ని పాలు ఇవ్వలేకపోతున్నాయని మధన పడిపోతుంటారు. కారణం అనారోగ్య సమస్యలు, ఒత్తిడి, బాడీ డీ హైడ్రేషన్, ప్రసవం




తర్వాత ఎక్కువగా నిద్రపోవడం సరైన ఆహారం తీసుకోక పోవడం, పథ్యం ఉండడం కారణం. తల్లిపాలు పడడానికి మాత్రలు, మందులు మింగడం కంటే ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం తీసుకుంటే చాలు. తల్లిపాలు సమృద్ధిగా పడతాయి. ఒక రొటీన్‌లో పడేంత వరకు ప్రయత్న లోపం లేకుండా నర్సింగ్ డిమాండ్‌ని బట్టి రోజుకి 8-10 సార్లు తల్లిపాలు ఇవ్వవచ్చు. తల్లి పాలు తాజాయైన సమతుల్య ఆహారం తలిపాలు శిశువుకి సురక్షితం. తల్లిపాల ఉత్పత్తి సరఫరా ప్రక్రియను ఇంగ్లీష్‌లో టైలర్ మేడ్ అంటారు. ప్రకృతి సిద్ధమైన పాలని నవజాత శిశువులకు ఎప్పుడు ఏది అవసరమో అది తల్లుల ద్వారా అందించడం చాలా అవసరం. ఇలా చాలా అంశాలపై అవగాహన కల్పించటానికే తల్లి పాల వారోత్సవాల్ని వారం రోజులు (మొదటి వారం చాలా ముఖ్య' ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, మహిళ సంఘులు కలిసికట్టుగా ప్రపంచవ్యాప్తంగా చేయడయే దీని ముఖ్య ఉద్దేశ్యం. మనం కూడా మన వంతు సాయంగా స్త్రీలలోనే అందరిలో అవగాహన కల్పిద్దాం.

**- డాక్టర్ కె.ఉమాదేవి**

# అంజీర్ తింటున్నారా?

**బలహీనంగా ఉన్నవారు అంజీర్ తింటే కొన్ని రోజుల్లోనే ఆశించిన మార్పు వస్తుంది అంటారు డాక్టర్లు. ఎందుకంటే..** అంజీర్‌లో పీచు, ఎ,బి,సి,ఇ,కె విటమిన్లు, సోడియం, పొటాషియం, మెగ్నీసియం, మాంగనీస్, కాల్షియం, జింక్, ఫొలేట్, రిబోఫ్లేవిన్, భాస్వరం విస్తారంగా ఉన్నాయి మరి. అంజీర్ రక్తపోటును అదుపులో ఉంచుతుంది.



కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఊపిరితిత్తుల్లో సమస్యలు, శ్వాసలో ఇబ్బందులను తొలగిస్తుంది. ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతుంది. ఫైల్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నిద్రలేమిని దూరం చేస్తుంది. జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. చర్మానికి కాంతి వస్తుంది, ముడతలు పడదు. అల్జీమర్స్‌తో బాధపడేవారు వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల ప్రయోజనం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని అలాగే తినొచ్చు. మిల్క్ షేక్, హల్వా లాంటివీ చేసుకోవచ్చు. అంజీర్‌ను ముందు రోజు రాత్రి నీళ్లలో నానబెట్టి, మర్నాడు పరగడుపున ఆ నీళ్ల పారబోసి తింటే చాలా మంచిది. రోజుకు రెండు లేదా మూడు వరకూ తినొచ్చు. వీటితో ఆకలి తీరి, శక్తిన కలుగుతుంది కనుక ఇంకా తినాలనే ఆరాటం ఉండదు. దాంతో ఊబకాయం నుంచి తప్పించుకున్నట్లవుతుంది. ఇన్ని లాభాలు ఉన్నప్పటికీ మధుమేహంతో బాధపడుతున్న వారు, అలర్జీ సమస్య ఉన్నవారు అంజీర్ తినకపోవడమే మంచిది.

# మొక్కజొన్న ఉప్మా

**చిటపట చినుకులు పడుతుంటే.. వేడి వేడిగా, కారం కారంగా ఏదైనా తినాలపిస్తుంది కదూ! మొక్కజొన్న కండెలు కాల్చుకుని, కాస్త ఉప్పు, నిమ్మరసం అద్ది తినాలనిపించ డం కూడా సహజమే! అనేక పోషకాలున్న మొక్కజొన్నను ఏదో రూపంలో తినమని నిపుణులు కూడా చెబుతున్నారు. కాబట్టి కొంచెం ఉప్మా చేసుకుందామా... వీటితో ఉప్మా ఏమిటని ఆశ్చర్యపోతున్నారా? చాలా రుచిగా ఉంటుంది... ఎలా చేయాలో చూడండి.**



కావలసినవి. లేత మొక్కజొన్న కండెలు 4 ఉల్లిపాయ 1, పచ్చిమిరపకాయలు రెండు, నూనె 3 చెంచాలు, ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర అరచెంచా చొప్పున, ఎండుమిర్చి1. కరివేపాకు రెండు రెబ్బలు, కొత్తిమీర గుప్పెడు, ఉప్పు రుచికి సరిపోతుంది

**తయారీ:** ఉల్లి, పచ్చిమిర్చిలను తరిగి ఉంచాలి. మొక్కజొన్న కండెలను కార్న్ కట్టర్తో లేదా చేత్తో గింజలు ఒలుచుకోండి. అవి సుమారుగా రెండు కప్పులు అవుతాయి వాటిని మిక్సీజార్లో వేసి నీళ్ల పోయకుండా పల్స్ బటన్ ప్రెస్ చేసి రెండుసార్లు తిప్పుకోవాలి. ఎక్కువగా తిప్పితే పిండిలా అయిపోతుంది. కొంచెం గింజలు నలిగితే చాలు అప్పుడు రవ్వలా ఉంటుంది. గింజలు మరీ లేతగా ఉంటే కొంచెం ముద్దగా అవుతుంది. మరేమీ పర్వాలేదు కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిలతో తాలింపు వేయాలి. అవి వేగాక.. నిలువుగా కోసిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేయాలి. అవి కాస్త రంగు మారాక మొక్కజొన్న రవ్వ, ఉప్పు వేసి కలిపి, మూత పెట్టేసి సన్నని సెగ మీద కాసేపు మగ్గనివ్వాలి. ఐదు నిమిషాల తర్వాత ఒకసారి మొత్తం కలిపి కొత్తిమీర వేసి మళ్ళీ మూత పెట్టాలి. మెత్తగా ఊడిందను కున్నాక దంచితే.. పోషకాల మొక్క జొన్న ఉప్మా రెడీ! ఇదెంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఒకసారి చేసి చూడండి.

# పిల్లలకు ఈ నైపుణ్యాలున్నాయా!

**పిల్లలను తల్లి తన స్నేహితులు, బంధువులింటికి తీసుకెళుతుంటుంది. ఇంట్లో సాధారణంగానే ఉండే తను, తీరా బయటకెక్కడికెళ్లినా ఎక్కువగా మాట్లాడటం లేదా అక్కడ తన అల్లరితో వస్తువులన్నీ చిందరవందర చేస్తుంటాడు. ఇంట్లో మాత్రమే కాదు. బయట కూడా ప్రవర్తనా నైపుణ్యాలను పిల్లలకు అలవడేలా చేయాలంటున్నారు నిపుణులు.**



✦ పిల్లలని ఎక్కువగా గ్రూపు యాక్టివిటీస్‌లో పాల్గొనేలా చేయాలి. చదువుకు భంగం కలుగుతుందంటూ పిల్లలను ఇంట్లోనే బంధించకూడదు. తోటివారితో కలిసే పిల్లల్లో సామాజికపరమైన నైపుణ్యాలు పెరుగుతాయంటోంది అబ్‌నార్మల్ చైల్డ్ సైకాలజీ జర్నల్‌లో ప్రచురించిన ఓ అధ్యయనం వారాంతాల్లో జరిగే యాక్టివిటీస్‌లో క్రమం తప్పకుండా పిల్లలు ఉండేలా చేయాలి.

✦ తోటి పిల్లలతో క్రికెట్, సైక్లింగ్, రన్నింగ్, గాలి పటాలు ఎగుర వేయ డం వంటివి ఆడినప్పుడు క్రమ శిక్షణ మాత్రమే కాదు, అందరితో కలిసి ఉన్న ప్పుడు సమయ పాలన, సమయ స్ఫూర్తి పిల్లలు నేర్చుకుం టారు. గుంపులో తనూ ఒకరుకావ డమే కాదు, వారందరినీ తనతో కలుపుకోవడం వల్ల కలిగే సంతృప్తి అంటే ఏంటో అర్థం చేసుకుంటారు. ఇదే వారికి ఎక్కడ, ఎవరితో ఎలా ప్రవర్తిం చాలో నేర్పు తుంది.

✦. స్కూల్ లేదా మైదానంలో కొత్తగా కలిసినవారితో తమని తాము పరిచయం చేసుకోవడం, వారితో కలిసి చదవడం లేదా ఆడుకోవ డమెలాగో చెప్పాలి. పేరెంట్ మీటింగ్స్‌లో అందరితో పరిచయాలు చేసుకోవడం, చేయి కలిపి ఎదుటివారితో నవ్వుతూ మాట్లాడటం వంటివి పెద్దవాళ్లు చేస్తే, వారి నుంచి పిల్లలూ నేర్చుకుంటారు. మంచి స్నేహితులను సంపాదించుకోవడానికి ఇది దోహదపడుతుంది.

✦ ఆటలో గెలిచినవారిని ప్రశంసించడం, తాము ఓడిపోయినా తిరిగి ప్రయత్నించొచ్చనే సానుకూలతను పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పించాలి. దీంతో గెలుపొందిన వారిపై ద్వేషం, అసూయవంటివి ప్రదర్శించరు. అలాగే ఇతరులు చెప్పేది పూర్తిగా వినడం పిల్లలకు పేర్పించాలంటే ముందు వాళ్లు చెప్పేది తల్లిదండ్రులు శ్రద్ధగా వినాలి. అప్పుడే పిల్లలు కూడా ఆ నైపుణ్యాన్ని అలవరుచ ుకుంటారు.

✦ పుట్టినరోజు వంటి సందర్భాల్లో స్నేహితులందరినీ పిలవడం నేర్పాలి. ఆ పార్టీలో ఇంటికొచ్చినవారితో ఎలా మెలగాలో తెలుసుకుంటారు. ఇతరుల పట్ల మర్యాదపూర్వకమైన ప్రవర్తన, ప్లీజ్, సారీ వంటి పదాల వినియోగం అలవడుతుంది. ఇలాంటి సత్ప్రవర్తన వారికి భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది.జీవితంలో అనుకునన లక్ష్యాలను చేరుకొనేలా చేస్తుంది.

# అతి నిద్రతో బాధపడుతున్నారా?



**నిద్ర పట్టక కొంతమంది బాధపడితే, మరికొందరు అతి నిద్రతో సతమతమవుతుంటారు. అయితే నిద్ర తక్కువైనా, ఎక్కువైనా ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వయసును బట్టి ఎవరికి ఎన్ని గంటలు నిద్ర అవసరమో, ఒకవేళ అతి నిద్ర సమస్యతో బాదపడుతు న్నట్లయితే దానికి అధిగమించడమెలాగో తెలుసుకుందాం..**

**ఎవరికి ఎన్ని గంటలు ....** వయసును బట్టి నిద్ర సమయాలు తెలుసుకుంటే అతి నిద్రకు అడ్డుకట్ట వేయచ్చంటున్నారు నిపుణులు. తద్వారా ఎన్నో అనారోగ్యాలకు దూరంగా ఉండచ్చంటున్నారు. కొన్ని పరిశోధనలు ప్రకారం ఎవరికి ఎన్ని గంటలు నిద్ర అవసరమంటే..

**అప్పడే పుట్టిన పిల్లలు:** 14-17 గంటలు. ఏడాది లోపు చిన్నారులు : 1215 గంటలు, 1-2 ఏళ్ల వయసున్న వారు : 11-14 గంటలు, 3-5 ఏళ్ల వయసున్న వారు: 10-13 గంటలు. స్కూలు కెళ్లే పిల్లలు (6-12 ఏళ్ల ) 9-11 గంటలు, టీనేజర్లు (13-19 ఏళ్లు) 8-10 గంటలు, పెద్దలు: 7-9 గంటలు. వృద్ధులు : 7-8 గంటలు.



**ఇలా చెక్ పెట్టచ్చు...** ఈ క్రమంలో ఒకవేళ అతి నిద్ర సమస్యతో బాదపడుతున్నట్లయితే రోజువారీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం అత్యవసరం అంటున్నారు నిపుణులు.

*. రోజూ ఒకే తరహా నిద్ర సమయాల్ని పాటించాలి. అంటే. వారాంతాలు సెలవు రోజుల్లో కూడా నిర్ణీత వేళ్లకే నిద్ర లేవాలన్న మాట!

*. కొంతమందికి రాత్రుళ్లు సరిగ్గా నిద్ర పట్టక ఉదయం ఆలస్యంగా లేస్తుంటారు. అలాంటి వాళ్లు నిద్రకు ఉపక్రమించేలా పడకగదిలో ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే నిద్రా భంగంచేసే ఎలక్ట్రానిక్ పరికరాలను దూరం పెట్టాలి.

*. కెఫీన్‌కు నిద్రను భంగం చేసే లక్షణముంది. కాబట్టి కాఫీ, టీ వంటివి పడుకునే ముందు అస్సలు తాగకూడదు.

*. మధ్యాహ్నం ఎక్కువసేపు పడుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు నిద్ర పట్టదు. తద్వారా గంటల తరబడి నిద్రపోవడానికి శరీరం అలవాటు పడుతుంది. కాబట్టి పగలు అరగంటకు మించి కునుకు తీయకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.



* వ్యాయామాలవల్ల ఆరోగ్యమే కాదు. నిద్ర సమయాలు కూడా అదుపులో ఉంటాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో శరీరం అలసిపోయి తద్వారా నిద్రలేమిని కూడా అధిగమించచ్చు.

* అలాగే ఆహారంలోనూ పలు మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. సుఖ నిద్రను ప్రేరేపించే పాలు, పాల పదార్థాలు, బాదం, కివీ పండ్లు, చామొమైల్ టీ. వంటివి తరచూ తీసుకోవడం మంచిది. వీటితో పాటు మానసిక ఆందోళనలు, ఒత్తిళ్లను దూరం పెట్టడమూ ముఖ్యమే! అయితే ఇన్ని చేసినా అతి నిద్రను దూరం చేసుకోలేకపోయినా, ఇతర అనారోగ్యాలు వేధిస్తున్నా.. వెంటనే సంబంధిత నిపుణుల్ని సంప్రదిస్తే సమస్య తీవ్రం కాకుండా జాగ్రత్తపడచ్చు.

# పద్మమే ఎందుకు?

ఆధ్యాత్మికం

పూలు లేకుండా ఏ పూజా పూర్తి కాదు. అందులోనూ శ్రావణ శుక్రవారం నాడు ఎంతో భక్తితో చేసుకునే పూజలో చామంతులూ మందారాలూ గులాబీలూ..ఇలా ఎన్నో రకాలు ఉంటాయి. వాటిల్లో తామరలూ తప్పనిసరిగా కనిపిస్తాయి. బంతిపూల దండలూ, మామిడాకుల తోరణాలూ, బ్యాక్‌డ్రప్ అలంకరణలూ.. ఇలా ఎన్ని ఉన్నా అరవిరిసిన పద్మాలు ఉంటేనే ఆ వరలక్ష్మీదేవి శోభాయమానంగా కనిపిస్తుంది. సిరులు కురిపించే ఆ శ్రీమహాలక్ష్మి పుట్టింది ఈ తామరపువ్వులోనే, అందుకే ఆమెకు ఈ పూలంటే ఎంతో ఇష్టమట. అంతేకాదు, ఈ పుష్పాలను సంతాన సామర్థ్యానికీ, అంతులేని సంపదకీ ప్రతిబింబగానూ భావిస్తారు. ముఖ్యంగా తామరపువ్వు.. ఆధ్యాత్మికతను ప్రబోధిస్తుంది. అంతర్గత శక్తి, ప్రశాంతత, స్వచ్ఛతలని సూచిస్తుంది. బురదలో పుట్టినా అందమైన పద్మంగా వికసించి..తన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచంమీద విజయాన్ని సాధిస్తుంది. దీని ద్వారా భవబంధాలకు అతీతంగా అసలైన ఆనందానికి మూలమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. అన్న విషయాన్ని చెప్పకనే చెబుతోంది. ఆ కారణంతోనే ఈ పవిత్ర పుష్పాలతో ఆ మహాలక్ష్మిని కొలుస్తారు.



# వ్యాపారమా.. ఉద్యోగమా?



**ఉద్యోగం, వ్యాపారం ఒకేసారి చేయడం లాభం,** సురక్షితం అని మీకు అనిపించవచ్చు. కానీ, దానివల్ల ఒక్కోసారి మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చు. ఇలా రెండు పనులు ఒకేసారి చేసేకంటే ఏదో ఒక దానిమీదనే సమయం వెచ్చించడం మంచిది. ఒకవేళ మీరు వ్యాపారంలోనే కొనసాగాలి అనుకుంటే ముందుగా కొన్ని విషయాలు ఆలోచించుకోండి. మీ వ్యాపారం పట్ల మీకు ఎంత పాషన్ ఉంది? అందులో వచ్చే లాభనష్టాలను భరించగలరా? క్లిష్టపరిస్థితుల్లో గైడ్ చేయడానికి మెంటార్లు ఉన్నారా? మార్కెటింగ్, ఫైనాన్స్ వంటి విషయాలపై మీకు ఎంత పరిజ్ఞానం ఉంది? కొత్తగా ఎంత వరకూ నేర్చుకోగలరు? కుటుంబ మద్దతు ఎంతవరకూ ఉండొచ్చు? లాంటివీ ఆలోచించుకోండి. పైగా వ్యాపారమంటే నిర్ణీత సమయాల్లోనే పని ఉండదు. కాబట్టి, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోండి.

# తెర

## కొత్త నేషనల్ క్రష్



భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు కుర్రాళ్ల కొత్త నేషనల్ క్రష్. గతేడాది మాస్ మహరాజా రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. కానీ అందరి దృష్టిని ఆకర్షించింది ఈ అమ్మడు. చూడచక్కని అందం.. మత్తెక్కించే కళ్లు.. చక్కటి చిరునవ్వుతో కట్టిపడేస్తుంది. ఫస్ట్ మూవీతోనే డిజాస్టర్ అందుకున్న ఈ అమ్మడు.. ఇప్పుడు రెండో సినిమాతో హిట్టుకొట్టింది. తాజాగా ఈ అమ్మడు లేటేస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. తొలి చిత్రంలోనే గ్లామర్ షోతోపాటు అభినయంతో కట్టిపడేసింది ఈ వయ్యారి. కానీ ఫస్ట్ మూవీ డిజాస్టర్ కావడంతో ఆమెకు పెద్దగా హెల్ప్ కాలేదు. అయితే తెలుగులో నెమ్మదిగా ఆఫర్స్ మాత్రం అందుకుంది. ప్రస్తుతం చేతిలో నాలుగైదు సినిమాలతో బిజీగా ఉంది. మిస్టర్ బచ్చన్ తర్వాత ఈ అమ్మడు నటించిన కింగ్డమ్ సినిమా విడుదలైంది. జూలై 31న అడియన్స్ ముందుకు వచ్చిన ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. అంతేకాదు.. ఈ మూవీ ప్రమోషన్లలో గ్లామర్ లుక్స్‌లో కట్టిపడేసింది భాగ్యశ్రీ. దీంతో ఈ అమ్మడు ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. కొత్త నేషనల్ క్రష్ అదిరిపోయిందంటూ భాగ్యశ్రీ ఫోటోస్ షేర్ చేస్తున్నారు ఫ్యాన్స్. ప్రస్తుతం రామ్ పోతినేని సరసన నటిస్తుంది. అలాగే దుల్కర్ సల్మాన పక్కన కాంత అనే చిత్రంలో నటిస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ ఫోటోస్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి.

## ప్లీజ్ మేమ్..



హీరో నారా రోహిత్ తన మైల్ స్టోన్ 20వ మూవీ సుందరకాండతో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్‌బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ మేకర్స్ ప్లీజ్ మేమ్ సాంగ్ ని రిలీజ్ చేశారు. ప్లీజ్ మేమ్ సాంగ్ మోడ్రన్ బీట్‌లతో పాటు తెలుగుదనం కూడా మిక్స్ అయి క్యాచీ, క్రేజీగా వుంది. శ్రీహర్ష ఇమాని రాసిన లిరిక్స్ ఫన్ ఫుల్‌గా పాటకి పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యాయి. వీడియోలో హీరో తన ఫ్రెండ్స్‌తో కలిసి శ్రీదేవిని ఇంప్రెస్ చేయడానికి చేసే ప్రయత్నాలు సరదాగా వున్నాయి. అర్జున్ చాందీ, దీపక్ బ్లూ, అరవింద్ శ్రీనివాస్, సాయిశరణ్, రేష్మా శ్యామ్, హరిప్రియా, లవితా లోబో కలిసి పాడిన ఈ పాట అదిరిపోయింది. అందరి వాయిస్ మిక్స్‌తో పాటకి ఎనర్జీ రెట్టింపు అయ్యింది. విశ్వరఘు చేసిన కొరియోగ్రఫీ స్టైలిష్‌గా వుంది. నారా రోహిత్ - శ్రీదేవి విజయ్ కుమార్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా వుంది. ప్లీజ్ మేమ్ పాట సినిమా ఆల్బమ్‌కి ఫ్రెష్ అండ్ ఫన్ టచ్ ఇచ్చి బ్యూటిఫుల్ ట్రాక్‌గా నిలిచింది. ఈ చిత్రంలో వృతి వాఘాని కథానాయికగా నటించారు. గణేష్ చతుర్థి సందర్భంగా ఆగస్టు 27న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి ప్రదీప్ ఎం. వర్మ సినిమాటోగ్రఫీ అందించగా, రాజేష్ పెంటకోట ఆర్ట్ డైరెక్టర్‌గా, సందీప్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత., తారాగణం: నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్షి ్మ, సునైనా, రఘు బాబు.

## యుగానికే ప్రయాణమే




బాలు నాయుడు, ఆశా సుదర్శన్ జంటగా నటించిన సస్పెన్స్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ అరణ్య ధార. కొత్త కంటెంట్‌ను ఆదరించేందుకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అందులోనూ మైథలాజికల్ టచ్ ఉన్న సినిమాలని ఇప్పుడు ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఆ నమ్మకంతో సిల్వర్ స్క్రీన్ షాట్స్ బ్యానర్ పై నిర్మాత బాలు నాయుడు అండ్ టీం అరణ్య ధారని రూపొందించారు. దర్శక ద్వయం శివ పచ్చ, బాలు నాయుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే విధంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్టు వెల్లడించారు మేకర్స్. తాజాగా ఖిఅరణ్య ధారఖి నుండి ఫస్ట్ సింగిల్‌గా యుగానికే ప్రయాణమే అనే పాటను ప్రముఖ సంగీత దర్శకుడు, సింగర్ అయినటువంటి రఘు కుంచె చేతుల మీదుగా లాంచ్ చేశారు. రవి నిడమర్తి సంగీతంలో రూపొందిన ఈ పాటని అమన్ సిద్ధికి ఆలపించగా బాలు నాయుడు సాహిత్యం సమకూర్చడం మరో విశేషంగా చెప్పుకోవాలి. సాంగ్ లాంచ్ అనంతరం రఘు కుంచె మాట్లాడుతూ యుగానికే.. అనే పాటలో నేచర్‌ని బాగా చూపించారు. అలాగే బాగా షూట్ చేశారు కూడా. వింటున్నప్పుడు చాలా హార్ట్ టచింగ్‌గా అనిపించింది. ఇందులో హీరో ఒక ఫోటోగ్రాఫర్ అని తెలిపారు.

## అయ్యోరామ అప్పుడే ఓటిటికి..

సుహాస్ హీరోగా ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన చిత్రం ఓ భామ అయ్యో రామ. ఈ చిత్రంతో మలయాళ బ్యూటీ మాళవిక మనోజ్(జో ఫేమ్) టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా కెరీర్, మదర్ సెంటిమెంట్‌తో కూడిన లవ్‌స్టోరీగా రూపొందిన ఈ సినిమాకు రామ్ గోధల దర్శకత్వం వహించగా హరీష్ నల్ల నిర్మించారు. జూలై 11న ప్రేక్షకుల ఎదుటకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనను దక్కించుకుంది. ఇప్పుడీ సినిమా 20 రోజుల్లోనే డిజిటల్ స్ట్రీమింగ్ బాట పట్టింది. రామ్ (సుహాస్) చిన్నతనంలోనే తల్లి (అనిత)ను కోల్పోతాడు. తండ్రి (రవీంద్ర విజయ్) దగ్గరకు తీయక పోవడంతో మేనమామ (అలీ) రామ్ బాధ్యత తీసుకుంటాడు, ఏ లోటు లేకుండా చూసుకుంటాడు. అయితే రామ్ ఎప్పటికైనా సినిమా దర్శకుడు కావాలనేది అతని తల్లి కల. కానీ రామ్ సినిమాలకు దూరంగా చదువుల కోసం ఫారెన్ వెళ్లాలనుకుంటాడు. సత్యభామ (మాళవిక మనోజ్) రాకతో రామ్ జీవితం మారుతుంది. అమ్మ లేని లోటును తీరుస్తుంది. ఆమె రాక అతనిలో ఎలాంటి మార్పు తెచ్చింది. సినిమాలకు దూరంగా ఉండే రామ్ డైరెక్షన్ వైపు ఎందుకు అడుగులు వేశాడు? రామ్, సత్యభామల ప్రేమ కథ కంచికి చేరిందా లేదా? అన్నది కథ. సింపుల్ కాలేజీ కుర్రాడి కథగా మొదలై ప్రేమ, భావోద్వేగాల వైపు నడుస్తుంది. ఫస్టాఫ్ అంతా రొటీన్ కథగా సాగుతుంది. సెకండాఫ్ నుంచి కథ సీరియస్ ట్రాక్‌లోకి వెళ్తుంది. మేనల్లుడి మీద బాధ్యతగా వ్యవహరించే అలీ పాత్ర ఎమోషన్‌గా సాగడం, సెంటిమెంట్ బాగా వర్కవుట్ అయింది. మదర్ సెంటిమెంట్ టచ్, కొన్ని చోట్ల ఫన్, ఎమోషన్ సీన్లు బాగా వర్కవుట్ అయ్యాయి. రొటీన్‌గా కాకుండా ట్విస్ట్‌తో కథను ముగించిన విధానం ఆకట్టుకుంటుంది.. ఇప్పుడీ సినిమా సడన్‌గా ఈ టీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్కు వస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి షాక్ ఇచ్చారు. మూవీలో ఎక్కగా అసభ్యకర సన్నివేశాలు లేవు. ఫ్యామిలీ, సెంటిమెంట్ సినిమా చూడాలనుకునే వారు ఈ చిత్రాన్ని తప్పక ప్రయత్నం చేయవచ్చు.



## తెలుగులోనూ యానిమేషన్ మూవీ



యానిమేషన్ ఫీచర్ ఫిల్మ్స్‌ను రూపొందించడంలో వాల్ట్ డిస్నీ యానిమేటెడ్ స్టూడియోస్‌కి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ సంస్థ తాజాగా తన 64వ యానిమేటెడ్ మూవీని జనం ముందుకు తీసుకురాబోతోంది. అడ్వంచరస్ యానిమేటెడ్ మూవీ జూటోపియా 2ను ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో నవంబర్ 28న విడుదల కాబోతోంది. భారతదేశంలోనూ ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ మూవీ తెలుగు ట్రైలర్ ను నిర్మాణ సంస్థ విడుదల చేసింది.

## ఊపిరి ఊయలగా.. ఉప్పొంగిన ప్రేమ



బాలీవుడ్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న వార్ 2. ఈ సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్.. నువ్వా నేనా అన్నట్లుగా తల పడనున్నారు. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ లో.. యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన చిత్రాలలో అత్యంత ఖరీదైన సినిమాగా ఇది నిలుస్తుందని పలువురు భావిస్తున్నారు. దాదాపు రూ.400 కోట్లకు పైగా బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొం దుతోందని సమాచారం. ఇందులో బాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

దర్శకుడు అయాన్ ముఖర్జీల తెరకెక్కిస్తోన్న ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. 2023 అక్టోబర్‌లో ప్రారంభం అయిన ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎక్కువగా ముంబైలో ఈ మూవీ షూటింగ్ చేస్తున్నారు. అలాగే స్పెయిన్, అబుదాబి, ఇటలీలో కొన్ని షెడ్యూల్స్ చేశారు. కాగా ఈ సినిమాను డాల్బీ అట్మాస్ సౌండ్‌తో రిలీజ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్లకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన వచ్చింది. ఇందులో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఊరమాస్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఇందులో హృతిక్ రోషన్ మేజర్ కబీర్ ధలీవాల్ పాత్రలో.. జూనియర్ ఎన్.టి.ఆర్ వీరేంద్ర రఘునాథ్ పాత్రలో కనిపించనున్నారు. ఇక అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ సినిమా ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ మరో అదిరిపోయే అప్డేట్ అందించారు. తాజాగా ఈ మూవీ నుంచి మరో సాంగ్ ను రిలీజ్ చేశారు. ఊపిరి ఊయలగా అనే రొమాంటిక్ సాంగ్ తాజాగా విడుదలైంది. ఈ సాంగ్ సినిమాపై మరింత అంచనాలను పెంచింది. ఇందులో హృతిక్ రోషన్, అందాల తార కియారా అద్వానీ నటించారు. ఈ పాటలో వారిద్దరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పండింది. పాటలోని లోకేషన్స్ చాలా అందంగా, ఆకట్టుకునేలా ఉన్నాయి. చంద్రబోస్ మనసుకు హత్తుకునే సాహిత్యం అందించాగా.. శ్రావ్యమైన గాత్రాలతో శశ్వంత్ సింగ్, నిఖితా గాంధీ ఆలపించారు.

## నల్లకోడితో.. చేతబడి



క్షుద్ర విద్యలను సైన్స్ కొట్టి పారేస్తుంది. కానీ కొంతమంది మాత్రం దీనిని నమ్ముతూ ఉంటారు. చేతబడి, బాణామతి ద్వారా వ్యక్తులను తమ అధీనంలోకి తెచ్చుకోవచ్చని భావిస్తున్నారు. ఆ నేపథ్యంలోనే రాబోతోంది చేతబడి సినిమా. శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్‌పై నంద కిషోర్ నిర్మిస్తున్న ఈ సినిమా ద్వారా సూర్యాస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. నిజ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. కథను గురించి దర్శకుడు సూర్యాస్ మాట్లా డుతూ, చేతబడి అనేది 16వ శతాబ్దంలో మన ఇండియాలో పుట్టింది. రెండు దేశాలు కొట్టుకోవాలన్నా, రెండు దేశాలు కలవాలన్నా .. ఒక బలం, బలగం కావాలి. కానీ ఒక ఈవిల్ ఎనర్జీతో మనిషిని కలవకుండానే చంపే విద్యే చేతబడి! అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా భిన్నంగా చూపిస్తున్నాం. మన బాడీలో ప్రతిదానికి ప్రాణం ఉంటుంది. జుట్టుకు కూడా ప్రాణం ఉంటుంది. ఆ వెంట్రుకల మీద ఈ సినిమా ఆధారపడి ఉంది. 1953 గిరిడ అనే గ్రామంలో రియల్‌గా జరిగిన యదార్థ సంఘటనను ఆధారంగా చేసుకుని ఈ కథను సిద్ధం చేశాం. సీలేరు అనే గ్రామంలో 200 సంవత్సరాల క్రితం వెదురు బొంగులు చాలా లావుగా ఉండేవి. వర్షం పడినా అవి నెలలోకి దిగేవి కావు. అలాంటి మట్టిలో బతికున్న నల్లకోడిని పెట్టి అమావాస్య రోజు బాణామతి చేస్తే ఎలా ఉంటుంది? అనేది ఇందులో చూపించబోతున్నాం అని చెప్పారు. నిర్మాత నందకిషోర్ మాట్లాడుతూ, ఒకప్పుడు బాణామతి భయం వల్ల రాజకీయ, సామాజిక, మానసిక సమస్యలు తలెత్తాయి. ప్రజల అమాయకత్వాన్ని కొందరు ఆసరాగా చేసుకుని పబ్బం గడుపుకున్నారు. ఆ సంఘటనలను ఈ సినిమాలో రియలిస్టిక్‌గా చూపించబోతున్నాం అని అన్నారు. ఈ సినిమాకు అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నాడు.

## హ్రీం షూటింగ్ షురూ



పవన్ తాత, చమిందా వర్మ జంటగా నటిస్తోన్న నూతన చిత్రం హ్రీం. రాజేశ్ రావూరి ఈ చిత్రంతో దర్శకునిగా మారనున్నారు. శివమ్ మీడియా పతాకంపై శ్రీమతి సుజాత సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ప్రముఖ హీరో సందీప్‌కిషన్ క్లాప్‌నివ్వగా నటులు అలీ, బెనర్జీ, తెలుగు రాష్ట్రాల్లో టాప్ ఆడిటర్‌గా ఉన్న విజయేంద్రరెడ్డి, సినిజోష్ అధినేత రాంబాబు పర్వతనేని దర్శకుడు రాజేశ్‌కి స్క్రిప్ట్‌ని అందించారు. నటులు రాజీవ్ కనకాల కెమెరా స్విఛాన్ చేశారు. చిత్ర ప్రారంభోత్సవం తర్వాత సందీప్ కిషన్ మాట్లాడుతూ.. నా తొలి చిత్రం నుండి ఈ చిత్ర నిర్మాతతో పరిచయం ఉంది. ఆయన తీస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ హ్రీం చిత్ర నిర్మాతలు శివమల్లాల, సుజాతలు నాకు కుటుంబ సభ్యులు.. వారు నిర్మించ తలపెట్టిన ఈ చిత్రం మంచి విజయం సాధించాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా అన్నారు. నటుడు బెనర్జీ మాట్లాడుతూ ఈ సినిమాలో నేను చాలా మంచి పాత్రలో నటిస్తున్నా అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ ఈ చిత్రంలో చాలా కీలకమైన పాత్ర పోసిస్తున్నాను. హ్రీం చిత్ర హీరోయిన్ చమిందా వర్మ నటే కాదు. దుబాయ్ నుండి తెలుగులో నటించటానికి వచ్చిన తెలుగమ్మాయి. ఆమె డాక్టర్ కూడా. ఈ చిత్రంలో నటిస్తున్న పవన్ తాతా, దర్శకుడు రాజేశ్ నాకు ముందునుండి పరిచయం ఉంది. వారిద్దరికి ఎంతో టాలెంట్ ఉంది. ఇప్పుడు నాకు 50 ఏళ్లు. నాకు 25 ఏళ్లున్నప్పటినుండి హ్రీం చిత్ర నిర్మాత శివ మల్లాల నాకు తెలుసు. ఈ సినిమా పెద్ద స్థాయిలో విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సినిమా ప్రారంభోత్సవంలో దర్శక-రచయిత జనార్ధనమహర్షి, నిర్మాత కె.బాబురెడ్డి, తమిళ నిర్మాత జి.సతీష్ కుమార్, ట్రెండింగ్‌లవ్ దర్శకుడు హరీష్ నాగరాజ్, బహిష్కరణ చిత్ర దర్శకుడు ముకేష్ ప్రజాపతి, ప్రముఖ ఇన్ఫ్లుయెన్సర్ బెజవాడ బేబక్క, వనిత, శ్రీవాణి త్రిపురనేని తదితరులు పాల్గొన్నారు.

## నాగవంశీ నమ్మకం నిజమైంది



ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులంతా ఎంతగానో ఎదురుచూసిన కింగ్‌డమ్ చిత్రం థియేటర్లలో అడుగుపెట్టింది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా కథానాయకుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ కింగ్‌డమ్ సినిమాకి వస్తున్న స్పందన పట్ల మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. యూఎస్ ప్రీమియర్ల నుంచే పాజిటివ్ టాక్ వచ్చింది. రాత్రి నుంచి ఫోన్లు వస్తూనే ఉన్నాయి. చాలా మంది ఫోన్ చేసి అన్నా మనం హిట్ కొట్టినం అని ఎమోషనల్ అవుతున్నారు. మీ అందరి ప్రేమ వల్లే ఈ విజయం సాధ్యమైంది. నా తెలుగు ప్రజలు నా వెనుక ఎంత ఉన్నారో నిన్నటి నుంచి చూస్తున్నా. అభిమానులు సినిమా కోసం ఎంతలా మొక్కుకున్నారో, ఎంతలా సెలబ్రేట్ చేస్తున్నారో చూస్తున్నా. ఆ వెంకన్న స్వామి ఆశీస్సులు, మీ ప్రేమ వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ విజయాన్ని ప్రేక్షకుల మధ్యలో సెలబ్రేట్ చేసుకోవాలని ఉంది. తెలుగు ప్రేక్షకులతో పాటు యూఎస్ ఆడియన్స్‌ని కూడా త్వరలో కలుస్తాను. గురువారం విడుదలంటే నేను మొదట భయపడ్డాను. కానీ, నాగవంశీ ఈ సినిమా నమ్మి అదే రోజు విడుదల చేశారు. ఇప్పుడు ఆయన నమ్మకం నిజమైంది. సినిమాకి నా నటనకు ఇన్ని ప్రశంసలు రావడానికి కారణం దర్శకుడు గౌతమ్. టీజర్ కి వాయిస్ ఓవర్ అందించిన ఎన్టీఆర్ అన్నకి, అభిమానులకు, తెలుగు ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అన్నారు.
నిర్మాత సూర్యదేవర నాగ వంశీ మాట్లాడుతూ. ఒక తెలుగు సినిమాని సాంకేతికంగా హాలీవుడ్ స్థాయిలో తీశాము అన్నారు. నటులు సత్యదేవ్, నటుడు వెంకటేష్ మాట్లాడారు.

## మయసభ
## ఓ అందమైన ఊహా



విలక్షణ దర్శకుడు దేవా కట్టా సారథ్యంలో మయసభ అనే వెబ్ సిరీస్ రూపొందించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో నటించారు. సాయి కుమార్, దివ్య దత్తా, నాజర్, రవీంద్ర విజయ్, శత్రు, తాన్య రవిచంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుల నిజ జీవిత పాత్రల ఆధారంగా రూపొందించారనే విషయం టీజర్‌తో స్పష్టమైంది. హిట్ మ్యాన్ అండ్ ప్రూడోస్ ప్రొడక్షన్స్ ఎల్.ఎల్.పి బ్యానర్స్‌పై విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష ఈ సిరీస్‌ను రూపొందించారు. ఈ సిరీస్‌ను ఆగస్ట్ 7 నుంచి స్ట్రీమింగ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో గురువారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ ఈ సిరీస్ అద్భుతాలు సృష్టించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దేవా కట్టా మాట్లాడుతూ మయసభ అనేది అందమైన ఊహా. ఇద్దరు ప్రాణ స్నేహితుల ప్రయాణమే ఈ కథ. పరిస్థితుల వల్ల వారిద్దరి మధ్య ఏర్పడిన దూరం ఏంటి? అనే కాన్సెప్ట్‌తో తీశాం. ముందుగా మూడు పార్టులుగా సినిమాకు సంబంధించిన కథ రాశాను. అయితే సినిమాగా తీయడం అంటే మామూలు విషయం కాదు. ఆ తరువాత ఇదే కథను ఓ సిరీస్‌లా ఓ సీజన్‌ను రాసుకున్నాను. మయసభ ఇక్కడి వరకు రావడానికి చాలా టైం పట్టింది. ధనీష్‌ను కలిసిన తరువాతే మయసభకు ఈ లుక్ వచ్చింది. ఆగస్ట్ 7 నుంచి వస్తున్న ఈ మయసభ అందరి అందరి ఆస్తిలా మారిపోతోంది అని అన్నారు. సోనీ లివ్ బిజినెస్ హెడ్ ధనీష్ కాంజీ, సోనీ లివ్ కంటెంట్ హెడ్ షోగత్ ముఖర్జీ ఆది పినిశెట్టి, చైతన్య రావ్, నిర్మాతలు శ్రీ హర్ష, విజయ్ కృష్ణ , లింగమనేని చరితా వర్మ, నటి దివ్యా దత్తా, శ్రీకాంత్ అయ్యంగార్, రవీంద్ర విజయ్, కెమెరామెన్ సురేష్ , మ్యూజిక్ డైరెక్టర్ శక్తి కాంత్ కార్తీక్, కో డైరెక్టర్ కిరణ్ మాట్లాడారు.

## అమెజాన్ ప్రైమ్ చేతికి వీరమల్లు

పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ విమర్శకుల, ప్రేక్షకుల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో కలెక్షన్లపై భారం పడింది. మొదటి రోజు, ప్రీమియర్ షోలతో కలిపి మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. ప్రీమియర్ షోలకు తెలుగు వెర్షన్‌లో రూ.12.75 కోట్లు వచ్చినట్లు సమాచారం.



## వినోదానికి నూతన శిఖరం

హైదరాబాద్‌లో ఉన్న అత్యంత విలాసవంతమైన అనుభవానికి.. వినోదానికి నూతన శిఖరంగా మరో చిరునామా చేరింది... అదే యూకే సినీ ప్లెక్స్. హైదరాబాద్‌లోని నాచారంలో అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్మించిన ఈ యూకే సినీ ప్లెక్స్‌ను ప్రముఖ నిర్మాతలు దిల్‌రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్, శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. ఈసందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ యూకే సినీప్లెక్స్ మల్టీప్లెక్స్ థియేటర్ ఎంతో ఉన్నతంగా ఉంది. సౌండ్ సిస్టమ్, స్క్రీన్, సీట్లు ఎంతో బాగున్నాయి. ఉప్పల్, హబ్సిగూడ, నాచారంలో ఉండేవారికి ఈ మల్టీప్లెక్స్ వినోదాన్ని పంచడంలో సరికొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో పృతికా ఉదయ్, రుషిల్ ఉదయ్‌లతో పాటు రాజకీయ ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. గిరీ సినీప్లెక్స్‌లో విలాసవంతమైన 4 స్క్రీన్‌లున్నాయి. కేవలం సినిమా థియేటర్ మాత్రమే కాదు - ఇది ఓ అనుభూతి. అత్యాధునిక సాంకేతికతతో పాటు, అత్యుత్తమ సౌకర్యాలు కలిగిన ఈ సినీప్లెక్స్ సినిమా ప్రేమికులకు, కుటుంబాలకు ప్రీమియం అనుభవాన్ని అందించేందుకు సిద్ధమైంది. ఇక్కడ అందరూ ఆస్వాదించగల సౌకర్యాలు ఉన్నాయని యాజమాన్యం ప్రకటించింది.

## ప్రేమ ప్రతీకారం



అడివి శేష్ మోస్ట్ అవైటెడ్ మూవీ డకాయిట్ లీడ్ క్యారెక్టర్స్‌ని పరిచయం చేసిన పవర్ గ్లింప్స్ రిలీజ్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ప్రేమ ప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు షానియల్ డియో దర్శకత్వం వహించారు. ఈరోజు మేకర్స్ మృణాల్ ఠాకూర్ బర్త్‌డే సందర్భంగా ఆమెను పవర్‌ఫుల్ అండ్ ఇమోషనల్ అవతార్‌లో చూపిస్తూ ఓ ఇంటెన్స్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌లో మృణాల్ చేతిలో గన్ పట్టుకొని ఎయిమ్ చేస్తూ కనిపిస్తుంది. ఆమె కళ్ళల్లో ఆక్రోశం, బాధ, ఫైటింగ్ స్పిరిట్ అన్నీ ఒక్కటే టైంలో కనిపిస్తున్నాయి. ముఖంపై చిన్న చిన్న గాయాలు, కన్నీళ్లు ఆమె పాత్రకు ఉన్న ఎమోషనల్ వెయిట్‌ని సూచిస్తున్నాయి. ఈ కథలో జూలియెట్ కేవలం లవ్ ఇంటరెస్ట్ కాదు, రివెంజ్ డ్రామాకి సెంట్రల్ క్యారెక్టర్. మృణాల్ పోషించిన జూలియట్ పాత్ర తెలుగులో ఇప్పటివరకు చూసిన హీరోయిన్ల కంటే వేరే లెవెల్లో ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్లో ఈ సినిమాకి సంబంధించి లీడ్ యాక్టర్స్ తో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ భారీ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. డకాయిట్ ఈ క్రిస్మస్ డిసెంబర్ 25 రిలీజ్ కానుంది.

## ఒజి వర్‌ఫుల్ లుక్స్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం ఓజి కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు సుజిత్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమా నుంచి తాజాగా ఓ బ్లాస్టింగ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు. ఓజి చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్‌ను ఆగస్టు 2న రిలీజ్ చేస్తున్నట్లు వారు తాజాగా అనౌన్స్ చేశారు. పవన్ పవర్‌ఫుల్ లుక్స్‌తో డిజైన్ చేసిన ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తోంది. ఇక ఈ సినిమాలోని ఫస్ట్ బ్లాస్ట్ ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాకు థమన్ సంగీతం మరో మేజర్ అట్రాక్షన్ కానుంది.

# దేవాదాయ శాఖలో అందుబాటులోకి ఇ-ఆఫీసు సర్వీసు

## ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** దేవాదాయ శాఖ ఫైల్స్ అన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు దేవా దాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం ఆమె సచివాలయంలో దేవాదాయ శాఖకు సంబంధించి ప్రధాన కార్యాలయం కమిషనరేట్‌లో ఇ-ఆఫీస్ సర్వీసును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ఇ-ఆఫీస్ వల్ల దేవాదాయ శాఖలో సంస్కరణలు జరుగుతాయని, ఇదొక గొప్ప ముందడు గన్నారు. ఈ ఆఫీసు ద్వారా ఫైల్స్ త్వరగా, ఆలస్యం లేకుండా క్లియర్ చేయవచ్చన్నారు. డిజిటల్‌గా అన్నీ ట్రాక్ అవుతాయన్న కార ణంగా సిబ్బంది మధ్య అపోహలు ఉండవన్నారు. అలాగే, ఫైల్స్ మాయం కావడం, తడిసిపోవడం, దొంగతనం లేదా అగ్ని ప్రమాదాల్లో నష్టం చెందడం లాంటి సమస్యలు ఉండవన్నారు. ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా ఫైల్స్ క్లియర్ చేసే అవకాశం ఉంటుందని, ఉన్నతాధికారులు, ఇఆఫీసు వల్ల వారి కార్యాలయాల్లో భౌతికంగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసర ఫైల్స్‌ను ప్రత్యేకంగా గుర్తించేందుకు ట్యాగ్ చేయవచ్చన్నారు. కొద్ది రోజుల్లో యాదగిరిగుట్ట టెంపుల్ సర్వీసులను కూడా డిజిటలైజ్ చేస్తామని, అనంతరం రాష్ట్రంలోని 30 పెద్ద దేవస్థానాలల్లో ఇ-ఆఫీసు సర్వీసులు వినియోగిస్తామన్నారు. దీంతో పాటు పీఏలు, సీసీలు లాంటి మధ్యవర్తుల జోక్యం చాలా తక్కువవుతుందన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖలో ఫైల్స్ క్లియరెన్స్ పనితీరును వేగవంతం ప్రాధాన్యతస్తుందని మంత్రి అన్నారు. అనంతరం దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ మాట్లాడుతూ. ఈ కొత్త విధానం ద్వారా దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో పెండింగ్ ఫైల్ వ్యవహారాలు వేగంగా, పారదర్శకంగా ముందుకు వెళ్ళనున్నాయన్నారు. ఇ-ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ అభివృద్ధి చేసిందని, దీంతోపాటు అప్లికేషన్ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని, పారదర్శకతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.



ఇ-ఆఫీసు ప్రారంభోత్సవంలో భాగంగా మంత్రి కొండా సురేఖ మొదటి ఫైల్‌ను ఈఅప్లికేషన్ ద్వారా ఆమోదించారు. ఒక కారుణ్య నియామక ప్రక్రియను పూర్తి చేశారు. నవీన్ కుమార్ అనే వ్యక్తికి తన తండ్రి మరణించగా దేవాదాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాన్ని మంత్రి సురేఖ మంజూరు చేశారు. ఇ-ఆఫీసు ప్రక్రియను విజయవంతంగా చేసినందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకటరావును మంత్రి అభినందించారు. గత 15 రోజులుగా కమిషనర్ స్వయంగా కంప్యూటరైజేషన్ పనులను పర్యవేక్షించారని కొనియాడారు. ప్రతి సిబ్బందికి తగిన శిక్షణ కల్పించారని, ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలులోకి రావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. వెంకటరావు, ఎన్‌ఐసీ జాయింట్ డైరెక్టర్ రాఘవాచారి, టెక్నికల్ మేనేజర్ సవిత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలమల్లన్నను దర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీశైలమల్లన్నకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీశైల క్షేత్రంలోని 'తాండ్ర పాపారాయ వెలమ చౌల్ట్రీ' ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కుర్మయ్యగారి శాంతమ్మ నారాయణరావు భవన్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని, ఎవరు ఎక్కడ ఉన్నా. సమాజహితం కోసం పాటుపడాలని అన్నారు. కార్యవర్గ సభ్యులు ఒక కుటుంబంగా శ్రీశైలంలో వసతిగృహం నిర్మించుకోవడం సంతోషకరం, అభినందనీయమన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు

## నాలుగు కోర్సుల్లో అడ్మిషన్లు.. ఈ యేడాది నుంచే అడ్మిషన్ల స్వీకరణ: ప్రభుత్వ ఉత్తర్వులు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో ఇంజినీరింగ్ కాలేజీకి అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ యూనివర్సిటీలో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీని అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటు కానున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజీనీరింగ్‌లో 4 కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 32ను విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో బిటెక్-సిఎస్‌ఈ, బిటెక్-సిఎస్‌ఈ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్), బిటెక్- కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, బిటెక్-డాటా సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాది 2025-26 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకోనున్నట్టు విద్యాశాఖ సెక్రెటరీ యోగితా రాణా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 240 సీట్లను భర్తీ చేయనున్నారు. అయితే ఇప్పటికే ఎప్ సెట్- 2025 సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ పూర్తయిన నేపథ్యంలో మూడో ఫేజ్‌లో తెలంగాణ యూనివర్సిటీకి మంజూరైన ఇంజనీరింగ్ కాలేజీలో అడ్మిషన్లు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

# పాలేరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## విద్యాభివృద్ధికి 470 కోట్లు ఇచ్చాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కూసుమంచి, జూలై 31, ప్రభాతవార్త:** పాలేరు ప్రజల ఆశీర్వాదంతో అసెంబ్లీలో అడుగుపెట్టిన తాను, వారి రుణం తీర్చుకునే క్రమంలో పాలేరు నియోజకవర్గంలో విద్యారంగానికి కొత్త ఊపు తెచ్చేందుకు 470 కోట్ల రూపాయలను విద్యాభివృద్ధి కోసం కేటాయించామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'పేద పిల్లలు చదువులో వెనుకబడకూడదు.. వారిని మణిరత్నాలుగా తీర్చి దిద్దడమే మా ప్రభుత్వ సంకల్పం' అని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. కూసుమంచి పాత జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. 'ఈ భవనాన్ని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి ఈ ఏడాదిలోనే విద్యార్థుల కోసం ప్రారంభిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం నాకు గర్వంగా ఉంది' అని మంత్రి అన్నారు. 'గడచిన 18 నెలల్లో పాలేరు నియోజకవర్గానికి రూ. 470 కోట్ల నిధులు విద్యాభివృద్ధికి కేటాయించాం. ఐటీఐ, నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి కొత్త శకం తెస్తాయి. చదువు అందరికీ చేరేలా ప్రభుత్వ కృషి కొనసాగుతుంది' అని మంత్రి వివరించారు. పిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న 76 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి జూనియర్ కళాశాలలో చేరుతున్న విద్యార్థినీలకు కూడా సైకిళ్ల అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా రాణిం చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అన్ని శాఖల, విభాగాల ప్రత్యేకాధి కారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు

# బొగ్గు గనుల మూసివేత ప్రాంతాల్లో జీవనోపాధి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త :** బొగ్గు గనుల మూసివేత వల్ల ప్రభావితమైన ప్రాంతాలలో జీవనోపాధికి మద్దతు ఇవ్వడం, పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం, ఆహార భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్రం అనేక కార్యక్రమాలను చేపట్టిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు గురువారం కేంద్ర మంత్రి సమాధానంగా జనవరి 31, 2024న జారీ చేయబడిన మైనింగ్ ప్లాన్, మూసివేత మార్గదర్శకాల ప్రకారం, గనుల మూసివేత వల్ల ప్రభావితమైన కుటుంబాలకు పునరావాసం మరియు పునరావాస వ్యూహాలపై కేంద్ర ప్రభుత్వం చురుకుగా పనిచేస్తోందన్నారు. న్యాయమైన పరివర్తన ను నొక్కి చెబుతూ, కార్మికులు, సమాజం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. కాగా సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సోనాయక్ జవాబిస్తూ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై నవీకరణలను అందిస్తూ, జూన్ 30, 2024 నాటికి దేశ వ్యాప్తంగా 43,922 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యాన్ని సాధించిందని చెప్పారు. ఇందులో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎన్టీపీసీ, ఇతర ఏజెన్సీల సహకారాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రం విద్యుత్ అమ్మకపు ఒప్పందాల (పిఎస్ఎ) సంతకాలను వేగవంతం చేసిందని చెప్పారు. అలాగే సౌర మరియు పవన శక్తి మౌలిక సదుపాయాల వృద్ధిని సులభతరం చేయడానికి నవీకరించబడిన బిడ్డింగ్ మార్గదర్శకాలను కూడా జారీ చేసినట్లు వెల్లడించారు.

# రెండు వారాల్లో చేపపిల్లల బకాయిలు చెల్లించాలి

## మత్స్య శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని జలాశయాల్లో ఉచిత విడుదల చేసేందుకు గాను వివిధ కంపెనీల వద్ద కొనుగోలు చేసిన చేప, రొయ్య పిల్లలను సరఫరా చేసిన వారికి 2 వారాల్లో డబ్బులు చెల్లించాలంటూ మత్స్యశాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బిల్లులు చెల్లించి గత ఉత్తర్వుల అమలు నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. కాగా తమకు ప్రభుత్వం నుండి రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలంటూ డిసెంబర్లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో చేప, రొయ్య పిల్లల పంపిణీదారులు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ. శ్రవణ్ కుమార్ విచారించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సాంకేతిక కారణాలతో బిల్లులు చెల్లించకలేకపోయామన్నారు. ప్రస్తుతం రూ.27 కోట్ల మంజూరైందని, త్వరలో బిల్లుల చెల్లిస్తామని చెప్పారు. ఇక పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వినిపిస్తూ పిటిషనర్లకు బిల్లులు విడుదల చేస్తే చాలని ధర్మాసనానికి తెలియచేశారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం 2 వారాల్లో బిల్లులు చెల్లించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ విచారణకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సభ్యసాచి ఘోష్, మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆన్లైన్ ద్వారా కోర్టు ముందు హాజరయ్యారు. అలాగే నాగర్‌కర్నూల్ కలెక్టర్ బి.సంతోష్, మత్స్య శాఖ సంచాలకులు శ్రీనివాస్ వ్యక్తిగతంగా హాజరయ్యారు.



భూనిర్వాసితులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

# భూ నిర్వాసితులకు రూ. 40 లక్షలు పరిహారం అందించాలి

## ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**దామరగిద్ద, జూలై 31, ప్రభాతవార్త:** రైతు లేనిదే రాజ్యం లేదు రైతు ఏడ్చినటువంటి రాజ్యం ఎన్నడూ కూడా బాగుపడదు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు రాజ్యం బాగుండాలంటే రాష్ట్ర ప్రజలు బాగుండాలి ప్రాజెక్టు బాధితులకు న్యాయం జరిగే వరకు నేను వదిలిపెట్టాను నీళ్లు రానటువంటి పైపుల కోసం ఊరు ముంచడం ఎందుకు రూ. 2900 కోట్ల ప్రాజెక్టు అంచనా ఒకేసారి రూ.4,500 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ప్రాజెక్టు పని ప్రారంభం కాకముందే అడ్వాన్సుగా 600 కోట్లు ఇవ్వడం ఏమిటని ఎమ్మెల్సీ కవిత అన్నారు దామరగిద్ద మండలం కాన్కుర్తి గ్రామ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ బాధితులతో ఆమె ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు కొడంగల్ లో ఉన్న వారు కూడా తమ బిడ్డలేనని వారికి కూడా నీళ్లు రావాలని ఆ ప్రాంత రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మధ్యలో ఉన్న రైతులను ఎండబెడతామంటే సరైంది కాదన్నారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో 1,80,000 ఎకరాలకు నీరు అందేదని అలాంటి ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్కు పేరు వస్తుందన్న ఉద్దేశంతో కేవలం లక్ష ఎకరాలకు సాగు నీరు వచ్చే ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి తీసుకురావడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంగా 35 లక్షల నుంచి 40 లక్షలు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పులులకు విషం పెట్టి చంపొద్దు.. అది నేరం


## అటవీశాఖ ముఖ్యకార్యదర్శి సువర్ణ

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** నగరం చుట్టూ అటవీ ప్రాతం అంతరించడంతో పులులు బయటకు వస్తున్నాయని అటవీశాఖ ముఖ్య కార్యదర్శి సువర్ణ అన్నారు. గురువారంఆమె అరణ్యభవన్‌లో మీడియా ప్రతినిధులతో సవవేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ... పులి కంటే చిరుతపులి తెలువైంది. చిరుత ఒఆర్‌ఆర్ రెండుసార్లు దాటింది. ఇప్పటి వరకు ఎవరిపైనా దాడి చేయలేదు ఆ తర్వాత అది ఫారెస్ట్‌లోకి వెళ్ళిందన్నారు.

నగరం చుట్టూ పక్కల అటవీ ప్రాంతం అంతరించడం, వాటికి అడవిలో సరైన ఆహారం దొరక్కపోతే బయటకి వస్తున్నట్లు తెలిపారు. జంతువులు, మానవులపై ఎక్కువ దాడి చేసే అవకాశం ఉందన్న ఆమె నగరంలో చిక్కిన మగ చిరుత 5నుండి 6 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఈ ఒక్క చిరుతకే ఇంత సమయం పట్టిందన్నారు.

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అవి ఇంకా తిరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి మూడు వారాల తర్వాత ఈరోజు మంచిరేవులలో చిరుత చిక్కిందన్నారు. క్రూర మృగాల దాడిలో మనుషులు చనిపోతే పది లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నాం. కానీ విషం పెట్టి వీటిని చంపొద్దు. చంపితే అటవీ చట్టం కేసులు నమోదు అవుతాయని ఆమె హెచ్చరించారు. పులుల సమాచారం ఉంటే.. టోల్‌ఫ్రీ 040 23231772కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఈ ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఫారెస్టు సీనయర్ ఆఫీసర్ శంకరన్ మాట్లాడుతూ.. చిరుత పులుల సంచారం పెరుగుతుంది కాని, పులుల సంతానం పెరగలే దన్నారు. మహారాష్ట్ర నుంచి ఎక్కువగా వస్తున్నాయని, మహబూబ్ నగర్‌లో రెండు చోట్ల చిరుత పులులు సంచరిస్తూ మను షుల మీద దాడులు చేస్తున్నాయన్నారు. చిలు కూరు ప్రాంతంలో ఉన్న చిరుతను పట్టుకు న్నామని, గతంలో ఒక చిరుతను పట్టుకో వాలాం టే మూడు నెలలు పట్టింది చిలుకూరు ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా సునా యసంగా చిరుతను పట్టుకున్నమని, ఇందుకు వాకర్స్ కూడా ఎంతో సహకరించినట్ల ఆమె తెలిపారు.

# ఎట్టకేలకు ఎరకు చిక్కిన 'చిరుత'



మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కులో ఏర్పాటు చేసిన మేక ఎరకు చిక్కిన చిరుత ఇదే.

## ఊపిరి పీల్చుకున్న శివారు గ్రామాల ప్రజలు

## రాత్రివేళల్లో యధేచ్ఛగా తిరిగిన పులి

## ఫలించిన అధికారుల పదిరోజుల ప్రయత్నం

**హైదరాబాద్ (నార్సింగి), జూలై 31, ప్రభాతవార్త :** హైదరాబాద్ మహ నగర శివారుల్లో గత పది రోజులుగా మూడు మండలాల ప్రజలను వణికించిన 'చిరుత' ఎట్టకేలకు ఎరకు చిక్కింది. గండిపేట మం డలం మంచిరేవుల గ్రామంలో ఉన్న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మేక పిల్లను ఎరగా వేసిన బోనులోకి వచ్చి పట్టు బడింది చిరుతపులి. అటవీ శాఖ అధికారులు ఈ చిరుతను జూపార్కుకు తరలించారు.

దీంతో ఇటు స్థానిక ప్రజలు, అటు అటవీశాఖ అధికారులు ఊపి రి పీల్చుకున్నారు. పది రోజుల క్రితం మంచిరేవులలో ఉన్న వ్యాస్‌నగర్‌లో గ్రేహౌండ్స్ పోలీసులు మార్నింగ్ వాక్ చేస్తుండగా చిరుతపులి కనిపించింది. దాన్ని చూసిన పోలీసులు వెంటనే నార్సింగి పోలీసులకు సమాచారం అంద జేశారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి చిరుత పాదాల ఆనవాళ్లను పరిశీలించి ఇక్కడ సంచరించేది చిరుతపులేనని తేల్చారు.

అటవీ శాఖ అధికారులు ఈ చిరుతను పట్టుకునేందుకు మృగవని పార్కు, ఫారెస్ట్ ట్రెక్ పార్కు, వ్యాస్ నగర్ ప్రాంతాలలో బోన్‌లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చిరుత కదలికలను పరిశీలించడం ప్రారంభించారు. బోన్‌లలో ఎరగా మేక పిల్లలను ఉంచారు. రెండు రోజుల తరువాత మంచిరేవులలో ఏర్పాటు చేసిన ఓ కెమెరాకు రోడ్డు దాటుతూ కనిపించింది. ఆ పరిసర ప్రాంతాలలో అధికా రులు నిఘాను పెంచారు.

మరో మూడు రోజుల తరువాత గోల్కొండ తారామతి బారాదరి వద్ద రోడ్డు దాటుతూ సీసీ కెమెరాకు చిక్కింది. దాంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. చిరుత పట్టుబడేంత వరకు మార్నింగ్ వాక్‌లకు కూడా వెళ్లవద్దని హెచ్చరించారు.

### ఎరకు చిక్కిన చిరుత

అటవీ శాఖ అధికారులు వేసిన మేక ఎరకు చిరుత చిక్కింది. ఆహారం కోసం, స్థావరం కోసం చిరుత ఫారెస్టు ట్రెక్ పార్కుకు గాని, మృగవని పార్కుకు గాని తిరిగి వస్తుందని, ఈ పార్కులలోనే జింకలు, కుందేళ్లు ఉండడం వలన అధికారులు ఇక్కడే 4 బోన్లను, 14 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చిరుత కదలికలను నిశితంగా పరిశీలించసాగారు. చిరుత గురువారం తెల్లవారుజామున ఫారెస్టు ట్రెక్ పార్కు వద్ద ఏర్పాటుచేసిన బోనులో మేకను తినేందుకు వెళ్లి పట్టుబడింది. అటవీ శాఖ అధికారులు చిరుత పట్టుబడిన సీసీ పుటేజిని పరిశీలించి దాన్ని బంధించి సురక్షితంగా హైదరాబాద్‌లోని జూ పార్కుకు తరలించారు.

# జాతీయస్థాయి టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులకు పతకాలు

## శిరీష రజతం, హనుమంతు కాంస్యం


**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త :** జాతీయ స్థాయిలో జరిగిన టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. యాచ్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో చాంద్రాయణ గుట్ట గర్ల్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జె శిరీష వెండి పతకం సాధించగా, మునుగోడు బాయ్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న వి హనుమంతు కాంస్య పతకం సాధించాడు. కల్వకుర్తి గర్ల్స్ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్న ఎం అక్షర జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. బిసి గురుకులవిద్యార్థులకు చదువుతో పాటు వారిలోనైపుణ్యాలను, ఆసక్తిని గమనించి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బిసి గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సొసైటీ సెక్రటరీ సైదులు తెలిపారు. అందులో భాగంగా బిసి గురుకుల విద్యార్థులకు యాచ్ క్లబ్ ఆద్వర్యంలో హుస్సేన్ సాగర్ లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు వారు జాతీయ, అంతర్జాతీయపోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మూడు దఫాలుగా శిక్షణ ఇచ్చామన్నారు. జూలై 1వ తేదీ నుంచి జూలై 20వ తేదీ వరకు మూడో విడత శిక్షణ ఇచ్చామని వారిలో జాతీయ స్థాయిలో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 2026 లో జరిగే ఆసియన్ గేమ్స్, 2028 జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. అందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూర్యకిరణ్, ఎంఎల్‌సి దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, రచయిత యష్‌పాల్ తదితరులు

# 6న 'గద్దర్' ద్వితీయ వర్ధంతి సభ

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** ప్రజాయుద్ధ నౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి సభ ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటల నుంచి హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరుగతుందని గద్దర్‌ఫౌండేషన్ చైర్మన్ సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎంఎల్‌సి దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌లతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలతో కలిసి వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగే వర్ధంతి సభలో ప్రజా ప్రతినిధులు, సినీ ప్రముఖులు, మేధావులు, రచయితలు, కళాకారులు పాల్గొని తమ సందేశాన్ని వినిపిస్తారన్నారు. అలాగే వివిధ ప్రజా సంఘాల నేతలు, తెలంగాణ ఉద్యమ కారులు, పాత్రికేయులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సేనోటు డ్రగ్స్ అనే నాటికలను ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారు. అలాగే గద్దర్ రాసిన సాహిత్యంలోంచి సామాజిక ఆర్థిక అసమానతల పై రాసిన పాటల ప్రదర్శన ఉంటుందన్నారు. గద్దర్ సమగ్ర సాహిత్యాన్ని ప్రచురించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్న ఫౌండేషన్ రెండో వర్ధంతి సందర్భంగా గద్దర్ రాసిన మా పల్లె, ప్రతి పాటకు ఒక కథ ఉంది పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. అలాగే గద్దర్ జీవితాంతం చేసిన కృషి, ఆచరించిన విలువలపై ఆయన స్మృతిలో అనేమంది కవులు, కళాకారులు, రచయితలు రచనలతో రూపు దిద్దుకొన్న గద్దర్ యాదిలో పాలధార పాట పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు సూర్యకిరణ్ పేర్కొన్నారు.





# బిసి బిల్లుకు కేంద్రంలో బిజెపి అడ్డుపడుతోంది

## కాంగ్రెస్‌తో స్నేహధర్మాన్ని పాటిస్తూనే.. ప్రజాసమస్యలపై ఉద్యమిస్తాం

## రాష్ట్ర మహాసభలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తాం: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిసి బిల్లుకు బిజెపి పెద్ద అడ్డంకిగా మారిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బిసి బిల్లుకు బిజెపి అడ్డుపడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిన బిసి బిల్లులను గత 4 నెలలుగా తొక్కి పెట్టడం సరికాదని, ఆర్డినెన్స్ ఆమోదం విషయంలో సైతం ఇదే విధంగా వ్యవహరించడం సమాజసం కాదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురు వారం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లునే కాకుండా ఎస్‌సి వర్గీకరణ అమలుకు సంబంధించి ద్వంద వైఖరి అలంభిస్తోందని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ మూడు నెలలలోపు నిర్ణయం తీసుకో వాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని.. అయితే ఈ చట్టంలోని లోసుగుల కారణంగా అది సాధ్యమా అని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనానికి సంబంధించి ఇటు బిజెపి, అటు బిఆర్‌ఎస్ మధ్య మాటల యుద్దాన్ని కట్టిపెట్టి .. ఇందుకు సంబంధించిన వాస్తవాలను మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కె చంద్రశేఖరరావు వెల్లడించి తమ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ నెల 19 నుంచి 21 వరకు జరగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 19 నుంచి 21 వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో ఘనంగా జరగనున్నాయని కూనంనేని సాంబశివరావు చెప్పారు.

మహాసభలు జరిగే ప్రాంతానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, దివంగత 'ఎన్.బాలమల్లేష్ నగర్'గా నామకరణం చేసినట్లు చెప్పారు. అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తునే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తున్నామని కూనంనేని చెప్పారు.

# కెనడియన్ ఓపెన్‌లో ఒడిదుడుకుల్లో జెస్సికా



**న్యూఢిల్లీ:** కెనడీయన్ ఓపెన్-2025లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన జెస్సికా పెగులా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తన తొలి మ్యాచ్‌లో మరియా సక్కారి చేతిలో జెస్సికా పెగులా పూర్తిగా ఓడిపోయింది. అయితే రెండవ రౌండ్‌లో మాత్రం సక్కారిని అధిగమించి జెస్సికా ముందుకెళ్లింది. మాంట్రియల్‌లో గురువారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఒక గంటా 32 నిమిషాల్లో 7-5, 6-4 తేడాతో విజయం సాధించి తొలి సెట్‌లో ఐదు సెట్ పాయింట్లను కాపాడుకుంది. వింబుల్డన్ మరియు వాషింగ్టన్ ఓపెన్‌లలో వరుసగా తొలి రౌండ్ పరాజయాల తర్వాత ఈ అమెరికన్ అమ్మాయి జెస్సికా ఆటలోకి అడుగు పెట్టింది. తొలి సెట్‌లోని మూడో గేమ్‌లో మూడో సీడ్ సక్కరిని బ్రేక్ చేసింది, కానీ ఆమె ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన పెనుగులా ఆధిక్యం సంపాదించి తదుపరి నాలుగు గేమ్‌లను గెలుచుకుంది. పెగులా ఇలా తిరిగి విజయం సాధించినప్పటికీ, సక్కరికి మొదటి సెట్‌లో సర్వ్ చేసే అవకాశం లభించింది, కానీ ప్రపంచ నాలుగో నంబర్ క్రీడాకారిణి తనను తాను సజీవంగా ఉంచుకోవడంతో ఆమె తన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. తదుపరి గేమ్‌లో సక్కరిని బ్రేక్ చేయడం ద్వారా పెగులా సద్వినియోగం చేసుకుని తర్వాత సెట్‌ను ముగించింది, రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈమె రెండవ సెట్‌ను విరామంతో ప్రారంభించి, ఐదవ గేమ్‌లో మళ్ళీ అదే చేసింది, అయితే కొద్దిసేపటికే సక్కరి తిరిగి తన విజయాన్ని నమోదు చేసుకుంది.

## ప్రపంచ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో
# 13 యేళ్ల తర్వాత భారత్‌కు కాంస్యం




**న్యూఢిల్లీ:** ప్రపంచ స్క్వాష్ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో 13 సంవత్సరాల తర్వాత భారత్ తొలి బాలుర జట్టు పతకాన్ని సాధించింది. ఈజిప్టులోని న్యూ కైరోలో గురువారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత జూనియర్ బాలుర టీం కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన తర్వాత సెమీఫైనల్స్‌లో రెండో సీడ్ అమెరికా చేతిలో భారత్ ఓడిపోయింది. చివరికి ఈ టోర్నమెంట్ నుండి కాంస్య పతకాన్ని సాధించింది. అంతకుముందు, గత సంవత్సరం ఫైనలిస్ట్ అయిన దక్షిణ కొరియాను క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ జట్టు ఓడించింది, యుషా నఫీస్, కెఎస్ అరిహంత్ చేసిన రెండు మ్యాచ్‌ల విజయాలతో 2-1 ఆధిక్యంతో చివరి నాలుగు స్థానాల్లో తమ స్థానాన్ని నిర్ధారించుకుంది. ఈ టైలో ఒక్క ఆట కూడా గెలవకపోవడంతో అమెరికా భారత జట్టుకు చాలా కఠిన పరీక్షగా నిలిచింది. మరోపక్క కెఎస్ అరిహంత్, పిఆర్ సందేశ్ ఇద్దరూ వారి వారి వరుస మ్యాచ్‌లలో ఓడిపోయారు. సందేశ్ కేవలం 26 నిమిషాల్లోనే అలెగ్జాండర్ డార్ట్నెల్ చేతిలో 0-3 (3-11, 2-11, 5-11) తేడాతో ఓడిపోయాడు. అలాగే అరిహంత్ 28 నిమిషాల పాటు జరిగిన పోటీలో జాక్ ఎల్రియాని చేతిలో 0-3 (6-11, 4-11, 7-11) తేడాతో ఓడిపోయాడు. ఇంతలో, ఈజిప్ట్ చేతిలో క్వార్టర్ ఫైనల్ ఓడి పతక రేసు నుండి నిష్క్రమించిన భారత బాలికల జట్టు, కెనడాపై 5 నుండి 8వ స్థానం వరకు ప్లే ఆఫ్ టైను 2-0 తేడాతో కైవసం చేసుకుంది. అనాహత్ సింగ్ (3-0), అనికా దూబే (3-1) ఇద్దరూ వరుసగా స్ప్రింగ్ మా, జోయెల్ కిమ్‌లపై గెలిచి, భారత బాలికల టాప్6 స్థానానికి చేరారు.

# మకావు ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు తరుణ్, లక్ష్య

## ఆయుష్, ధ్రువ్-తనీషా జంట ఓటమి

**న్యూఢిల్లీ:** మకావు ఓపెన్-2025లో పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన మన్నెపల్లి తరుణ్, లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, మిక్స్‌డ్ విభాగంలో ఆయుష్, ధ్రువ్ తనీషా జోడీ ఓటమిపాలైంది. గురువారం జరిగిన వరల్డ్ టూర్ సూపర్ 300 ఈవెంట్ మకావు ఓపెన్‌లో చైనాలోని హాంకాంగ్‌కు చెందిన టాప్ సీడ్ లీ చెయుక్ యియును ఓడించి, తరుణ్ ఈ సీజన్‌లో రెండోసారి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. గంటసేపు జరిగిన పోరాటంలో భారత ఆటగాడు 23 ఏళ్ల తరుణ్, ప్రపంచ 15వ ర్యాంకర్ లీని 19-21, 21-14, 22-20 తేడాతో ఓడించాడు. ప్రపంచ 47వ ర్యాంకర్ తరుణ్ ఈ ఏడాది సూపర్ 300 టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడం ఇది రెండోసారి. ఫిబ్రవరిలో జరిగిన జర్మన్ ఓపెన్‌లో అతను అదే దశకు చేరుకున్నాడు. సెమీఫైనల్లో స్థానం కోసం తదుపరి




ప్రపంచ నం. 87 చైనాకు చెందిన హు ఝె ఆన్‌తో తలపడతాడు. అలాగే కామన్వెల్త్ గేమ్స్ ఛాంపియన్, రెండవ సీడ్ లక్ష్య, ఇండోనేషియాకు చెందిన చికో ఆరా ద్వి వార్డోయోను 21-14, 14-21, 21-17 తేడాతో గంటా ఏడు నిమిషాల్లో ఓడించాడు. 23 ఏళ్ల లక్ష్య క్వార్టర్ ఫైనల్స్‌లో మరో ఇండోనేషియాకు చెందిన యోహానెస్ సౌత్ మార్సెలినో లేదా చైనాకు చెందిన జు జువాన్ చెన్‌తో తలపడతాడు. అయితే, ఏడో సీడ్ భారత ఆటగాడు శెట్టి ఆయుష్ మలేషియాకు చెందిన జస్టిన్ హోహ్ చేతిలో 21-18, 21-16 తేడాతో ఓడిపోయాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ భారత ద్వయం ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో తొలి గేమ్‌ను గెలుచుకున్న తర్వాత మలేషియాకు చెందిన జిమ్మీ వాంగ్-లై పీ జింగ్ చేతిలో ఓడిపోయారు. అలాగే మహిళల సింగిల్స్‌లో, యువ క్రీడాకారిణి రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్ 51 నిమిషాల పోటీలో ఓడిపోయే ముందు థాయిలాండ్‌కు చెందిన రెండవ సీడ్ బుసానన్ ఒంగ్‌బమ్‌రుంగ్‌ఫాన్‌ను ఓడించి నిర్ణయాత్మక రౌండ్‌కు చేరుకుంది.





# భారత్, పాక్ మ్యాచ్ రద్దు

## టోర్నీ నుంచి వైదొలగిన టీమిండియా
## ఫైనల్‌కు దూసుకెళ్లిన పాకిస్థాన్

**న్యూఢిల్లీ:** వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)-2025 నుంచి భారత్ ఛాంపియన్స్ టీమ్ వైదొలిగింది. దాయాది పాకిస్థాన్‌తో సత్ సంబంధాలు లేకపోవడం, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది జట్టుతో సెమీఫైనల్ మ్యాచ్ ఆడటానికి టీమిండియా ఆటగాళ్లు నిరాకరించారు. ఈ నేపథ్యంలో గురువారం భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరగలేదు. దీంతో పాకిస్థాన్ నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌లో మరోసారి పాకిస్థాన్‌తో తలపడాల్సి రావడంతో టీమిండియా కెప్టెన్ యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్ తదితర ఆటగాళ్లు తమ పాత వైఖరికే కట్టుబడి తాము పాక్‌తో ఆడబోమని స్పష్టంచేశారు. ఈ పరిణామం ఇప్పటికే ఉత్కంఠగా మారిన ఈ టోర్నమెంట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఈ నెల 31న భారత్ ఛాంపియన్స్, పాకిస్థాన్ ఛాంపియన్స్ మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఇటీవల పహల్గాం దాడి అనంతరం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రికత్తలు నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటినుంచి భారత్, పాకిస్థాన్ మధ్య ఎలాంటి మ్యాచ్‌లు జరగడం లేదు. డబ్ల్యూసీఎల్ 2025 టోర్నీలో లీగ్ దశలో కూడా పాకిస్థాన్‌తో ఆడేందుకు భారత్ ప్లేయర్స్ నిరాకరించారు. దాంతో ఆ మ్యాచ్‌ను రద్దు చేసి ఇరు జట్లకూ చెరో పాయింట్ ఇచ్చారు. ఇప్పుడు సెమీఫైనల్ మ్యాచ్ కూడా ఆడబోమని స్పష్టం చేయడంతో పాటు, భారత జట్టు అధికారికంగా టోర్నీ నుంచి తనంతతానుగా వైదొలిగింది. టోర్నీ స్పాన్సర్ ఈజ్‌మైట్రిప్ కూడా మ్యాచ్ స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. ఇక యువరాజ్ సింగ్ నాయకత్వంలోని భారత్ ఛాంపియన్స్ టీమ్ వెస్టిండీస్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంను దక్కించుకుని సెమీస్‌కు దూసుకొచ్చింది. దీంతో తదుపరి పాకిస్థాన్‌తో సెమీఫైనల్ మ్యాచ్ భారత్ ఆడాల్సి ఉండగా, అది రద్దయింది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఆగస్టు 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టోర్నీలో మొత్తం ఆరు టీమ్స్ తలపడ్డాయి.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# ఫైనల్స్‌కు భారత్ మహిళలు

## ఖాతాల్లో నాలుగు పతకాలు ఖరారు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నలుగురు భారతీయ మహిళలు ఫైనల్స్‌కు చేరుకుని బంగారు పతక పోటీలకు దూసుకెళ్లారు. గ్రీస్‌లోని ఏథెన్స్‌లో జరిగిన అండర్ 17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల ఫ్రీస్టైల్ రెజ్లర్లు అద్భుతమైన ఆరంభాన్ని సాధించారు. ఐదుగురు రెజ్లర్లలో నలుగురు తొలి రోజున ఫైనల్స్‌కు చేరుకున్నారు. రచన (43 కిలోలు), మోని (57 కిలోలు), అశ్విని విష్ణోయ్ (65 కిలోలు), కాజల్ (73 కిలోలు) తమ ప్రాథమిక రౌండ్ పోటీలలో ఆధిపత్య విజయాలతో ఫైనల్స్‌కు చేరుకున్నారు. అండర్ 17 ప్రపంచ ఛాంపియన్ (69 కిలోల) తదుపరి, కాజల్ వరుసగా రెండవ ఎడిషన్‌లో అండర్ 17 ఫైనల్‌కు చేరుకుంది. నాలుగు బౌట్‌లలో మూడింటిని పిన్‌ఫాల్ నిర్ణయంతో గెలుచుకోవడం, నాల్గవ బౌట్‌లో కూడా, ఆమె సెమీస్‌లో అమెరికాకు చెందిన ఎల్లా జో పాలిల్లోపై 11-0 తేడాతో ఆధిపత్య సాంకేతిక ఆధిపత్యాన్ని నమోదు చేసింది. మరోవైపు, అశ్విని సాంకేతిక ఆధిపత్యంలో రెండు విజయాలతో ప్రారంభించింది. క్వార్టర్ ఫైనల్‌లో పిన్‌ఫాల్ విజయంతో, సెమీస్‌లో లిలి ఎర్మోఖినాపై 7-0 తేడాతో విజయం సాధించింది. ఆసియా అండర్ 17 ఛాంపియన్ మోని కూడా క్వార్టర్ ఫైనల్‌లో తన రొమేనియన్ ప్రత్యర్థిని ఓడించి, సెమీ ఫైనల్‌లో అలీనా బరోవాపై 7-0 తేడాతో మరో సునాయాస విజయాన్ని సాధించింది. ఇక రచనా క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఈజిప్ట్‌కు చెందిన మారేమ్ అబ్దెలాల్‌పై విజయాన్ని సాధించింది. కానీ సెమీస్‌లో అమెరికాకు చెందిన మాడిసన్ హీలేపై 1-1 తేడాతో విజయాన్ని నమోదు చేయడానికి తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. ఏకైక భారతీయ రెజ్లర్ కోమల్ వర్మ (49 కిలోలు) ఫైనల్స్‌కు చేరుకోలేకపోయింది. ఆమె ప్రత్యర్థి, అమెరికాకు చెందిన మోర్గాన్ టర్నర్ ఫైనల్‌కు చేరుకోవడంతో, రెపాచేజ్ ద్వారా కోమల్ కాంస్య పతకాన్ని గెలుచుకునే రెండవ అవకాశం ఉంటుంది.



# ఐదేళ్ల కనిష్టానికి పసిడి డిమాండ్!

**న్యూఢిల్లీ, జూలై 31:** అధిక ధరల కారణంగా పసిడి వన్నె తగ్గుతోంది. 2025లో బంగారం వినియోగం ఐదేళ్ల కనిష్ఠానికి పడిపోనుందని ప్రపంచ స్వర్ణ మండలి గురువారం వెల్లడించింది. పసిడి పెట్టుబడుల్లో స్వల్ప డిమాండ్ ఉన్నప్పటికీ.. పెద్దగా ప్రభావం చూపడం లేదని పేర్కొంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వినియోగదారు అయిన భారత్‌లో ఈ ఏడాది గోల్డ్ డిమాండ్ 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల వరకూ ఉండొచ్చని అంచనా వేసింది. ఇది 2020 నాటి కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గతేడాది బంగారం గిరాకీ 802.8 టన్నులుగా ఉందని స్వర్ణమండలి రీజినల్ సీఈఓ సచిన్ జైన్ వెల్లడించారు. ధరలు స్థిరంగా ఉంటే.. 2025లో డిమాండ్ 700 టన్నుల వరకూ ఉండొచ్చని, అయితే భౌగోళిక, రాజకీయ అంశాల ప్రభావంతో అది సాధ్యం కాకపోవచ్చని చెప్పారు. జూన్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర లక్ష దాటింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 28 శాతం పెరుగుదల కనిపించింది. మునుపటి ఏడాదితో పోల్చుకుంటే.. ఈ ఏప్రిల్-జూన్‌లో బంగారం వినియోగం 10 శాతం పడిపోయింది. ఆభరణాల డిమాండ్ 17 శాతం తగ్గగా, అదే సమయంలో పెట్టుబడి డిమాండ్ 7శాతం పెరిగింది. 2024లో సెప్టెంబర్ త్రైమాసికంతో 248.3 టన్నుల గిరాకీ ఉండగా.. ఈ ఏడాది ఇదే సమయానికి ఆ మొత్తంలో తగ్గుదల ఉండొచ్చని పేర్కొంది. మరోపక్క.. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిర పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు ఇది ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గంగా ఉంది. ఈ డిజిటల్ యుగంలో గోల్డ్ ఈటీఎఫ్‌లకు మంచి ఆదరణ ఉందని జైన్ వెల్లడించారు. ఇదిలా ఉంటే.. రికార్డు ధరల కారణంగా వినియోగదారులు చిన్నపాటి, తేలికైన ఆభరణాల వైపు మొగ్గుచూపుతున్నారు. వివాహాల కారణంగా కొనుగోళ్లు పెరగొచ్చనే అంచనాలున్నాయి.




# భారత్ వృద్ధికి ఢోకా లేదు: ఐఎంఎఫ్ అంచనా

**న్యూఢిల్లీ, జూలై 31:** భారత వృద్ధి రేట్లపై క్రమంగా అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల ఐఎంఎఫ్ దేశ జిడిపి 6.4శాతం మేర పుంజుకోగలదని అభిప్రాయపడింది. తాజాగా పలువురు ఆర్థికవేత్తలు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వృద్ధి 6.5శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు ప్రధానంగా అనుకూలమైన వడ్డీ రేట్లు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆదాయ పన్ను తగ్గింపు, పట్టణ డిమాండ్ పెరిగే అవకాశం వంటివి సహకరిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 3.7శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంటుందని భారతీయ రిజర్వ్ బ్యాంకు తెలిపింది. ఫలితంగా ఆర్‌బిఐ ఎంపిసి కీలక రేట్లలో మరో 25-50 బేసిస్ పాయింట్ల కోతకు నిర్ణయం తీసుకోవచ్చని పిడబ్ల్యూసి ఆర్థికవేత్తలు రానెన్ బెనర్జీ, మనోరంజన్ పటానాయక్ తెలిపారు. వడ్డీరేట్ల తగ్గింపు, పన్ను ఉపశమనం ఆర్థిక వ్యవస్థపై ఇప్పటికిప్పుడు కాకపోయినా ఆలస్యంగానైనా సానుకూల ప్రభావం చూపుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాల కారణంగా 2025-26 రెండో త్రైమాసికంలో కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు అంతకుముందు కంటే మెరుగ్గా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉండేలా చూసుకోవడానికి ప్రభుత్వం వచ్చే దశాబ్దం పాటు మౌలిక సదుపాయాల పెట్టుబడుల విషయంలో ఇదే ఊపును కొనసాగించాల్సిన అవసరం ఉందని బెనర్జీ స్పష్టం చేశారు. మరోవైపు, గ్రామీణంలో పెరుగుతున్న వేతనాలు ఆ ప్రాంతాల్లో వినియోగాన్ని పెంచుతుందని, తద్వారా మొత్తం ఆర్థిక కార్యకలాపాలకు ది మద్దతు ఇస్తుందని రానెన్ బెనర్జీ తెలిపారు. సాధారణం కంటే ఎక్కువ రుతుపవనాలు వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరుస్తాయని, గ్రామీణ డిమాండ్‌ను మరింత పెంచుతాయని ఆయన అన్నారు. అయితే ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న అనిశ్చితి వల్ల ఈ రంగం ఎగుమతులపై ఒత్తిడి ఉందని ఆయన పేర్కొన్నారు.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, జూలై 31:** భారత ఎగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు గురువారం అస్థిర సెషన్‌లో ప్రతికూలంగా ముగిసాయి. సెన్సెక్స్ 296.28 పాయింట్లు నష్టపోయి 81,185.58 పాయింట్ల వద్ద నిలిచింది. గురువారం ఈ సూచి 81,803.27 నుంచి 80,695.15 పాయింట్ల శ్రేణిలో ట్రేడ్ అయింది. నిఫ్టీ50 కూడా 86.70 పాయింట్లు నష్టపోయి 24,768.35 పాయింట్ల వద్ద నిలిచింది. టాటా స్టీల్, సన్‌ఫార్మా, ఎన్‌టిపిసి, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.70-1.34 శాతం రేంజ్‌లో ముగిశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్, ఐటిసి, కోటాక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్ల 3.61శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీలు వరుసగా 1.05 శాతం, 0.93శాతం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఎఫ్‌ఎంసిజి ఇండెక్స్ మార్కెట్ ధోరణులను అధిగమించి ఇమామీ, హిందుస్థాన్ యూనిలీవర్ నేతృత్వంలో 1.44శాతం లాభాలతో స్థిరపడింది. నిఫ్టీ ఫార్మా మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్ కేర్ సూచీలు ఒక శాతానికి పైగా నష్టాల్లో ముగిసాయి.

# పేటీఎం, గూగుల్‌పేకు ఐసిఐసిఐ ఝలక్

**ముంబై, జూలై 31:** యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గల్లీ దుకాణాల దగ్గర్నుంచి మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ పై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐబ్యాంకు భరిస్తోంది. ఈక్రమంలోనే ఖర్చులభారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు సిద్ధమైంది ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు తెలిసింది. ఐసీఐసీఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్‌పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలు చేయనున్నట్లు సమాచారం. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్‌పేమెంట్లు నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్ల




సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు.

# అదానీ ఎంటర్‌ప్రైజెస్ రాబడులు రూ.28 వేల కోట్లు!

**ముంబయి, జూలై 31:** అదానీ ఎంటర్‌ప్రైజెస్ తొలి త్రైమాసికంలో 49.5శాతం సమిష్టిలాభంలో క్షీణత చూపించింది. తొలి త్రైమాసికంలో కంపెనీకి 734.41కోట్లు మాత్రమే వచ్చిందని ప్రకటించింది. ఏడాదిక్రితం ఇదేకాలంలో రూ.1454.50 కోట్లు నికరలాభం ఆర్జించిన సంస్థ ఈ ఏడాది గణనీయంగా క్షీణించింది. క్రమానుగతంగా చూస్తే లాభాలు సుమారు 80శాతానికిపైగా తగ్గాయని నిపుణులు చెపుతున్నారు. గత త్రైమాసికంలో కంపెనీ అనూహ్యంగా లబ్ధిపొందింది. 3286 కోట్లు తన కోశా గారానికి రావడంతో లాభాలు పెరుగుదలను దోహదం చేసింది. ఇక మొత్తం రాబడులు పరంగాచూస్తే 9.7శాతం పెరిగి 27,961 కోట్లకు చేరాయి. అదే త్రైమాసికం వారీగాచూస్తే స్వల్ప వృద్ధి నమోదుచేసింది. 3.6శాతం మాత్రమేనని తేలింది. మొత్తంగా రాబడులుపరంగా వార్షిక పద్ధతిలో చూస్తే 13.7శాతం తగ్గాయి. ధరల్లో హెచ్చుతగ్గులు, సమీకృతవనరుల యాజమాన్యం, వాణిజ్య గనుల తవ్వకాలు వంటి వాటిలో నెలకొన్న ఒడిదొడుకులే రాబడులు కొంతమేర తగ్గాయి. ఇక నిర్వహణలాభం వరకూ చూస్తే 12శాతం తగ్గి 3786 కోట్లుగా ఉంది. ఈ మొత్తంలో 74శాతం అంటే 2800 కోట్లు అదానీ ఎంటర్ ప్రైజెస్ ఇంక్యుబేటిక్ బిజినెస్‌ల నుంచి వచ్చిందే. గ్రీన్ హైడ్రోజెన్, ఎయిర్ పోర్టులు, రోడ్లు, డేటా సెంటర్ ప్లాట్‌ఫామ్‌ల బిజినెస్‌లలో ఐదుశాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. జూన్ మాసాంతానికి కంపెనీ బాహ్యరుణాలు 52,667 కోట్లుగా ఉన్నాయి. అదే గత మార్చిలో 49,306 కోట్లనుంచి గణనీయంగా సమీకరించింది. మొత్తం రుణాల్లో 60శాతం ఎయిర్‌పోర్టులు, రోడ్లు, కొత్త పారిశ్రామిక పార్కుల్లోనే పెట్టుబడులుగా పెట్టింది. ఈ విభాగంలో 2026 నుంచి రాబడులు నగదు లభ్యత పెరుగుతుందన్న అంచనాలతో ఈ విభాగాలకు ఆదాని ప్రాధాన్యతనిచ్చింది.




# వాణిజ్యం

## భారీ ఆఫర్లు వచ్చినా ‘థింక్ మిషన్’కే మొగ్గు

**వాషింగ్టన్, జూలై 31:** ఇప్పుడిది కృత్రిమ మేధ యుగం. ఏఐ టాలెంట్ ఎక్కడ ఉన్నా లాగేసేందుకు టెక్ దిగ్గజాలు భారీ ఆఫర్లతో ఊరిస్తున్నాయి. కానీ ఓ ఏఐ స్టార్టప్ ఉద్యోగులు మాత్రం ఆ వలలో చిక్కలేదు. తమ సంస్థను నడిపిస్తోన్న మీరా మురాటీని ఒక్కరు కూడా విడిచివెళ్లలేదు. 2025 ఫిబ్రవరిలో థింకింగ్ మెషిన్స్ ల్యాబ్‌ను మీరా మురాటీ ఏర్పాటు చేశారు. మెటా, మిస్ట్రాల్, ఓపెన్‌ఏఐ వంటి కంపెనీల్లో పనిచేసిన 30 మంది పేరు పొందిన ఏఐ నిపుణులను ఆమె నియమించుకుంది. ఈ సంస్థలోని నైపుణ్యం మెటా (ఫేస్‌బుక్) దృష్టిని ఆకర్షించింది. దాంతో అక్కడ పనిచేసే ఏఐ నిపుణులను తనవైపు లాగేసుకునేందుకు మెటా ప్రయత్నించిందని, 10 మందికి పైగా ఉద్యోగులకు భారీ ఆఫర్లు ఇచ్చిందని ఓ కథనం వెల్లడించింది. ఈ ఏఐ నిపుణులకు 200 మిలియన్ల డాలర్ల నుంచి 500 మిలియన్ల డాలర్ల వరకు



మెటా ఆఫర్ చేసింది. ఓ ఉద్యోగికైతే ఏకంగా 1 బిలియన్ డాలర్లు (రూ.8,755 కోట్లు) ఇచ్చేందుకు కూడా సిద్ధమైంది. కొంతమందితో మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ నేరుగా సంప్రదింపులు జరిపారట కూడా. ఆ థింకింగ్ మెషిన్స్ ల్యాబ్‌ను పెట్టి సంవత్సరం కూడా కాలేదు. దాని నుంచి ఏ ఒక్క ఉత్పత్తి కూడా ఇంతవరకు మార్కెట్‌లోకి విడుదలవలేదు. కానీ ఆ సిబ్బంది మాత్రం మురాటీపై విశ్వాసం ప్రదర్శించారని ఆ కథనం వెల్లడించింది. ఇప్పుడు ఆ సంస్థ మార్కెట్ విలువ 12 బిలియన్ డాలర్లుగా ఉంది. మీరా మురాటీ అల్బేనియాలోని వ్లోర్ అనే పట్టణంలో జన్మించారు. స్కూలింగ్ అంతా అక్కడే పూర్తిచేసిన ఆమె.. పైచదువుల కోసం తన 16వ ఏట కెనడాలోని వాంకోవర్ ఐస్‌ల్యాండ్‌కు వెళ్లిపోయారు. ఆ దేశంలోనే పైచదువులు పూర్తి చేశారు. చదువు పూర్తయ్యాక 2011లో గోల్డ్‌మన్ శాక్స్‌లో ఇంటర్న్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత టెస్లాలో మూడేళ్ల పాటు పనిచేసింది ఆమె.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.